Dwaraka
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం | 24-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 193 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి సా. 4.17 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి ఉ. 8.34 తదుపరి అశ్వని; వర్జ్యం: రా. 4.23-5.58; దుర్ముహూర్తం: మ. 12.06-12.50; అమృతఘడియలు: ఉ. 7.48 వరకు; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.03 | నిజామాబాద్ సిటీ*
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai





దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ప్రసంగిస్తున్న మోదీ; దావోస్‌లో ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ ఐటీ, పురపాలన మంత్రి కేటీఆర్

భారత్ అంటేనే పెట్టుబడి

"ఇదివరకటి రెడ్ టేపిజం లేదు.. పెట్టుబడులకు రెడ్ కార్పెట్! లైసెన్సుల సంకెళ్లు లేవు.. వ్యాపార హిత వాతావరణమే ఉంది!!

భారత్ అంటే బిజినెస్! 2025 నాటికి భారత్ 3.18 కోట్ల కోట్ల రూపాయల ఆర్థికవ్యవస్థగా నిలవనుంది!! అదే ఏడాదికి మా దేశం ప్రపంచంలోనే మూడో అతి పెద్ద కన్స్యూమర్ మార్కెట్‌గా అవతరించనుంది! వ్యాపారానికి భారతదేశంలో గొప్ప అవకాశాలున్నాయి. రండి పెట్టుబడులు పెట్టండి" అంటూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో.. ప్రపంచంలోని అగ్రశేణి వ్యాపారవేత్తలనూ, 130 దేశాల ప్రతినిధులనూ ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. "మీకు కావాల్సినవన్నీ ఇండియాలో లభిస్తాయి.. పెట్టుబడులకు ఒకే ఒక గమ్యంగా మీరు భారత్‌ను ఎన్నుకోవచ్చు" అంటూ గ్లోబల్ సీఈవోలకు ఆహ్వానం పలికారు!!

రెడ్ టేపిజం లేదు; రెడ్ కార్పెటే.. ప్రధాని ఉద్ఘాటన

- మా అవసరాలు అనేకం, మీ సహకారం అవశ్యం
- అవకాశాల స్వర్గం మాది.. మీ వ్యాపార గమ్యం మేమే
- 2025కల్లా 5 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా భారత్
- మా రాష్ట్రాల మధ్య అభివృద్ధిలో పోటీ పెరిగింది
- ఉగ్రవాదం, వాతావరణ మార్పులే నేడు పెనుసవాళ్లు
- స్వీయ రక్షణ విధానం జగతికే చేటు: ట్రంప్‌పై విసుర్లు
- దావోస్ వేదికగా మోదీ చరిత్రాత్మక సందేశం

దావోస్, జనవరి 23: "భారత్ అంటేనే పెట్టుబడి.. వ్యాపారానికి భారతదేశంలో గొప్ప అవకాశాలున్నాయి" అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్ పరుస్తున్నామని.. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. "సంపద, సౌభాగ్యం కావాలంటే భారత్

మిగతా 16వ పేజీలో...

బాబుతో కేటీఆర్ భేటీ

దావోస్‌లో తెలుగు నేతల సమావేశం

లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

'సీట్ల' ఫైలు కదిలింది!

- ఎన్నికల కమిషన్‌కు పంపిన హోంశాఖ
- రిజర్వుడు స్థానాలకు ప్రాతిపదికేంటి?
- 2001 జనాభా లెక్కలా.. 2011వా?
- ఎస్సీలు ఎక్కువున్న చోటే పెంచాలా?
- ఈసీ అభిప్రాయం కోరిన కేంద్రం
- ఒకట్రెండు రోజుల్లో జవాబు?
- తర్వాత మరో 4 శాఖలకూ లేఖలు
- పునర్విభజనపై కసరత్తు ముమ్మరం



అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి పురోగతి కనబడుతోంది. తాజాగా కేంద్ర హోం శాఖ కొంత సమాచారం కోరుతూ ఎన్నికల కమిషన్‌కు తాజాగా ఫైలు పంపింది. నియోజకవర్గాల పునర్విభజన చేపడితే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలుపై ఈసీ తన అభిప్రాయం చెప్పాలని అందులో కోరింది. ఈ రిజర్వేషన్లను 2001 జనగణన లేదా 2011 జనాభా లెక్కల్లో దేని ప్రాతిపదికన చేయాలన్న దానిపై కొంత వివాదం నెలకొంది. 2001 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని 2008లో నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తమ రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ సీట్లు పెంచాలని కోరుతూ మూడు రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు

మిగతా 5వ పేజీలో...



హన్మకొండ గోపాలపురంలో నకిలీ బాబా పూజలు చేసే స్థలం

బ్లాక్ మెయిల్ బాబా గారు

- హోమాలు, యజ్ఞాల పేరుతో దోపిడీ
- కన్నె, నగ్న పూజల పేరిట లక్షల వసూళ్లు
- రెండేళ్ల కిందట గోదావరిఖనిలో వ్యాపారం
- బిచాణా ఎత్తేసి వరంగల్లో బాబా అవతారం
- 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించిన బాధితులు

వరంగల్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కిందట అతనొక మామూలు వస్త్ర వ్యాపారి. గోదావరిఖనిలో కాలం కలిసి రాక అప్పుల పాలయ్యాడు. ఓ అర్ధరాత్రి చెప్పా పెట్టకుండా ఉడాయించాడు. కాల చక్రం రెండేళ్లు గిర్రున తిరిగింది. భక్త జనం ఆయన ముందు మోకరిల్లుతోంది. ఆయనే తాంత్రిక పూజల పేరుతో హన్మకొండలోని గోపాల్‌పూర్‌లో జనాన్ని వంచిస్తున్న దొంగ బాబా గురూజీ లక్ష్మీనారాయణ! ఆయన అరాచకాలతో విసిగిపోయిన బాధితులు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'ని ఆశ్రయించారు. తమ గోడు వెల్లడించారు. తాజాగా, పోలీసులకూ ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు మంగళవారం దొంగ బాబాపై మూడు కేసులు నమోదు చేశారు. కుటుంబ సమస్యలతో వచ్చిన భార్యాభర్తలను దుర్గాదేవి మీద ప్రమాణం పేరిట బ్లాక్‌మెయిల్ చేస్తాడు. తొలుత

మిగతా 5వ పేజీలో...

సీజేఐ అభిశంసనకు పావులు

విపక్షాల్ని కూడగడుతున్న సీపీఎం

ఎన్సీపీ, జేడీయూ (రెబెల్) నేతలతో ఏచూరి చర్చలు 6

బీజేపీకి శివసేన రాంరాం!

2019 ఎన్నికల్లో ఒంటరి పోరు

అన్ని రాష్ట్రాల్లోనూ పోటీ: సేన 6

ఏసీబీ వలలో అవినీతి చేప

40వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్మూర్ ఆర్డీవో 3

మేడారానికి 2న కేసీఆర్



సారమ్మ గద్దె వద్ద మొక్కులు తీర్చుకుంటున్న డిప్యూటీ సీఎం కడియం.. మంత్రులు ఇంద్రకరణ్, మహేందర్ రెడ్డి,

ఉపరాష్ట్రపతి వెంకయ్యకూ ఆహ్వానం

- కుంభమేళాగా మహాజాతర: కడియం
- జాతర కోసం 4,200 బస్సులు: మహేందర్ రెడ్డి 2
- మరిన్ని మెరుగైన సౌకర్యాలు
- ఇంద్రకరణ్, చందూలాల్

మేడారంలో నేడు మండమెలిగే పండుగ



మాదీ వరే

పంట దిగుబడి కూడా అద్భుతమే

- కృష్ణా బేసిన్లో జనాభా, కరువు మాకే ఎక్కువ.. పరీవాహకమూ మాదే అధికం
- తప్పుడు వివరాలతో ఏపీ అఫిడవిట్.. కృష్ణా నీటి కోటాను మాకే పెంచాలి
- ఏపీ నీటి కోటాలో భారీ కోత కోయాలి.. ట్రైబ్యునల్‌కు టీ సర్కారు అఫిడవిట్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): "మా భూముల్లో వరితో పాటు అన్ని పంటలూ పండుతాయి. దిగుబడి కూడా అద్భుతంగా వస్తుంది. కృష్ణానది పరీవాహక ప్రాంతం మా రాష్ట్రంలోనే ఎక్కువ. కానీ.. కృష్ణా నీటి వినియోగం మాత్రం తక్కువ తెలంగాణలో కరువు తీవ్రంగా ఉంటుంది. జనాభా కూడా ఎక్కువ. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా నీటిలో తెలంగాణ కోటాను పెంచాలి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వాదన తప్పు" అని టీ సర్కారు స్పష్టం చేసింది. ఈ మేరకు కృష్ణా ట్రైబ్యునల్‌లో అఫిడవిట్ దాఖలు చేసింది. తెలంగాణలోని భూములు వరి పండించడానికి అనుకూలం కాదని, ఒకవేళ సాగు చేసినా సరైన దిగుబడులు రావని, అందువల్ల తెలంగాణకు కృష్ణా నీటి కోటాను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్

మిగతా 5వ పేజీలో...

13,116 మందిపై అనర్హత వేటు!

పోటీ చేసి లెక్కలు చూపని ఫలితం

'స్థానిక' ఎన్నికలకు మూడేళ్లు దూరం

- జాబితా పరిశీలిస్తున్న ఎస్ఈసీ
- ప్రస్తుతానికి తేలిన అనర్హులు వీరు
- మరింత పెరగనున్న సంఖ్య!
- పంచాయతీలు, ఎంపీటీసీల్లో అత్యధికం కరీంనగర్‌లోనే!
- జడ్పీటీసీల్లో నల్గొండ జిల్లా
- మునిసిపాలిటీల్లో రామగుండం

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి నిబంధనల ప్రకారం ఎన్నికల వ్యయం వివరాలు చూపని వారిపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కొరడా ఝుళిపించింది. రాష్ట్రవ్యాప్తంగా 13,116 మందిపై అనర్హత వేటు వేసింది! వీరంతా మూడేళ్లపాటు ఎలాంటి 'స్థానిక' పదవులకు పోటీ చేయలేరిక! 2013, 2014 సంవత్సరాల్లో జరిగిన స్థానిక ఎన్నికల్లో వివిధ

మిగతా 2వ పేజీలో...



ఏఎస్పీ, సీఐ సస్పెన్షన్

- సర్కారు అనుమతి లేకుండా నగరం దాటొద్దని ఏఎస్పీకి ఆదేశం
- సునీతారెడ్డిని మా ఇల్లిస్తాగం నుంచి తప్పించండి: డీజీపీకి ఏసీబీ లేఖ
- డీజీపీని కలిసిన భర్త సురేందర్‌రెడ్డి



పతి- పత్నీ.. ఔర్ సీఐ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకుని వివాదంలో చిక్కుకున్న అవినీతి నిరోధక శాఖ ఏఎస్పీ సునీతారెడ్డి, కల్వకుర్తి సీఐ మల్లికార్జున్‌రెడ్డిలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు

మిగతా 2వ పేజీలో...




కరీంనగర్‌లో పవన్ కల్యాణ్ సమావేశానికి హాజరైన కార్యకర్తలు

తెలంగాణ నా ప్రాణం!

ఆఖరి శ్వాస వరకు సేవ చేస్తా

- తెలంగాణను మనం కాపాడుకోవాలి.. అందుకు రక్తాన్ని ధారపోస్తా
- తెలుగు మహాసభలకు ఏపీ కవుల్ని పిలవలేదని మెసేజ్‌లు వచ్చాయి
- ఈ విషయాన్ని లేఖ ద్వారా ప్రభుత్వానికి తెలపాలని భావించాను
- తెలంగాణ ఉనికిని బలంగా చాటడానికే అలా చేశారని అర్థమైంది
- గతంలో ఈ భాషను, యాసను గౌరవించలేదని బాధ కలిగింది 6
- కేసీఆర్ స్మార్ట్‌గా పని చేస్తారని అంటే కొందరికి ఇబ్బంది కలిగింది
- మా అన్నయ్య కూడా కాంగ్రెస్ నేతే.. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు



'మేను' పోయినా 'నేను' ఉంటుంది



సనాతన ధర్మ విచారణలో పునర్జన్మ ప్రధానాంశం. మళ్లీ మళ్లీ జన్మ ఎత్తడం ఉన్నదన్న సంప్రదాయక, ఆధ్యాత్మిక భావన పునర్జన్మ. మరణ సమయంలో స్థిరమైన ఆలోచన మరుజన్మకు పునాది అని, కర్మ, ప్రారబ్ధాలు పూర్తికాకుండా మరణిస్తే, వాటిని అనుభవించడానికి మళ్లీ జన్మ వస్తుందని, ముక్తి లభించేదాకా జన్మలు వస్తూనే ఉంటాయని వింటుంటాం. కాస్త లోతుగా విచారిస్తే, తల్లి గర్భం నుంచి సమాధిగతమయ్యేవరకూ శరీరం మార్పు చెంది మరణ స్థితికి చేరుకుంటున్నది. కనుక మరణిస్తున్నది దేహమని అర్థమవుతున్నది. పంచభూతాత్మకం కనుక తిరిగి పంచ భూతాల్లో కలుస్తున్నది కనుక మరణం దేహానికే పరిమితమైన ఒక మహాద్భుత సృష్టి రహస్యం. జీవులందరికీ అనివార్య యోగం. అయితే నీట నానని, నిప్పున కాలని, గాలికి చెదరని, మంటి నుంచి మింటి వరకూ వ్యాపించిన ఆత్మకు పుట్టుకా లేదు, మరణమూ లేదని వేదాంత విచారణ. ఆత్మ సర్వవ్యాపకమని, సర్వశక్తిమంతమని నిజానికి ఉన్నదంతా ఆత్మేనేని పూర్ణాద్వైత భావన. మరణం తప్పని దేహం, మరణమెరుగని ఆత్మ కలిసి ఉండడం ఒక విచిత్ర స్థితి. అయినా అది ఒక యదార్థ స్థితి. ఇంతకీ 'నేను' 'మేను'ను భరిస్తున్నదా? 'మేను' 'నేను'ను ధరిస్తున్నదా?? రెంటిలో పునర్జన్మ లేని స్థితి దేని పరం? ఇచ్ఛా, క్రియా జ్ఞాన సమ్మేళనమై, విజ్ఞాన పరిపూర్ణమై, మనోబుద్ధి చిత్యహంకారాలకు అతీతమైన అహంస్ఫురణే.. 'నేను'. సర్వేంద్రియాలకు, మనసుకు అధిష్ఠానమైన, మూలమైన, ప్రేరకమైన 'నేను' ఆత్మకు పర్యాయపదం. ఒకటి నడిచేది, రెండోది నడిపించేది. నడిచేదానికి ఆగటం తప్పదు. నడిపించేదానికి నడక లేదు గనుక దానికి ఆగటం అంటూ లేదు. కర్మలు, వాటికి సంబంధించిన అనుభవాలు ఎప్పటికప్పుడే! ఎక్కడికక్కడే! జన్మలన్నీ ప్రవాహాలు. ఉన్నవన్నీ మలుపులు. సాగరసంగమం వరకూ జన్మంతా ఆగని చైతన్యధార.

-వీఎస్ఆర్ మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

Paramjyothi పరంజ్యోతి

రాజీవ్ రహదారికి జాతీయ హోదా

▸ గుజరాత్ కంటే మిన్నగా రహదారుల అభివృద్ధి: తుమ్మల



గోదావరిఖని, జనవరి 23: రాష్ట్రంలో రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా మార్చేందుకు చర్యలు చేపట్టామని, ఇందుకు కేంద్రం కూడా సూత్రప్రాయంగా అంగీకరించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఫ్లై ఓవర్లు, బైపాస్‌ల కోసం కేంద్రాన్ని ఒప్పించి జాతీయ రహదారిగా మార్చామన్నారు. రూ. 15 వేల కోట్ల నిధులతో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిని గుజరాత్ కంటే మిన్నగా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. రంగసాయిపేట, కేసముద్రం, నెక్కొండ, మహబూబాబాద్‌లను 135ఎల్ జాతీయ రహదారికి అనుసంధానిస్తామన్నారు. అలాగే జయశంకర్ జిల్లా ఆంశాన్‌పల్లి నుంచి వరంగల్ జిల్లా గొర్లవేడు, గరిమిలపల్లి, నేరేడుపల్లి తండా మీదుగా జమ్మికుంట, కరీంనగర్ వరకు 131 కిలోమీటర్ల జాతీయ రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. గోదావరి నదిపై వంతెన నిర్మాణానికి ఢిల్లీలో ప్రతిపాదన చేశామని, ఎల్‌డబ్ల్యూ నిధుల్లో చేర్చాలని కోరితే కేంద్రం ఒప్పుకుందన్నారు. తుపాకులగూడెం, దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఇరిగేషన్ ప్రాజెక్టులను విద్యుత్ కేంద్రాలతో అనుసంధానిస్తూ గోదావరి నది వెంట జాతీయ రహదారులను నిర్మించాలన్న ప్రతిపాదనకు మంజూరు లభించిందన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఎస్పీ సింగ్ ఆత్మీయ విందు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన కోసం హైదరాబాద్ వచ్చిన కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ కార్యదర్శి సీకే మిశ్రాకు సీఎస్ ఎస్పీ సింగ్ మంగళవారం రాత్రి ఆత్మీయ విందు ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని ఓ స్టార్ హోటల్‌లో ఇచ్చిన ఈ విందుకు పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు హాజరయ్యారు.

ప్రమాద రహిత డ్రైవర్లకు నగదు రివార్డులు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాద రహితంగా బస్సులు నడిపిన ఆర్టీసీ డ్రైవర్లకు నగదు ప్రోత్సాహకాలను అందించనుందని ఆ సంస్థ ఎండీ జీవీ రమణారావు తెలిపారు. రాష్ట్ర, జోనల్, రీజనల్ స్థాయిల్లో ముగ్గురేసి డ్రైవర్లను ఎంపిక చేసి.. ఈ నెల 24న నిర్వహించే రోడ్డు భద్రత ఉత్సవాల్లో ఈ ప్రోత్సాహకాలను అందిస్తామని వివరించారు.

మేడారానికి 2న సీఎం కేసీఆర్

▸ ఉపరాష్ట్రపతి వెంకయ్యకూ ఆహ్వానం

▸ కుంభమేళాగా మహాజాతర: కడియం

▸ మేడారంలో నేడు మండమెలిగే పండుగ

భూపాలపల్లి, హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారలమ్మ జాతరలో పాల్గొనేందుకు ఫిబ్రవరి 2న సీఎం కేసీఆర్ మేడారం రానున్నారు. ఇదే రోజు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. మేడారం జాతరకు సీఎం కేసీఆర్‌తోపాటు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ నరసింహన్‌ను కూడా ఆహ్వానించామని తెలిపారు. ఈ ఉత్సవాల కోసం కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జువల్ ఓరం, గిరిజన పార్లమెంటు సభ్యులు, అధికారులకూ ఆహ్వానాలు వెళ్లాయని వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడారంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం జాతర ఏర్పాట్లపై సహచర మంత్రులు, అధికారులతో కడియం సమీక్షించారు. అనంతరం కడియం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే మేడారం మహాజాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేసిందన్నారు. జాతర కోసం రూ.80.55 కోట్లు కేటాయించామన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారన్నారు. రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని జిల్లాల నుంచి భక్తులు మేడారంకు వచ్చేందుకు వీలుగా వివిధ ప్రాంతాల నుంచి 4,200 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మేడారం, తాడ్వాయి తదితర పాయింట్ల వద్ద భక్తుల కోసం టికెట్ల జారీ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. జాతర ప్రాంగణంలో 40 ఉచిత బస్సులు ఉంటాయన్నారు. జాతర కోసం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. గిరిజన సంక్షేమ మంత్రి చందూలాల్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి మేడారం ఉత్సవాలను చూస్తున్నానన్నారు. ఈ సందర్భంగా మేడారంలో వనదేవతలకు మంత్రులు మొక్కులు చెల్లించుకున్నారు. చందూలాల్ తన తూకానికి సరిపడా 74కిలోల బంగారాన్ని (బెల్లం) అమ్మవార్లకు సమర్పించుకున్నారు. మహాజాతర తొలిఘట్టంలో భాగంగా మేడారంలో బుధవారం మండమెలిగే పండుగ జరుగనుంది. ఇక మేడారం జాతర కోసం 7రోజుల పాటు ప్రత్యేకాధికారిగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను నియమించారు. కాగా మేడారం జాతరకు రావాలంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును బీజేపీ రాష్ట్ర నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆధ్వర్యంలోని నేతలు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



వనదేవత సన్నిధిలో గంటలు మోగిస్తున్న మంత్రులు

ప్రజల భాగస్వామ్యంతో భగీరథ నిర్వహణ

▸ మార్చిలో అన్ని గ్రామాలకు నీళ్లు: ఎస్పీ సింగ్

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథను ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అన్నారు. భగీరథలో ప్రజల భాగస్వామ్యంపై మంగళవారం ఎస్పీ సింగ్ ప్రారంభించిన వర్క్‌షాపులో సర్పంచులు, జిల్లా పంచాయితీ అధికారులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సింగ్ మాట్లాడుతూ.. కుల, మత, వర్గ, ధనిక, పేద తేడా లేకుండా సురక్షిత నీటిని అందరికీ సమానంగా అందించాలన్న భగీరథ సంకల్పంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు దేశానికే రోల్ మోడల్‌గా మారిందన్నారు. భగీరథతో గ్రామాల్లో ప్రతి ఒక్కరికి రోజుకు సగటున 100లీటర్లు అందిస్తామన్నారు. పది రోజుల్లో పైప్ లైన్ పనులు పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత 24,225 గ్రామాలకు బల్క్‌గా నీటిని అందిస్తామన్నారు. మార్చి 15నాటికి రాష్ట్రంలోని చివరి గ్రామానికి నీళ్లు అందుతాయన్నారు. ప్రతిఇంటికి మంచినీరు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని యునిసెఫ్ హైదరాబాద్ చీఫ్ రస్దియా అన్నారు. ఈ పథకంపై సెస్‌తో కలిసి సర్వే చేస్తున్నామన్నారు. అందరికీ సమానంగా నీరందేలా ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి తెలిపారు.

13116 మందిపై అనర్హత వేటు!

(మొదటి పేజీ తరువాయి...)

పదవులకు పోటీ పడి నిబంధనల ప్రకారం ఖర్చుల లెక్కలు చూపని వారిపై ఎస్ఈసీ దృష్టి సారించింది. ఇప్పటికి 13116 మందిపై అనర్హత వేటు వేయగా.. ఈ జాబితా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనర్హత వేటు పడిన వారిలో ఆరుగురు సర్పంచ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్, పంచాయతీరాజ్ సంస్థలకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి లెక్కలు సమర్పించని వారికి ఎస్ఈసీ తొలుత నోటీసులు జారీ చేస్తోంది. 20 రోజుల్లోగా ఎన్నికల ఖర్చుకు సంబంధించిన వివరాలన్నీ అందించాలని ఆదేశిస్తోంది. అలా వివరాలు అందించని, వివరణ సంతృప్తికరంగా లేని వారిపై మూడేళ్ల అనర్హత వేటు వేస్తోంది. ఎస్ఈసీ అనర్హత వేటు వేసిన వారి వివరాలు..

- కార్పొరేటర్/ కౌన్సిలర్ పదవులకు పోటీ చేసి అనర్హత వేటు పడిన వారు కొన్ని మునిసిపాలిటీల్లో 100కు మించి ఉన్నారు. వాటిలో అత్యధికంగా రామగుండం-363, కరీంనగర్-132, బోధన్-121, ఆదిలాబాద్-113 చొప్పున ఉన్నారు.
- జడ్పీటీసీ పదవికి పోటీ చేసి అనర్హత వేటు పడిన అభ్యర్థుల్లో నల్లగొండ జిల్లా నుంచి 81 మంది ఉన్నారు. ఇంకా సూర్యాపేట-55, యాదాద్రి భువనగిరి-32, కరీంనగర్-32, పెద్దపల్లి-31, రాజన్నసిరిసిల్ల-13, సిద్దిపేట-8, జయశంకర్ భూపాలపల్లి-8, వరంగల్ అర్బన్-7 వంతున ఉన్నారు.
- ఎంపీటీసీకి పోటీ చేసి అనర్హత వేటు పడిన వారిలో కరీంనగర్ నుంచి 282 మంది ఉన్నారు. నల్లగొండ-199, పెద్దపల్లి-185, యాదాద్రిభువనగిరి-104, రాజన్నసిరిసిల్ల-89, జయశంకర్‌భూపాలపల్లి-76, వరంగల్ అర్బన్-69, సిద్దిపేట-67, సూర్యాపేట-63, జనగాం-4 చొప్పున ఉన్నారు.
- సర్పంచ్, వార్డు సభ్యుల పదవికి పోటీ చేసి అనర్హత వేటు పడిన వారిలో గరిష్ఠంగా కరీంనగర్‌లో 3126 మంది ఉన్నారు. ఇంకా జగిత్యాల-2926, పెద్దపల్లి-1593, సిద్దిపేట-983, వరంగల్ అర్బన్-570, జయశంకర్ భూపాలపల్లి-347 మంది ఉన్నారు.

2013 పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి అనర్హత వేటు పడిన వారు		
సర్పంచ్	-	1088
వార్డు సభ్యులు	-	7303
2014 జడ్పీటీసీ, ఎంపీటీసీలకు పోటీ చేసి అనర్హత వేటు పడిన వారు		
జడ్పీటీసీ	-	267
ఎంపీటీసీ	-	1138
2014 మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేసి అనర్హతవేటు పడిన వారు		
కౌన్సిలర్, కార్పొరేటర్‌లు	-	2166

వెంపటి రవిశంకర్ కన్నుమూత



మెహిదీపట్నం/హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి నృత్యంలో ప్రపంచ ఖ్యాతి గాంచిన కళారత్న వెంపటి రవిశంకర్ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం రెండో కుమారుడు అయిన రవిశంకర్.. మణికొండలో నివాసం ఉంటున్నారు. అయితే కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో అస్వస్థతకు గురై కన్నుమూశారు. బుధవారం మణికొండ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆగిన బహు'జనుల' అక్షరం

▸ రచయిత ప్రభాకర్ హఠాన్మరణం

▸ నేడు సిరిసిల్లలో అంత్యక్రియలు



మచ్చ ప్రభాకర్

సిరిసిల్ల జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత, బహుజనుల చైతన్యానికి అక్షరాలు దిద్దిన మచ్చ ప్రభాకర్ ఇక లేరు. ముంబైలోని తన నివాసంలో మంగళవారం ఆయన గుండెపోటుతో మృతి చెందారు. ప్రభాకర్ అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామమైన సిరిసిల్లలో జరగనున్నాయి. కాగా.. ఈనెల 2న ప్రభాకర్ సతీమణి పుష్ప గుండెపోటుతో మృతి చెందారు. ఆమె మరణించిన 21రోజులకే ప్రభాకర్ మృతి చెందడం పలువురిని కలిచివేసింది. నేత కుటుంబంలో పుట్టి మహారాష్ట్రలో స్థిరపడిన ప్రభాకర్.. అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక పూర్వ కార్యదర్శిగా కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సంఘీభావ వేదికను ముంబైలో స్థాపించారు. ఆరేళ్లుగా.. ముంబైలో కార్మిక విముక్తి మాసపత్రికతో ఆయన అనుబంధం కొనసాగుతోంది.



పౌడర్ వాడక ముందు, పౌడర్ వాడిన తర్వాత..(ఫైల్)

ఎత్తు పెరగాలని పౌడర్ తిని యువకుడి మృతి

▸ టీవీలో ప్రకటన చూసి మందులు ఆర్డర్

▸ 2 నెలలుగా వాంతులు, విరేచనాలు బాధపడుతూ మృతి

వనపర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడి వయసు 18 ఏళ్లు. ఎత్తు 5 అడుగులు. తన స్నేహితుల కంటే పొట్టిగా ఉన్నానని ఎప్పుడూ మదన పడుతుండేవాడు. ఎలాగైనా ఎత్తు పెరగాలని అనుకునేవాడు. ఈ క్రమంలో ఒక రోజు టీవీ చూస్తుండగా ఎత్తు పెరిగేందుకు తమ మందులు వాడాలని ప్రకటన వచ్చింది. వెంటనే ఆ మందులను తెప్పించుకొని వాడాడు. అయితే, ఆ మందులు వికటించి 2నెలల తర్వాత మృతి చెందాడు వనపర్తిలోని బసవన్నగడ్డకు చెందిన ఖాజా నజీర్ అహ్మద్. మూడు నెలల క్రితం ఎత్తు పెరిగే మందులు తెప్పించుకున్న నజీర్.. 2నెలల క్రితం నుంచి వాడటం మొదలుపెట్టాడు. ఆ మందుల ప్రభావంతో మూడు రోజులకే వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఆస్పత్రిలో చూపించినా ఫలితం లేకపోయింది. 2 నెలలుగా తీవ్రంగా ఇబ్బందిపడుతూ మంగళవారం మృతి చెందాడు. మందులు వికటించాయని వాటిని పాడేశారు. అసలు నజీర్ ఏ మందులు ఆర్డర్ చేశాడు. ఎలా తీసుకున్నాడు.. అనే వివరాలు మృతుడికి తప్ప ఎవరికీ తెలియవు. దీంతో తమ కుమారుడి మరణానికి ఎవరిని నిందించాలో తెలియక ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. నజీర్ తండ్రి నాలుగేళ్ల క్రితమే మృతిచెందగా, నజీర్ అక్కను, నజీర్‌ను తల్లి పోషిస్తోంది.

ఏఎస్పీ, సీఐ సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. ఇన్‌స్పెక్టర్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉన్నారన్న ఆరోపణలతో పోలీస్ కేసు నమోదు కావడం, ఉన్నతాధికారుల నుంచి అందిన ప్రాథమిక నివేదిక ఆధారంగా సునీతారెడ్డిని విధుల నుంచి తప్పిస్తున్నట్లు పేర్కొంది. తమ అనుమతి లేకుండా హైదరాబాద్ దాటి వెళ్లొద్దని ఆమెను ఆదేశించింది. ఇక, కల్వకుర్తి సీఐ మల్లికార్జున్‌రెడ్డిపైనా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. కాగా, ఏసీబీలో ఇప్పటి వరకు పలు కీలక కేసుల దర్యాప్తుల్లో పాల్గొన్న సునీతారెడ్డిని తమ శాఖ నుంచి విత్‌డ్రా చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు డీజీపీ మహేందర్ రెడ్డికి లేఖ రాశారు. 'సునీతారెడ్డిని ఏసీబీ నుంచి విత్‌డ్రా చేయాలని డీజీపీకి లేఖ రాశాం.' అని ఏసీబీ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వివాహేతర సంబంధం వ్యవహారంలో విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీ మహేందర్ రెడ్డిని ఏఎస్పీ భర్త సురేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం డీజీపీని కలిసి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. తన సమస్యపై డీజీపీ సానుకూలంగా స్పందించారని, చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సురేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇదిలా ఉండగా, ఏఎస్పీ భర్త సురేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి సురేందర్‌రెడ్డి, అతడి తల్లి, అతడి స్నేహితుడు, సునీత తల్లి నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయగా, మంగళవారం ఉదయం ఇందు ఫార్చ్యున్ ఫీల్డ్స్ గార్డెనియా అపార్టుమెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. సునీత, మల్లికార్జున్‌రెడ్డిల స్టేట్‌మెంట్‌లను నమోదు చేసుకునేందుకు వారిని తమ ముందు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర నివేదికను త్వరలోనే ఏసీబీ ఉన్నతాధికారులు, నాగర్‌కర్నూల్ ఎస్పీకి అందజేయనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, పోలీస్‌శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. ఏఎస్పీ సునీతారెడ్డి, సీఐ మల్లికార్జున్‌రెడ్డి వ్యవహారం పోలీస్‌శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నందున వారిని సస్పెండ్ చేసినట్లు మంత్రి చెప్పారు.

ఆర్భాటాల్లేని నిఖా!

▸ అర్ధరాత్రుల్లు వేడుకలొద్దు

▸ ముస్లిం పెళ్లిళ్ల సంస్కరణల కోసం సర్కారుకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు వినతి

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) ముస్లింల పెళ్లిళ్లలో సంప్రదాయం పేరుతో అర్ధరాత్రి వరకు జరిగే ఆర్భాటాలకు స్వస్తి పలకాలని నిర్ణయించినట్టు తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఎమ్మెల్సీ మహ్మద్ సలీం తెలిపారు. ప్రధానంగా బరాత్‌లు, నృత్యాలు, సంగీత కచేరీల వంటి ఆర్భాటాలతో కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తాము గుర్తించామన్నారు. కొందరైతే నిఖా వేడుకలను తెల్లవారుజాము వరకు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో నిఖా వేడుకల కోసం సంస్కరణలను ప్రవేశపెట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్టు ఆయన తెలిపారు. ప్రతిష్ఠకు పోయి పెళ్లి వేడుకలను వైభవంగా నిర్వహిస్తుండడంతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా వక్ఫ్‌బోర్డు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు వివరించారు.

బెయిలుపై మందకృష్ణ విడుదల



జైలు నుంచి బయటకు వస్తున్న మందకృష్ణ

సైదాబాద్/హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్ష నేతలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చెప్పారు. ఈ నెల 27లోగా ఈ భేటీ ఉంటుందన్నారు. ఆయన చంచల్‌గూడ జైలు నుంచి మంగళవారం రాత్రి బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజాస్వామ్యం, ప్రజాహక్కులు లేవన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిజాం పాలన కంటే ఘోరంగా వ్యవహరిస్తుందన్నారు శాంతియుతంగా ప్రదర్శన, దీక్ష చేపడితే అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లేంతవరకు కేసీఆర్ ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మంద కృష్ణ విడుదల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మాల, మాదిగ ఎమ్మెల్యేలను చీపురు పుల్లల్లా చూస్తున్నారని మంద కృష్ణ ఆరోపించారు. సాంఘిక సంక్షేమ శాఖకు జగదీశ్వర్‌రెడ్డి మంత్రిగా ఉండటం దారుణమన్నారు. టీఆర్ఎస్ దళిత ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలు ఆత్మవంచన చేసుకోకుండా తమ పదవులకు రాజీనామా చేసి దళిత ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	7.1	31.0
హైదరాబాద్	16.1	31.4
సంగారెడ్డి	16.0	30.0
రామగుండం	16.4	31.0
వరంగల్	16.5	30.0

రాష్ట్రంలో కొనసాగుతున్న చలి

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మంలో 6 డిగ్రీలు, భద్రాచలంలో 5 డిగ్రీలు, హకీంపేట, మెదక్‌లో 3 డిగ్రీలు, మిగిలిన చోట్ల ఒక డిగ్రీ చొప్పున సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 7.4 డిగ్రీల మేరకు రాత్రి ఉష్ణోగ్రతల నమోదవ్వగా.. అక్కడక్కడా శీతల గాలులు వీచినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. రాగల నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే కొనసాగనున్నట్లు తెలిపింది.



సినిమాలు, టీవీలు యువతను చెడగొడుతున్నాయి

సినిమాలు, టీవీల్లో కార్యక్రమాలు యువత మానసిక పరిస్థితిని కల్మషం చేస్తున్నాయి. మంచి కంటే చెడునే అధికంగా చూపుతున్నాయి. దీంతో మనిషిలో చెడుగుణాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో పలు చోట్ల మహిళలపై లైంగిక వేధింపులు అధికమవుతున్నాయి. వారికి భద్రత కరువైంది. వారి భద్రత కోసం చేపట్టిన చర్యలేమిటో వివరిస్తూ కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం అఫిడవిట్‌లు దాఖలు చేయాలి.

- జస్టిస్ కృపాకరన్, మద్రాస్ హైకోర్టు జడ్జి



అల్లాకు, రాముడికి మధ్య పోటీ


బంత్వాల్ నియోజకవర్గం(దక్షిణ కన్నడ జిల్లా)లో వచ్చే ఎన్నికల్లో పోటీ అల్లాకు, రాముడికి మధ్య మాత్రమే. అల్లా దయ వల్లే 6సార్లు గెలిచినట్టు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేచెబుతున్నారు. అంటే ఆయనకు హిందువుల ఓట్లు అక్కర్లేదా?

- కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే వి.సునీల్‌కుమార్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.65	పాత ధర 68.66
కొత్త ధర రూ.76.70	కొత్త ధర 68.86
పెరుగుదల 00.05 పైసలు	పెరుగుదల 00.20 పైసలు

నీటి నుంచి సీసాన్ని తొలగించే నాచు



టోక్యో, జనవరి 23: మనం తాగే నీటిలో సీసం అతి తక్కువ మోతాదులో ఉన్నా కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే, సహజంగా పెరిగిన ఒక విధమైన నాచు నీటి నుంచి సీసాన్ని తొలగిస్తుందట. 'ఫ్యునేరియా హైగ్రోమెట్రికా' అనే నాచు నీటిలోని సీసాన్ని పీల్చుకొని నీటిని శుద్ధి చేస్తుందట. దీన్ని జపాన్‌లోని రికెన్ సెంటర్ ఫర్ సస్టేనబుల్ రిసోర్స్ సైన్స్ శాస్త్రవేత్తలు గుర్తించారు.

22% భారతీయుల్లో మలబద్ధకం

ముంబై, జనవరి 23: 'జంక్‌ఫుడ్ ప్రభావంతో 22% భారతీయులు మలబద్ధకంతో బాధపడుతున్నారు.' ఆరోగ్యసంస్థ అబోట్ నిర్వహించిన గట్ ఆరోగ్య సర్వేలో తేలిన విషయమిది. సర్వే ప్రకారం అత్యధికంగా కోల్‌కతాలో 28శాతం ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్, ముంబై, పట్నా, అహ్మదాబాద్, లఖ్‌నవ్‌లో తక్కువ మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని సర్వేలో తెలిసింది.

తెలంగాణలో నియంతృత్వ పాలన: జనశక్తి

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నియంతృత్వ పాలన సాగుతోందని జనశక్తి పార్టీ పేర్కొంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ పౌర హక్కులకు భంగం వాటిల్లదని హామీ ఇచ్చారని, సీఎం అయిన తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులు చేస్తున్నారని జనశక్తి రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ ఆరోపించారు. తెలంగాణలో విప్లవ శక్తులన్నీ ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఏసీబీ వలలో అవినీతి చేప

రూ.40వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్మూర్ ఆర్డీవో



ఆర్డీవో బాలె శ్రీనివాస్

ఆర్మూర్, జనవరి 23: వాటర్ ప్లాంట్ల యజమానుల నుంచి రూ. 40వేలు లంచం తీసుకుంటూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఆర్డీవో బాలె శ్రీనివాస్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. వాటర్ ప్లాంట్లను తెరిపించడానికి యజమానులను ఆర్డీవో రూ. 50 వేలు డిమాండ్ చేయగా, రూ. 40 వేలకు ఒప్పందం చేసుకుని హైదరాబాద్‌లోని అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. దీంతో వారు ప్రణాళిక ప్రకారం రసాయనాలు పూసిన 20 రూ.2వేల నోట్లని యజమానుల తరఫున బాదం రాజ్‌కుమార్ ఆర్మూర్‌లో ఆర్డీవోకు ఇంట్లోనే ఇవ్వగా వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జిల్లా అవినీతి నిరోధక శాఖాధికారులకు సమాచారం లేకుండానే హైదరాబాద్ నుంచి ప్రత్యేక అధికారులు వచ్చారు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ రమణ కుమార్, కరీంనగర్ డీఎస్పీ కిరణ్‌కుమార్, హైదరాబాద్, కరీంనగర్ ఇన్‌స్పెక్టర్‌లు సతీశ్‌కుమార్, వేణుగోపాల్, మరో నలుగురు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. ఆర్డీవో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు. డివిజనల్ స్థాయి అధికారి ఏసీబీకి చిక్కడం రెవెన్యూ శాఖలో కలకలం రేపింది. ఆర్మూర్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవంబరులో ఐఎస్ఐ మార్క్‌లేని 15 వాటర్ ప్లాంట్లను మూసేశారు. తాను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదని, కుట్రచేసి ఇరికించారని ఆర్డీవో శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వాటర్ ప్లాంట్లు సీజ్ చేశామన్నారు.

50 వేలు లంచం అడిగారు

వాటర్ ప్లాంట్లు తెరిపించడానికి ఆర్డీవో రూ. 50 వేలు లంచం అడిగారని ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ రమణ కుమార్ తెలిపారు. అంత ఇచ్చుకోలేమని చెప్పగా, రెండు వాటర్ ప్యూరిఫైర్‌లు కొనివ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. వీటి విలువ రూ. 40 వేలు ఉండడంతో నగదు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారని, తర్వాత తమను సంప్రదించగా వల పన్ని పట్టించుకున్నామని వెల్లడించారు. శ్రీనివాస్‌కు జగిత్యాలలో మూడు, హైదరాబాద్‌లో ఒక ఫ్లాట్ ఉందని, మేడ్చల్, బొల్లారంలో ఓపెన్ ప్లాట్లు ఉన్నాయని తెలిపారు.

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగులలో గోలి తిరుపతి రెడ్డి(30), నిశిత(25) దంపతులు మంగళవారం ఇంట్లో గొడవపడి ఇద్దరు పిల్లలతో పురుగు మందు తాగారు. నిశిత, ఆమె కుమార్తె హన్సిక(2) పరిస్థితి విషమంగా ఉంది. -హుజూరాబాద్

క్వింటా మిర్చి రూ.11,250



మానుకోటలో రికార్డు స్థాయి ధర

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 23: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మిర్చి ధర రికార్డు స్థాయికి చేరుకుంది. క్వింటా మిర్చి గరిష్ఠంగా రూ.11,250, కనిష్ఠంగా రూ.10,375, సగటున 10,720 ధర పలికింది. ఒక్క రోజులోనే రూ.575 పెరిగింది. ఖమ్మంలో మంగళవారం గరిష్ఠంగా రూ.10,800 పలికింది.

వరికి రుణపరిమితి రూ.34 వేలు..!

వ్యవసాయ శాఖ ప్రతిపాదన

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రానున్న వ్యవసాయ సీజన్‌లో వరికి రుణ పరిమితిని ఎకరానికి రూ.32 వేల నుంచి రూ.34 వేల వరకు నిర్ణయించాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. వచ్చే సీజన్‌కు రుణపరిమితి ఖరారు కోసం సహకార బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన తాజా సమావేశంలో ఈ ప్రతిపాదన చేసింది. ఎకరా వరి పంట సాగుకు రూ.28,066 వరకూ ఖర్చవుతుందని అంచనా వేసిన వ్యవసాయ శాఖ అదనంగా 15-20% వరకు ప్రతిపాదించింది. ఎకరా పత్తి సాగు ఖర్చును రూ.29,107గా అంచనా వేసిన వ్యవసాయ శాఖ రుణపరిమితిని రూ.34 వేల నుంచి రూ.35 వేలుగా ప్రతిపాదించింది. అలాగే మొక్కజొన్నకు రూ.18-20 వేలు, కందికి రూ.15-18 వేలు, పప్పుధాన్యాలకు రూ.15-20 వేల మేరకు రుణపరిమితిని నిర్ణయించాలని ప్రతిపాదించింది. మొక్కజొన్న, పప్పుధాన్యాల పంటలకు రుణపరిమితిని సాగు ఖర్చు కంటే 30% ఎక్కువగానే ప్రతిపాదించింది. ఈ పంటలను ప్రోత్సహించడంతో పాటు రైతులు ఒక పంట వేసి బ్యాంకు రికార్డుల్లో వరి, పత్తి వంటి రుణ పరిమితి ఎక్కువగా ఉన్న పంటలను సూచించకుండా రుణపరిమితిని ఎక్కువగా ప్రతిపాదించింది. రైతులు ఒక పంట వేసి ఇతర పంటలను రికార్డుల్లో రాసినప్పుడు ఆయా పంటలకు నష్టం వాటిల్లితే బీమా పరిహారం వర్తించదు. కాగా.. వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని సహకార బ్యాంకు ఆధ్వర్యంలోని కమిటీ రుణపరిమితిని ఖరారు చేస్తుంది.

నలుగురు రైతుల ఆత్మహత్య

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ : రాష్ట్రంలో మంగళవారం అప్పుల బాధతో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలో గంగాధర రాజం (53) సాగుకు, కుమారుడిని దుబాయికి పంపడానికి రూ.9 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరిగిపోవడంతో రాజం ఈనెల 12న పురుగుల మందు తాగాడు, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి తండాలో రాథోడ్ అనిల్ (33) పత్తి పంట దెబ్బతినడం, అప్పుల వారి వేధింపులు ఎక్కువ కావడంతో పురుగుల మందు తాగాడు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మోతీరా తండాలో బానోతు సంతోష్ (35) అప్పులు పెరిగిపోయి అవి తీరే మార్గం కానరాక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం రంగసాయి పల్లిలో యామ చంద్రకళ (41) తన రెండెకరాలతో పాటు మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తోంది. సాగుకు, భర్త చికిత్స కోసం 10 లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన చంద్రకళ పురుగుల మందు తాగింది.

నేడు మంచిర్యాల జిల్లా బంద్

రామాగౌడ్ ఆత్మహత్య కారకులపై చర్యకు డిమాండ్

తహసీల్ కార్యాలయం ఎదుట మృతదేహంతో బైఠాయింపు

మంచిర్యాల, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా నెన్నెల మండల టీడీపీ అధ్యక్షుడు రంగు రామాగౌడ్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్ కార్యాలయం ఎదుట మృతదేహంతో మంగళవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో బైఠాయించారు. బుధవారం మంచిర్యాల జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. అధికార పార్టీ నేతల భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేసినందుకు పల్ల మహేష్ అనే వ్యక్తితో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించి వేధిసున్నారని సోమవారం మంచిర్యాల ప్రజావాణి కార్యక్రమంలో రామాగౌడ్ పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం మృతదేహాన్ని నెన్నెలకు తీసుకురాగా గొడవలు జరిగే అవకాశం ఉందని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ పార్టీల నాయకులను అరెస్టులు చేశారు. అయినా నాయకులు, బంధువులు రామాగౌడ్ మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. రామాగౌడ్ కూతురికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని బెల్లంపల్లి ఏసీపీ బాలు జాదవ్ హామీ ఇచ్చారు.



మృతదేహంతో బైఠాయించిన అఖిలపక్ష నేతలు

మహాఆదిగలు మహారాజులే

విశారదన్ మహారాజ్ మహా కాలినడకకు వంద రోజులు

బచ్చన్నపేటలో శిలాఫలకం ఆవిష్కరణ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విశారదన్ మహారాజ్


బచ్చన్నపేట, జనవరి 23: తమ పూర్వీకుల చరిత్రను తెలియచెబుతూ జ్ఞానంతో వ్యక్తిత్వ నిర్మాణం చేసి తద్వారా ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించటమే తన పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యమని మహాఆదిగల ప్రతినిధిగా పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహారాజ్ అన్నారు. దళిత్ శక్తి ప్రోగ్రాం, జంబూద్వీప జన జాగృతి ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు 5 వేల కి.మీ కొనసాగనున్న పాదయాత్ర మంగళవారం జనగామ జిల్లా బచ్చన్నపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 102 రోజుల్లో 2,955 కి.మీ పాదయాత్ర పూర్తయిందన్నారు. ఇందుకు గుర్తుగా బచ్చన్నపేటలో శిలాఫలకం ఏర్పాటు చేశామని చెప్పారు. అక్టోబర్ 14న వనపర్తి నుంచి కాలినడక ప్రారంభమైందని, ఏప్రిల్ 14న వరంగల్‌లో ముగుస్తుందని వివరించారు. మహాఆదిగలు ఈ దేశాన్ని జంబూద్వీపం పేరుతో వేల ఏళ్లు పాలించినట్టు ఆధారాలున్నాయన్నారు. మొదటి సారి మహారాజులని పిలుపించుకున్న కులం మహాఆదిగలదని, మహాఆదిగ అంటే మొట్టమొదటివాడు, గొప్పవాడు, జ్ఞానవంతుడు అని అర్థమని పేర్కొన్నారు. మహాఆదిగలు తన పేరు చివర మహారాజ్, మహారాణి అని నామకరణం చేసుకోవాలని చెప్పారు. ఇప్పటి వరకు సాగిన మహాకాలినడకలో 2.20 లక్షల మందికి నామకరణం చేశామన్నారు.



గోదావరిఖనిలో రోజూ 'జనగణమన'

ఇక నుంచి రోజూ ఉదయం 52 సెకన్ల పాటు ఆ పట్టణ ప్రజలు ఎక్కడికక్కడే ఆగిపోతారు. ఎన్ని పనులున్నా అన్నీ పక్కనపెట్టేస్తారు. గుండె లోతుల్లోంచి దేశభక్తి ఎగజిమ్ముతుండగా.. జనగణమన అంటూ గొంతెత్తి దేశభక్తిని చాటిచెబుతారు. ఆ పట్టణమే పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, జాతీయ సమైఖ్యతను చాటి చెప్పేందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ ఆధ్వర్యంలో 'జనగణమనలో మనం' కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. 111 జాతీయ పతాకాలను ఆవిష్కరించి నిత్య జనగణమన గీతాలాపనను ప్రారంభించారు. ఆర్టీసీ చైర్మన్, రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, పోలీస్ కమిషనర్ విక్రమ్ జీత్ దుగ్గల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. - గోదావరిఖని

నేటి నుంచి శారదా పీఠం వార్షికోత్సవాలు



పెందుర్తి, జనవరి 23: విశాఖపట్నం చిన ముషిడివాడలోని శారదాపీఠం వార్షిక వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న ఈ వేడుకల సందర్భంగా.. హైందవ ధర్మ విశిష్టతను తెలిపేలా శ్రౌత, శాస్త్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు పీఠం శ్రీకార్యం తెలిపింది. గణపతి పుణ్యాహవచనం, రుత్విక్‌వరుణం, మహాగణపతి హోమంతో వేడుకలు ప్రారంభం అవుతాయి. ఇందులో భాగంగా మేధో దక్షిణామూర్తి, వనదుర్గ, వల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, దాసాంజనేయస్వామిలకు మహాకుంభాభిషేకం, జపాలు నిర్వహించనున్నారు. కృష్ణసంహితయాగం, యజుర్వేద సంహితయాగం, వనదుర్గా మహాయాగం, సుబ్రహ్మణ్య హోమాలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్యస్వామికి రథోత్సవం, తిరువీధి ఉత్సవం, వనదుర్గా కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా వల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ రథోత్సవం, తారకాసుర వధ నిర్వహించనున్నారు. వార్షికోత్సవ రోజుల్లో సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంగీత భక్తి విభావరి కార్యక్రమాలు ఉంటాయని పీఠం శ్రీకార్యం తెలిపింది.

పెరుగుతున్న అంతరాలు

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచార్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) సదస్సు ఆరంభానికి కాస్త ముందు అంతర్జాతీయ హక్కుల సంస్థ 'ఆక్స్‌ఫామ్' హెచ్చుతున్న ఆర్థిక అసమానతలను గుర్తుచేస్తూ నివేదిక విడుదల చేయడం జరుగుతున్నదే. సృష్టించిన సంపదంతా కొద్దిమంది కుబేరుల దగ్గర ఎట్లా పోగుపడుతున్నదో విన్నప్పుడల్లా ఆవేదనో, ఆగ్రహమో కలుగుతూనే ఉంటుంది. రెండు దశాబ్దాల తరువాత భారత ప్రధాని స్వయంగా దావోస్ వేదిక ఎక్కి, ఈ రెండు దశాబ్దాలకాలంలో తన దేశం జీడీపీని ఆరురెట్లు పెంచుకుని ఎంతవేగంగా అభివృద్ధి చెందిందో, అందుకు తమ వద్ద ఉన్న అపారమైన మానవశక్తి ఎలా దోహదపడిందో విప్పిచెబుతున్న తరుణంలోనే, ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక ఈ దేశంలోని కోట్లాదిమంది పేదల దుర్భరస్థితిని ఎత్తిచూపింది. ఈ వేదికపై గొప్పలతో పాటు, దేశ జనాభాలో ఒకశాతం దగ్గరే 73శాతం సంపద దాగివున్న విషయాన్ని కూడా చెప్పమంటూ మోదీని ఉద్దేశించి రాహుల్ ట్వీట్ చేయడం, దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్సే ఈ దుస్థితికి కారణమని బీజేపీ ప్రతివిమర్శ చేయడం చూసినప్పుడు, ఒక అమానవీయమైన పరిస్థితిని కూడా నాయకులు ఇంత తేలికగా ఎలా తీసుకుంటారని ఆశ్చర్యం కలుగుతుంది. పెరుగుతున్న అంతరాలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచుతాయనీ, తిరుగుబాట్లకు కారణమవుతాయన్న కనీస స్పృహ లేకుండా పాలకులకు లేకుండా వ్యవహరిస్తుండటం విచిత్రం.

భారతదేశంలో ఆర్థిక వ్యత్యాసాలు రెండు దశాబ్దాల కాలంలోనే రెట్టింపయిన విషయం ఎన్నడో తేలిపోయింది. ఆ ప్రక్రియ మరింత బలంగా వేగంగా సాగుతున్నదని ఆక్స్‌ఫామ్ నివేదిక రూఢీ పరుస్తున్నదంతే. ఏడాది కాలంలో దేశ జనాభాలో సగం మంది సంపద ఒకశాతమే పెరిగితే, భారతీయ బిలియనీర్ల సంపద దాదాపు 5లక్షలకోట్లు హెచ్చి, 20లక్షల కోట్లయింది. కొత్తగా ఓ పదిహేడు మంది బిలియనీర్లు కూడా వచ్చి చేరారు. బిలియనీర్ల సంఖ్యలూ, వారి సంపదలు ఏటా వేగంగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రజలను సత్వర ఆర్థికాభివృద్ధి మాయలో ముంచెత్తుతూ ఆస్మదీయుల పక్షాన పాలకులు నిలిచిన ఫలితం ఇది. కుబేరుల సంఖ్య పెరగడం ఆర్థికవ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. మరో రెండునెలల్లో భారతీయ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు 10లక్షల కోట్లకు చేరుకోబోతున్నాయంటూ వచ్చిన వార్త కూడా ఈ దేశంలో కుబేరుల సంఖ్య ఎందుకు పెరుగుతున్నదో తెలియచెబుతుంది. కొద్దిమంది సంపన్నులకు కాక, ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలనీ, కార్మికశక్తికి ప్రాధాన్యం ఇచ్చే రంగాలనే ప్రోత్సహించాలనీ, వ్యవసాయంలో పెట్టుబడులు పెంచాలనీ ఆక్స్‌ఫామ్ భారత పాలకులకు ఎన్నెన్నో సలహాలు ఇచ్చింది. కార్మికచట్టాలను నిర్వీర్యం చేసి, రెడ్‌టేప్ స్థానంలో రెడ్‌కార్పెట్ పరుస్తానంటూ పెట్టుబడిదారులను రమ్మంటున్న పాలకులకు ఈ సలహాలు పట్టవని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. 'రివార్డ్ వర్క్, నాట్ వెల్త్' అన్న హితవు చెవికెక్కేది కాదు.

ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదల చేసినప్పుడల్లా దానిని ధనిక వ్యతిరేకిగా అభివర్ణించడం, నివేదిక రూపకల్పనలో లోటుపాట్లను వెతకడం జరుగుతున్నదే. ప్రభుత్వాలు కుబేరులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రూపొందించిన విధానాలను విమర్శించడం, యథేచ్ఛగా సాగుతున్న పన్ను ఎగవేతలను ప్రశ్నించడం, కార్పొరేట్లకు ఇస్తున్న భారీ రాయితీలను తగ్గించమనడం, రాజకీయనాయకులకూ వాణిజ్యవేత్తలకూ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలను ఎత్తిచూపడం వంటివి ఆక్స్‌ఫామ్ చేస్తున్నది కనుక దానిపై ఈ తరహా ఎదురు దాడి జరుగుతూంటుంది. ఆశ్రిత పెట్టుబడిదారీతనాన్ని ప్రశ్నించడం, పేదలను కొట్టి పెద్దలకు దోచిపెట్టే విధానాలు ఇలాగే సాగితే ప్రజలు సహించరనడం కొందరికి నచ్చడం లేదు. ఎంచుకున్న విధానాన్ని ప్రశ్నించడం, గణాంకాల్లోని తారతమ్యాలను ప్రశ్నించడం ద్వారా ఈ నివేదికకు ప్రాధాన్యం ఇవ్వనక్కరలేదన్న వాదన ముందుకు వస్తున్నది. ఏడాది కాలంలోనే సంపదను పోగేసుకున్న ధనికుల సంఖ్యలో అది చేసిన సవరణలను, పేదలకు అది ఇచ్చే నిర్వచనంలోని లోపాలను, సంపదను లెక్కించే విధానాన్ని ఎత్తిచూపుతూ దాడి సాగుతున్నది. నివేదికను తయారుచేయడంలో ఉన్న సంక్లిష్టతను, ఎదుర్కొంటున్న సమస్యలను ఆక్స్‌ఫామ్ ఎన్నడూ దాచిపెట్టలేదు. ధనికుల ఆస్తిపాస్తుల లెక్కలు ఎక్కడైనా రహస్యమే. వెలికితీసి నిగ్గుతేలుస్తామంటే ఏ ప్రభుత్వమూ సహకరించదు. నివేదిక తయారీకి అది అనుసరిస్తున్న విధానంలో లోటుపాట్లు ఉండవచ్చునేమో కానీ, అగాథం విస్తరిస్తున్నదన్న, అంతరాలు హెచ్చుతున్నాయన్న దాని హెచ్చరిక మాత్రం వాస్తవం. 'ధనికుల సంపదను ధ్వంసం చేసినంత మాత్రాన పేదలు బాగుపడతారా?' అని ప్రశ్నిస్తున్నవారు తమకు నచ్చిన రీతిలో లెక్కకట్టినా, కోట్లాదిమంది పేదల సంపదతో సమానంగా వ్యక్తిగత సంపద ఉన్న కోటీశ్వరుల సంఖ్య కాస్తంత పెరగవచ్చునేమో కానీ, ఈ పేదలంతా కోటీశ్వరులుగా మారిపోరు.

స్మృతిగా మిగిలిన ప్రభాకర్

పాత కరీంనగర్, ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ (మం) పోత్గల్ గ్రామంలోని ఒక పద్మశాలి కుటుంబంలో మచ్చ ప్రభాకర్ పుట్టినాడు. ముస్తాబాద్‌లో మెట్రిక్యులేషన్, సిద్దిపేటలో ఇంటర్ చదివి, హైదరాబాద్ అడిక్‌మెట్ కాలేజిలో డిగ్రీ చేస్తుండగానే అనాటి విప్లవ ఉద్యమాలపై సాగిన నిర్బంధం వలన ప్రభాకర్ ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఫలితంగా అహ్మద్‌నగర్‌లో ఉన్న అమ్మమ్మ ఇంటికి వలసపోయాడు. అక్కడ ఒక సంవత్సరం నేతకార్మికునిగా పని చేసాడు. ఆ తరువాత ముంబై వెళ్ళి ఆంధ్ర పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఐదేళ్ళ క్రితం ఉద్యోగ విరమణ పొందాడు.


నివాళి
(1953–2018)

తెలంగాణలో 70వ దశకంలో జరిగిన విప్లవ పోరాటాల ప్రభావం నాటి యువకులందరితో పాటు ప్రభాకర్‌పైన పడింది. ముంబైలో ఉపాధ్యాయునిగా పని చేస్తూ కార్మికులను ఏకం చేసి అనేక ఉద్యమాలను నడిపించాడు. తెలంగాణ నుంచి వెళ్ళిన కార్మికులకు భావజాల శిక్షణ తరగతులను నిర్వహించాడు. మెరికల్లాంటి యువకులను తయారు చేశాడు. నేడు ముంబైలో కొనసాగుతున్న తెలుగు సాహితీ వేత్తలందరికీ దాదాపు గురువుగా నిలిచాడు.

దేశవ్యాప్తంగా విప్లవపోరాటాలపై చర్చోపచర్చలు జరుగుతున్న సందర్భంలో పూలే, అంబేడ్కర్‌లను ప్రభాకర్ అధ్యయనం చేశాడు. పూలేను తెలుగువారికి సాధికారికంగా పరిచయం చేసే ప్రయత్నం చేసాడు. తెలంగాణ అస్తిత్వ ఉద్యమంలో అఖిలభారత తెలంగాణ రచయితల వేదిక తొలి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తించాడు. మలి తెలంగాణ ఉద్యమాన్ని మరాఠీలకు పరిచయం చేసేందుకు ఒక పుస్తకం రాసిన అరుదైన సామాజిక ఉద్యమకారుడు ప్రభాకర్.

విప్లవ, సామాజిక, బహుజన వాదిగా ప్రభాకర్ జీవన యాత్ర మూడు దశలుగా కొనసాగింది. ఆయన నిన్న (జనవరి 23) ఉదయం ముంబైలో తీవ్ర మానసిక ఒత్తిడితో చనిపోయాడు. ఆయన భార్య మరణించి నెలరోజులు పూర్తి కాకుండానే ప్రభాకర్ ఆకస్మిక మృతి చెందడం విషాదం.

సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా ప్రభాకర్ నాతో గంటలకు గంటలు ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సంక్షోభాలపైన చర్చించేవాడు. 3నెలల క్రితం సిరిసిల్లకు వచ్చినప్పుడు తెలంగాణలో కాకతీయుల నుంచే చెరువుల నిర్మాణం జరిగాయి అనడం పాక్షిక సత్యం అన్నాడు. ఇటీవల ఫాహియాన్ యాత్ర పుస్తకాన్ని, కాకతీయులకు ముందున్న నీటి వసతి, వ్యవసాయం చరిత్రను చదువుతున్నన్నాడు. తెలంగాణలోని నీటి నిలువలు, రవాణా సంబంధాలపై కొత్త విషయాలు కోణాలు చాలా వున్నాయి. నోట్స్ రాస్తున్నాను. వాటిని తప్పక పుస్తక రూపంలో తెస్తానని చెప్పాడు. కానీ అది పూర్తి చేయకుండానే మచ్చ ప్రభాకర్ బాధాకరంగా సాంస్కృతిక చరిత్రలో చరిత్రగా మిగిలిపోయాడు. ఇప్పటి వరకు 3 కవితా సంకలనాలు, 5 వ్యాసాల పుస్తకాలను తీసుకువచ్చాడు. మచ్చ ప్రభాకర్ నిత్య చలన క్రియాశీలి. ఆయన మరణం తెలుగు సాహిత్యంలో ఒకానొక లోటు.

■ జూకంటి జగన్నాథం

కమల రాజకీయం, కాషాయ భారతం

ఇండియాగేట్


■ ఎ. కృష్ణారావు

దేశ రాజకీయాలలో బీజేపీ అధినేతలు ఏది తల్చుకుంటే అదే జరుగుతున్న రోజులివి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మోదీ, అమిత్ షాలు కలకలం రేపేందుకు యత్నిస్తున్నారు. కర్ణాటకలో జెడి (ఎస్), తమిళనాడులో ద్రవిడ పార్టీలు సైతం మినహాయింపు కాదు. ఎటొచ్చీ దేశంలో ఉన్న అన్ని పార్టీల్లో కాంగ్రెస్, వామపక్షాలే అస్తిత్వ పరీక్షలో ఉన్నాయి.

ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో జయప్రకాశ్ నారాయణ్ కనుక జనసంఘ్‌ను కూడా కాంగ్రెసేతర పార్టీల కూటమిలో చేర్చి ఉండకపోతే జనసంఘ్‌కు జాతీయ స్థాయిలో ఆమోదయోగ్యత లభించి ఉండేదా, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ రూపంలో 'ఇంతింతై.. వటుడింతయై అన్నట్లు ఎదిగి ఉండేదా' అని ప్రశ్నలు వేసేవారు చాలా మంది ఉన్నారు. కాని రాజకీయాల్లో అందిన అవకాశాన్ని ఉపయోగించుకుని విస్తరించడం అనేది అభ్యంతరకరం ఎలా అవుతుందని ప్రశ్నించేవారు కూడా ఉన్నారు.

ఈ ఎదుగుదల ఎలా జరిగిందో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బాగా తెలుసు. 1995లో చండీగఢ్‌లో ఒక యువ మోర్చా నేత ఇంటి ఔట్ హౌస్‌లో ఒక గదిలో మోదీ బస చేసి హర్యానా, పంజాబ్, హిమాచల్ లలో బిజెపిని విస్తరింపచేసే బాధ్యత తీసుకున్నారు. మొదటి లక్ష్యం చండీగఢ్‌ను జయించడం. అప్పటివరకూ అక్కడ బిజెపి విజయం సాధించ లేదు. చండీగఢ్ అంతా తిరిగి ప్రజలతో మోదీ సంబంధాలు పెట్టుకున్నారు. పార్టీని పటిష్ఠం చేశారు. తొలిసారి కంప్యూటర్ వ్యవస్థ ప్రవేశపెట్టారు. 1996 డిసెంబర్‌లో చండీగఢ్ మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో బిజెపి–అకాలీదల్ కూటమి 20 స్థానాలకు గాను 19 సీట్లు గెలిచింది. ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లో కూడా చండీఘడ్ బిజెపి కైవశమైంది. వాజపేయి 14 రోజుల ప్రభుత్వానికి అకాలీదళ్ మద్దతునిచ్చేలా చేసిన మోదీ, ఆ తర్వాత బిజెపి–అకాలీదళ్ మైత్రి మరింత బలపడేలా చూశారు. తత్ఫలితంగానే పంజాబ్‌లో అకాలీదళ్–బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది.

1995లో మోదీ అడుగుపెట్టేనాటికి హర్యానాలో కూడా బిజెపికి అంత బలం లేదు. 1991 లోక్ సభ ఎన్నికల్లో హర్యానాలో పోటీ చేసిన పది సీట్లలో 9 సీట్లలో బిజెపి డిపాజిట్ కోల్పోయింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 80 సీట్లకు పోటీ చేసి రెండు సీట్లు దక్కించుకుంది. హర్యానాలో బిజెపి స్వంతంగా అధికారంలోకి రాలేదని మోదీ గ్రహించారు. తొలుత బన్సీలాల్ నేతృత్వంలోని హర్యానా వికాస్ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని 1996 లోక్ సభ ఎన్నికల్లో బిజెపి పోటీ చేసిన ఆరు సీట్లలో 4 సీట్లు దక్కించుకునేలా చూశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి 11 సీట్లు లభించాయి. రెండు పార్టీలూ కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆ తర్వాత బన్సీలాల్ సర్కార్ కు మద్దతు ఉపసంహరించుకుని భారత జాతీయ లోక్ దళ్ నేత చౌతాలాకు స్నేహహస్తం చాచారు. అప్పుడు హర్యానా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి మనోహర్ లాల్ టక్కర్ తో సహా పార్టీ నేతలందరికీ మోదీయే కంప్యూటర్ లో శిక్షణ నిప్పించారు.

హిమాచల్ లో కూడా మోదీ చక్రం తిప్పారు. తొలుత హిమాచల్ క్రాంతి మోర్చా అన్న చిన్న పార్టీని బిజెపిలో విలీనం చేసుకున్నారు. తర్వాత సుఖ్ రామ్ ఆధ్వర్యంలోని హిమాచల్ వికాస్ కాంగ్రెస్ తో చేతులు కలిపి వీరభద్ర సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టి ప్రేమ్ చంద్ దుమాల్ ముఖ్యమంత్రి అయ్యేలా చూశారు. క్రమంగా హిమాచల్ లో కాంగ్రెస్ కు బిజెపి ఏకైక ప్రత్యామ్నాయంగా మారింది.

ఈశాన్యంలో బిజెపి విస్తరించిన తీరు ఆసక్తికరంగా ఉన్నది. అస్సాంలో అస్సాం గణపరిషద్, బోడో పీపుల్స్ ఫ్రంట్ తో చేతులు కలిపి హిందూ జాతీయవాదం, అక్కడ ఉపజాతి భావోద్వేగాలను మేళవించి ఘన విజయం సాధించిన బిజెపి, ఈశాన్య ప్రజాస్వామ్య కూటమిని ఏర్పర్చి విస్తరిస్తోంది. తొలుత అరుణాచల్, మణిపూర్ లలో ప్రభుత్వాలను ఏర్పర్చిన బిజెపి కొద్ది రోజుల్లో జరగబోయే మేఘాలయ, నాగాలాండ్, త్రిపురల్లో కూడా కాషాయ ధ్వజం ఎగురవేసేందుకు ప్రయత్నిస్తోంది.

ప్రస్తుతం హిమాచల్ లో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నది. అక్కడ ఒకప్పుడు బిజెపితో చేతులు కలిపిన చిన్నా చితక పార్టీలేమీ లేవు. ఒకప్పుడు ఇందిరాగాంధీ కుడిభుజంగా ఉండి అనేక పదవులు అనుభవించిన బన్సీలాల్ తర్వాత స్వంత పార్టీ పెట్టుకుని బిజెపి తో చేతులు కలిపి అనామకంగా మరణించారు. హర్యానా వికాస్ పార్టీ కాంగ్రెస్ లో విలీనమై అంతర్ధానమైంది. పంజాబ్ లో అకాలీదళ్ తో బిజెపి స్నేహం సాఫీగా ఏమీ గా సాగడంలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత బిజెపి స్వంతంగా విస్తరించే ప్రయత్నం చేస్తోంది. గురుద్వారాల్లో ప్రవేశించేందుకు ఉత్సాహపడుతోంది. 1984లో సిక్కుల ఊచకోతపై కేసును తిరగదోడి సిక్కుల మద్దతును కూడగట్టాలనుకుంటోంది. హిందువులు, సిక్కులు ఒకటేనన్న ప్రచారం సాగుతోంది. ఈశాన్యంలో బిజెపితో చేతులు కలిపిన చిన్నా చితక పార్టీలు కూడా తర్వాతి కాలంలో అస్తిత్వ పరీక్షను ఎదుర్కొనే అవకాశాలు కూడా లేకపోలేదు. కాశ్మీర్ లో బిజెపితో చేతులు కలిపిన పిడిపి పూర్తి విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఒక్క బిహార్ లోనే నితీశ్ కుమార్ తో బిజెపి ప్రేమబంధం ఇప్పటికి ఎటువంటి చిటపటలు లేకుండా సాగుతోంది. ఒడిషాలో ఒకప్పుడు ఎన్డీఏలో భాగస్వామ్య పార్టీ అయిన బిజూ జనతాదళ్ కు వచ్చే ఎన్నికల్లో బిజెపి ప్రధాన ప్రత్యర్థిగా మారి గట్టి పోటీ నిచ్చేస్థాయికి ఎదిగింది. పశ్చిమ బెంగాల్ లో కూడా వచ్చే ఎన్నికల్లో బిజెపి గట్టి పోటీ ఇస్తుందని ఇటీవల ఒక సర్వే తేల్చింది. తృణమూల్ కూడా ఒకప్పుడు బిజెపితో చేతులు కలిపి బయటపడ్డ పార్టీయే.

మహారాష్ట్రలో తన చిరకాల భాగస్వామి అయిన శివసేనను కూడా అధిగమించాలని బిజెపి భావిస్తోంది 2019లో జరిగే లోక్ సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని శివసేన మంగళవారం ప్రకటించడంతోనే బిజెపితో ఆ పార్టీ ఎలా వేగలేకపోతోందో అర్థమవుతోంది. గత మూడు సంవత్సరాలుగా నరేంద్ర మోదీ తమను తొక్కి పెట్టేందుకు అనుసరిస్తున్న విధానాలు, ఆర్థిక విధానాలను శివసేన కారణాలుగా చూపుతోంది, గతంలో మాదిరి బిజెపికి శివసేన అంత అవసరం లేదు. రిపబ్లికన్ పార్టీ, రాష్ట్రీయ సమాజ్ పార్టీ వంటి చిన్న పార్టీల మద్దతును సమీకరిస్తూ మహారాష్ట్రంలో బిజెపి స్వతంత్రంగా బలపడేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే ముంబాయి మునిసిపల్ ఎన్నికల్లోనూ, గుజరాత్ లోనూ శివసేన వేరుగా పోటీ చేసినా బిజెపి లెక్క చేయలేదు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో శివసేన తమతో కలిసి పోటీ చేయకపోయినా మోదీ పట్టించుకునే అవకాశం లేదు.

నిజానికి కాంగ్రెస్ ముక్త భారత్ ను ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పుకుంటున్నారు కాని వారిద్దరి లక్ష్యం ప్రాంతీయ లేదా ఆయా రాష్ట్రాలకు పరిమితమైన పార్టీలను అంతం చేయడమేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంలో తన, మన అన్న భేదాన్ని బిజెపి ఏమీ పాటించదలుచుకోనట్లు మిత్రపక్షాలతో అనుసరిస్తున్న వైఖరిని బట్టి అర్థమవుతోంది. ఒక మిత్రపక్షం ఉండగానే మరో పార్టీకి ప్రేమ సంకేతాలు పంపడం, తమ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు అవసరమైనంత అండదండలివ్వకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

మిత్రపక్షాలే కాదు, ఏ పార్టీని బిజెపి నిద్రపోనివ్వడం లేదు. అయిదేళ్ల క్రితం తనను నిలువరించి ఢీకొన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ను అంతం చేసేందుకు బిజెపి ఆది నుంచీ ప్రయత్నాలు చేస్తున్నది. కేజ్రీవాల్ కు అష్టకష్టాలు సృష్టించడం మోదీకి క్రీడా వినోదంలా కనపడుతోంది. లేకపోతే రెండురోజుల్లో పదవీ విరమణ చేస్తానని తెలిసి కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్, గుజరాత్ మాజీ అధికారి ఎటువంటి విచారణ లేకుండా 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా నిర్ణయించడమేంటి, ఆ వెంటనే ఆదివారం నాడు కూడా ప్రస్తుత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆ నిర్ణయానికి ఆగమేఘాలపై ముద్రవేయడమేమిటి అన్న ప్రశ్నలు తలెత్తేవే కావు. కాంగ్రెస్ హయాంలో లాభసాటి పదవులు పాత తేదీ నుంచి కొనసాగించవచ్చనే బిల్లుకు 2006లో పార్లమెంట్ చేసిన చట్టాన్ని ఆమోదించిన చరిత్ర ఉండగా, అదే కాంగ్రెస్ నుంచి వచ్చిన ఇదివరకటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అదే రీతిలో పాతతేదీతో పదవులు ఆమోదించవచ్చని కేజ్రీవాల్ సర్కార్ చేసిన బిల్లును తిరస్కరించడంలో మతలబు ఏమిటి అన్న సందేహానికి కూడా విలువ లేకుండా పోయింది. బిజెపి అధినేతలు ఏది తల్చుకుంటే అదే జరుగుతున్న సమయంలో భారతీయ సంప్రదాయంలో అమూల్యమైన హేతుబద్ధత, తర్కం అనేవాటికి దేశంలో చోటులేకపోవడంలో ఆశ్చర్యం లేదు.



అయినా బిజెపి దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ పార్టీ రాజకీయాల్లో వేలు పెట్టలేదని అనుకోవాలి? ప్రతి రాష్ట్రంలోనూ బిజెపి తలదూర్చి సాధ్యమైనంత ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తోంది. ప్రతి రాష్ట్రంలోనూ అన్ని పార్టీలు బిజెపి రాజకీయ ప్రభావానికి గురవుతున్నాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మోదీ, అమిత్ షాలు కలకలం రేపేందుకు యత్నిస్తున్నారు. కర్ణాటకలో జెడి (ఎస్), తమిళనాడులో ద్రవిడ పార్టీలు కూడా మినహాయింపు కాదు. ఎటొచ్చీ దేశంలో ఉన్న అన్ని పార్టీల్లో కాంగ్రెస్, వామపక్షాలే అస్తిత్వ పరీక్షలో ఉన్నాయి. 1975లో జనసంఘ్ ను సామ్రాజ్యవాద శక్తిగా, ఆర్‌ఎస్‌ఎస్ ను పారామిలటరీ ఫాసిస్టుగా అభివర్ణించిన సుందరయ్య వాటితో కలిసి పనిచేయాలన్న సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ మెజారిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో పదవులకు రాజీనామా చేశారు. ఇప్పుడు 42 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ తో కలిసి పనిచేయాలన్న తన ప్రతిపాదన కాదన్నందుకు సీతారాం ఏచూరి పదవుల నుంచి తప్పుకుంటానని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. 'చరిత్ర పునరావృతమవుతుంది ఒకసారి విషాదంగా, మరోసారి బూటకపు ప్రహసనంగా' అని కార్ల్ మార్క్స్ ఊరికే అనలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పంచాయతీ ఎన్నికల్లో ఎంబీసీ కోటా

ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంచాయతీ రాజ్ చట్ట పునర్వ్యవస్థీకరణకు తగిన ప్రతిపాదనలను సమర్పించమని రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం హర్షణీయం. పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ సర్పంచ్‌లకు విశేష అధికారాలు కల్పించి, ఆర్థిక వనరులను సమకూర్చుకొనే విధంగా స్థానిక సంస్థల విధానాన్ని సంస్కరించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఎంతో పెద్ద సమస్యల్ని అవలీలగా పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రికి ఎంబీసీల సమస్యలను పరిష్కరించడం పెద్ద కష్టం కాదు.



తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి వెనుకబడిన తరగతుల వారికి ఎన్నోరకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. 2017–2018 బడ్జెట్‌లో బీసీలకు దాదాపు 5070 కోట్లు కేటాయించారు. ఇప్పుడు 20 మంది బీసీ శాసన సభ్యులలో ముగ్గురు, 9 మంది విధాన మండలి సభ్యులలో ఇద్దరు, 9 మంది జెడ్పీ ఛైర్మన్‌లలో ఒక్కరు, 196 మంది జెడ్పీటీసీలలో 62 మంది, 209 మంది ఎంపీపీలలో 74 మంది, 3267 మంది ఎంపీటీసీలలో 1029మంది, 4142 మంది సర్పంచ్‌లలో 1369 మంది ఎంబీసీలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 112 కులాలను బీసీ కులాలుగా గుర్తించింది. కానీ అందులో 5 నుంచి 7 కులాల వారికి మాత్రమే అన్నిరకాల లబ్ధి అందుతున్నది. బీసీలలో అత్యధిక జనాభా కలిగిన ఎంబీసీలకు ఆ ఫలాలు దక్కడం లేదు. మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు ఆమోదించిన ముసాయిదాను ముఖ్యమంత్రికి సమర్పించడం జరిగింది. త్వరలో పంచాయతీ ఎన్నికలను జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఎంబీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తగుచర్యలు తక్షణం చేపట్టాల్సిన అవసరముంది. ఎంబీసీ కోటాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి న్యాయం చేయాలి.

■ కె.సి. కాలప్ప
అధ్యక్షులు, జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం

నవదౌత్యంలో ఆసియాన్

నేటి అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రాంతీయ కూటములు కీలకంగా పరిణమించాయి. ముందుగా అయిదు దేశాలతో ఆవిర్భవించి, తదుపరి మరో అయిదు దేశాలను సభ్యదేశాలుగా స్వీకరించి, ప్రస్తుతం పది సభ్య దేశాల ప్రాంతీయ కూటమిగా పరిఢవిల్లుతున్న ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఆసియాన్) గత సంవత్సరమే 50వసంతాలు పూర్తిచేసుకున్నది. బ్రూనే, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, వియత్నాం నేటి ఆసియాన్ సభ్య దేశాలు. భారత్, చైనా, జపాన్, దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలతోనూ, ఇంకా అనేక ప్రాంతీయ అంతర్జాతీయ సంస్థలతోనూ ఆసియాన్ విస్తృత భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. ఇది ఆసియా ఖండంలోనే సంస్థాగతంగా అత్యంత పటిష్ఠమైన ప్రాంతీయ కూటమి. ప్రాంతీయ బహుపాక్షికత ఆచరణలో ఎంత విజయవంతంకాగలదో నిరూపించిన అద్భుతమైన ఉదాహరణ.

ఆసియాన్ దేశాలు కేవలం చర్చలతో సరిపెట్టక, చేతలలో సైతం చక చకా ముందుకు పోయి, తమ మధ్య ఆర్థిక సంబంధాలను దృఢ పరచుకొని ఉమ్మడి ఆర్థిక సమగ్రతను సాధించాయి. ఒకప్పుడు యుద్ధాల కారణంగా చితికిపోయిన, కడు పేదరికంలో మగ్గిన సభ్యదేశాలను కలిగివున్న ఆసియాన్ నేడు ఒక అంతర్జాతీయ శక్తి గృహంగా రూపాంతరం చెందింది. 1970లో 95 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న మొత్తం ఆసియాన్ సమిష్టి జిడిపి, 2016 నాటికి 2.55 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. ఇది 2027 నాటికి 6.4 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఒకే దేశంగా పరిగణించబడినట్లయితే అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, ఇంగ్లాండుల తరువాత ప్రపంచంలోనే ఆరవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ఆసియాన్. ఫ్రాన్స్ కూడా ఇంచుమించు అదే స్థానంలో ఉంది. 2050 నాటికి ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆసియాన్ పుంజుకోగలదు. ఆసియాన్ నేడు ప్రపంచపు వృద్ధి యంత్రమని కొందరు ఆర్థికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

మొదటి ఐదు ఆసియాన్ సభ్య దేశాలైన థాయిలాండ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ గతంలో వివిధ స్థాయిల్లో అంతర్గత కమ్యూనిస్ట్ తిరుగుబాట్లతో బాధపడ్డప్పటికీ, విజయవంతంగా అధిగమించాయి. ఆసియాన్ విజయం తూర్పు ఆసియాలో జియో పాలిటిక్స్, జియో ఎకనామిక్స్ స్వరూపాన్ని మార్చివేసింది. ఆసియాన్ దౌత్య బలం తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియాలో మాత్రమే కాకుండా విస్తృత హిందూ, పసిఫిక్ మహాసముద్రాల ప్రాంతంలో, మొత్తం ప్రపంచంలోనే ప్రగాఢంగా, ప్రభావవంతంగా పనిచేస్తున్నది.

విశ్వకవి ఠాగూర్ ఇండోనేషియా సందర్శించినప్పుడు అక్కడి సాంస్కృతిక చిహ్నాలను చూసి అచ్చెరువొంది 'నేను ప్రతిచోటా భారతదేశాన్ని చూస్తున్నాను, కాని అన్నివేళలా గుర్తించలేక పోతున్నానేమో!' అని వాపోయారు. ఈనాడు కూడా ఇండోనేషియా రాజధాని జకార్తాలో ప్రధానకూడళ్ళ వద్ద రామాయణం, మహాభారతంలోని పాత్రలు, ఘట్టాల విగ్రహాలు దర్శనమిస్తాయి. ప్రస్తుతం బ్యాంకాక్‌లో నివసిస్తున్న మాజీ దౌత్యవేత్త జెఫ్రీసంగ్, సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయంలో డీన్‌గా పనిచేస్తున్న కిషోర్ మహబూబని సయుక్తంగా రచించిన 'ఆసియాన్ అద్భుతం' పుస్తకంలో "రామాయణ మహాభారత ఇతిహాసాల్లోని పాత్రలు ఆగ్నేయ ఆసియా ప్రజలకు సుపరిచితమే కాని, వారిలో చాలామంది ఈ పాత్రలు భారతదేశం నుంచి వచ్చాయని చెపితే ఆశ్చర్య పోతారు. ఎందుకంటే వారు ఆ పాత్రలను తమ సొంత సాంస్కృతిక వారసత్వంగా పరిగణిస్తున్నారు" అనిపేర్కొన్నారు.



పి.వి నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో అమలు పరచిన తూర్పుదేశాలవైపు చూసే విదేశాంగ విధానాన్ని (లుక్ ఈస్ట్ పాలసీ) ప్రస్తుత ప్రభుత్వం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'గా నామాంతరం చేసి దానిని మరింత శక్తిమంతంగా అమలుచేస్తోంది. ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవానికి 10 ఆసియాన్ దేశాధినేతలను ముఖ్య అతిథులుగా అహ్వానించడం ఈ విధాన ఆచరణలో ముఖ్య ఘట్టం. భారత్ ఆసియాన్ సంబంధం రానురాను గట్టిపడుతోంది. 1992 సంవత్సరంలో కొన్ని రంగాలకే పరిమితమైన సంప్రదింపుల భాగస్వామ్యం, 1996 సంవత్సరం నాటికి పూర్తిస్థాయి సంప్రదింపుల భాగస్వామ్యంగా మారింది. 2002 నాటికి శిఖరాగ్ర సమావేశాల భాగస్వామ్యంగా రూపొందింది. 2012 సంవత్సరంలో భారత్ ఆసియాన్ భాగస్వామ్యం మరింత పటిష్ఠంగా, వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిణితి చెందింది.

ఆసియాన్ దేశాల్లో డెబ్బైలక్షలకుపైగా ప్రవాస భారతీయులు ఉన్నారు. భారతదేశం అందిస్తున్న 'ఈ–వీసా' సౌలభ్యం అన్ని ఆసియాన్ దేశాల పౌరులకు కూడా అందుబాటులోనికి తీసుకురాబడింది. భారత ప్రభుత్వం 2013లో న్యూఢిల్లీ లో భారత్ ఆసియాన్ కేంద్రాన్ని ఏర్పరిచింది. 2015లో జకార్తాలో ఆసియాన్ దేశాలకోసం ఓ ప్రత్యేక దౌత్యకార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ రెండూ కూడా భారత్–ఆసియాన్‌ల సంబంధాలను త్వరితగతిన మరింత బలోపేతం చేయటానికి ఎంతో ఉపయుక్తంగా తమ సేవల్ని అందిస్తున్నాయి. ప్రస్తుతం 30 బహుముఖ రంగాల్లో భారత్ ఆసియాన్‌ల మధ్య సంప్రదింపుల ప్రక్రియలు కొనసాగుతున్నాయి.

పి.వి. నరసింహారావు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లుక్ ఈస్ట్' విధానానికి మోదీ ప్రభుత్వం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'గా నామాంతరం చేసి దానిని మరింత శక్తిమంతంగా అమలుచేస్తోంది. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి 10 ఆసియాన్ దేశాధినేతలను ముఖ్య అతిథులుగా అహ్వానించడం ఈ విధాన ఆచరణలో ముఖ్యఘట్టం.

భారత్ ఆసియాన్ సంబంధాలు ఆర్థికంగా, సాంస్కృతిక పరంగా, వ్యూహాత్మకంగా పరస్పర ప్రయోజనకరంగా ఉన్నాయి. భారత్ ఆసియాన్ ఆర్థిక సంబంధాలు క్రమంగా బలోపేతం అవుతున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. 2016లో ఆసియాన్ భారతదేశం యొక్క 4వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. పదిశాతం భారత విదేశీ వాణిజ్యం ఆసియాన్‌తో జరుగుతున్నది. అలాగే భారతదేశం ఆసియాన్ 7వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. వస్తు ఉత్పత్తి రంగంలో సైతం భారత్ – ఆసియాన్ సంబంధాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో మలేషియాతోనూ, ఆటో మొబైల్స్ రంగంలో థాయిలాండ్ తోనూ, డిజిటల్ నెట్ వర్క్స్ రంగంలో సింగపూర్‌తోనూ, వస్త్ర పరిశ్రమ రంగంలో వియత్నాంతోనూ భారత్ సంబంధాలు విస్తరిస్తున్నాయి.

భారత ఆర్థిక వ్యవస్థ సేవా రంగంపై అధికంగా ఆధారపడివున్నది. ఆసియాన్ దేశాలలో ఆర్థికవ్యవస్థ ఎక్కువగా ఉత్పత్తి రంగంపై ఆధారపడివుంది. కాబట్టి ఈ రెండూ ఒకరికొకరు పోటీగా కాకుండా పరస్పరం ప్రోత్సాహకరంగా ముందుకుపోగలవు. ఆసియాన్ నాయకత్వం వహిస్తున్న సమగ్ర ప్రాంతీయ ఆర్థిక భాగస్వామ్య వ్యవస్థలో భారతదేశం కూడా పాలుపంచుకుంటోంది. ఈ ఒప్పందం ముందుకుపోతే బహుశా ప్రపంచ జనాభాలో 40శాతం మంది, ప్రపంచ వాణిజ్యంలో 40శాతం, అంతర్జాతీయ జీడీపీలో 35శాతం దీని ప్రభావంలోకి వస్తారు.

వాస్తవానికి దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియాలు భౌగోళికంగా కలిసివున్న ప్రాంతాలే. ఈశాన్య భారతం ఈ రెండిటికీ మధ్యస్థ ప్రాంతం. ఈ అవకాశాన్ని భారతదేశం ప్రయోజనకరంగా ఉపయోగించుకొనే ప్రయత్నం చెయ్యాలి. భారతదేశం నుండి ఆసియాన్ దేశాలకు ఒక సంవత్సరంలో సుమారు 30 లక్షల మంది పర్యాటకులు వెళుతుండగా, ఆసియాన్ దేశాల నుండి భారతదేశానికి సంవత్సరంలో కేవలం ఏడు లక్షలమంది పర్యాటకులు మాత్రమే వస్తున్నారు. చైనా, జపాన్ దేశాలు ఆసియాన్ దేశాల పర్యాటకులని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. రవాణాసౌకర్యాలను మెరుగు పరచడంద్వారా, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా, అందుబాటులో ఉన్న పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంపొందించడం ద్వారా ఈశాన్య భారతదేశం సైతం ఆసియాన్ దేశాల నుంచి మరింత మంది పర్యాటకులను ఆకర్షించగలగాలి. రహదారి మార్గం ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సౌలభ్యం ఈశాన్య భారతదేశానికి అత్యంత ఎక్కువగా ఉన్నది. సరిహద్దు ప్రాంతాలని పేలవంగా వదిలి వేయకుండా, వీసాలతో విదేశీపర్యాటకులు సులువుగా అడుగుపెట్టగలిగే ల్యాండ్ పోర్ట్‌లను సరిహద్దుల్లో ఏర్పాటు చేయడం ద్వారా ఆ ప్రాంతాలలో ఉత్సహభరిత వాతావరణాన్ని కల్పించాలి. విద్య, వైద్య రంగాలలో సైతం మరింత అభివృద్ధి సాధిస్తే పొరుగు దేశాల ప్రజలకు సైతం ఈ ప్రయోజనాలని విస్తరించే అవకాశం వుంటుంది. భారతదేశం, ఆసియాన్ దేశాలు సహన శీలంతో సహజీవనం చేస్తూ, వైవిధ్య భరితమైన సాంస్కృతిక వైభవంతో పరిఢవిల్లుతున్నాయి. ఆసియాన్ దేశాలతో చైనాకు ఆర్థిక ప్రయోజనాలున్నాయి కాబట్టి, ఈ ఆసియాన్ దేశాల సహజీవన ప్రవృత్తి కొంతమేరకైనా చైనా దూకుడుతనాన్ని తగ్గించవచ్చు. భారత–ఆసియాన్ సంబంధాలు హిందూ, పసిఫిక్ మహా సముద్రాల ప్రాంతంలో స్వేచ్ఛాయుత సముద్ర వాణిజ్యాన్ని సురక్షితపరచడంలో, ఈ ప్రాంతంలోని అన్ని దేశాల ఆర్థిక ప్రయోజనాలను రక్షించటంలో ఆశాజనకమైన పాత్రను పోషించగలదు.

ప్రధానిగా తన ప్రమాణ స్వీకారోత్సవానికి సార్క్ దేశాల అధినేతలను గౌరవ అతిథులుగా అహ్వానించడం ద్వారా దౌత్య రంగంలో ఓ నూతన అధ్యాయ్యాన్ని ప్రారంభించిన మోదీ, ఈ సంవత్సరం గణతంత్రదినోత్సవ వేడుకలకు పది ఆసియాన్ దేశాల అధినేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం ద్వారా దౌత్యరంగంలో గొప్ప ముందడుగు వేస్తున్నారు. 1956, 1968, 1974 సంవత్సరాలను మినహాయిస్తే 1950వ సంవత్సరం నుండి ప్రతీ సంవత్సరం గణతంత్రవేడుకలకు ముఖ్య అతిథిగా భారత్ ఒక విదేశీ దేశాధినేతని మాత్రమే ఆహ్వానిస్తూ వస్తోంది. ఆ మూడు సంవత్సరాల్లో మాత్రం ఇద్దరు దేశాధినేతలు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సంవత్సరం జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు పదిమంది ఆసియాన్ దేశాల అధినేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం ద్వారా భారతదేశం ఆసియాన్ దేశాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదో, ఆ దేశాలతో సంబంధాలను సుదృఢం చేసుకోవాలని ఎంత గాఢంగా వాంఛిస్తుందో సూచిస్తున్నది. భారత–ఆసియాన్ దేశాల మధ్య భాగస్వామ్యం ఏర్పడి పాతికేళ్ళు పూర్తయిన సందర్భంగా జనవరి 25న న్యూఢిల్లీలో భారత ఆసియాన్‌ల మధ్య శిఖరాగ్ర సమావేశాలు జరగనున్నాయి. ఈ భారత ఆసియాన్ భాగస్వామ్యం 21వ శతాబ్దాన్ని 'ఆసియా శతాబ్ది'గా రూపొందించడంలో ప్రముఖ భూమికను పోషించగలదు.

■ అవుతు శ్రీహరి
న్యాయవాది, 'ఇండియా ఫౌండేషన్ జర్నల్' సహాయ సంపాదకుడు

(జనవరి 25న న్యూఢిల్లీలో భారత్–ఆసియాన్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా)

మాదీ వరే



(మొదటిపేజీ తరువాయి...)

ప్రభుత్వం ట్రైబ్యునల్‌లో అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. ఇక్కడి భూముల్లో పంటలు అద్భుతంగా పండుతాయని పేర్కొంది. కృష్ణా నది పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఎక్కువగా ఉందని, దీనితోపాటు కరువు ప్రాంతం, నీటిపై ఆధారపడ్డ ప్రజల సంఖ్య కూడా ఎక్కువని తెలిపింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణకు కృష్ణా నీటి కోటాను 574.6 టీఎంసీలకు పెంచాలని, ఏపీ కోటాను 236.4 టీఎంసీలకు తగ్గించాలని కోరింది.

శాంపిల్స్‌లోనే తకరారు

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నీటి పంపకాలపై బ్రిజేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ట్రైబ్యునల్ ఇరు రాష్ట్రాల వాదనలు వింటున్న విషయం తెలిసిందే. ఈనెల 31 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు మళ్లీ ట్రైబ్యునల్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా తమ తమ వాదనలు వినిపించడానికి ఇరు రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం ఒక అఫిడవిట్ దాఖలు చేసింది. పలు అంశాలను ప్రస్తావిస్తూ తెలంగాణలోని భూములు వరి పంటకు పనికి రావని పేర్కొంది. నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ గతంలో రూపొందించిన ఓ సర్వేలోని కొన్ని అంశాలను అందులో వివరించింది. అయితే.. ఈ సర్వే కోసం తీసుకున్న నమూనాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. సర్వేలో 1:2.50 లక్షల నిష్పత్తి స్కేల్ మ్యాప్‌ను పరిగణనలోకి తీసుకోవడాన్ని తప్పుపడుతూ పంటల సాగుకు భూములను గుర్తించడానికి కనీసం ప్రతి 10 వేల ఎకరాలకు ఒక శాంపిల్‌ను తీసుకోవాల్సి ఉంటుందని వివరిస్తోంది. తెలంగాణ ప్రాంతంలో ప్రతి అర కిలోమీటర్ ప్రాంతంలో భూముల స్వభావం మారుతూ ఉంటుందని, పంటల సాగుకు సంబంధించిన సర్వే కోసం శాంపిల్స్‌ను కూడా ఎక్కువగా తీసుకుంటేనే సరైన అవగాహనకు రావడానికి అవకాశం ఉంటుందని వాదిస్తోంది.

ఏపీ అఫిడవిట్‌లో తప్పులు

పంటల దిగుబడులకు సంబంధించి కూడా ఏపీ వాదనలో నిజం లేదని తెలంగాణ తేల్చి చెప్పింది. ఏపీ సమర్పించిన అఫిడవిట్‌లో ఆ రాష్ట్రంలో దీర్ఘకాలిక పంట రకాల దిగుబడులను పేర్కొని, తెలంగాణలో మాత్రం స్వల్పకాలిక దిగుబడులను పరిగణనలోకి తీసుకుని అఫిడవిట్ రూపొందించినట్లు గుర్తించామని వెల్లడించింది. రెండు రాష్ట్రాల్లో ఒకే రకం పంటను పరిగణనలోకి తీసుకుని దిగుబడులను అంచనా వేయాలని సూచిస్తోంది. తెలంగాణకు నీటి కోటాను ఎందుకు పెంచాల్సి ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేస్తూ సీడబ్ల్యూసీ చైర్మన్‌గా పని చేసి, పదవీ విరమణ చేసిన గన్‌శ్యాం ఝా రూపొందించిన అఫిడవిట్‌ను ట్రైబ్యునల్‌లో దాఖలు చేసింది.

ఆ అఫిడవిట్‌లోని ప్రధాన అంశాలు

- ప్రస్తుతం 75 శాతం డిపెండబులిటీ ప్రకారం కృష్ణాలో ఉన్న 811 టీఎంసీల నీటిలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలు కేటాయించారు. ఈ నీటి కోటా విభజన శాస్త్రీయంగా లేదు.
- తెలంగాణలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో 2 కోట్ల జనాభా ఉంది. 36.5 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణం, 68.5 శాతం క్యాచ్‌మెంట్ ఏరియా ఉంది. ఈ లెక్కన చూస్తే.. కృష్ణా నీటిలో 70.8 శాతం తెలంగాణకు కేటాయించాలి. అంటే.. సుమారు 574.6 టీఎంసీలు.
- ఏపీలోని కృష్ణా బేసిన్‌లో 78 లక్షల జనాభా మాత్రమే ఉంది. సాగుయోగ్య భూమి 15.3 లక్షల హెక్టార్లే. క్యాచ్‌మెంట్ ఏరియా కూడా 24,018 చదరపు కిలోమీటర్లు మాత్రమే ఉంది. ఈ లెక్కన ఏపీకి 31.5 శాతం అంటే.. 236.4 టీఎంసీలు మాత్రమే కేటాయించాలి.
- కృష్ణా బేసిన్‌లో తెలంగాణలోనే ఎక్కువ కరువుంది. తెలంగాణలో 33 లక్షల హెక్టార్ల మేర కరువు పరిస్థితులుంటే, ఏపీలో 12.5 లక్షల హెక్టార్లలోనే ఉన్నాయి.
- ఏపీ ప్రభుత్వం సుమారు 331 టీఎంసీలను కృష్ణా నుంచి ఇతర (పెన్నా) నదుల బేసిన్లకు తరలిస్తోంది. ఇది సహజ న్యాయ సూత్రానికి విరుద్ధం.
- గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌కు ఏపీ ప్రభుత్వం నీటిని మళ్లిస్తోంది. ఈ నీటితో కృష్ణా డెల్టా పంటలను పండిస్తున్నారు. ఇలా తరలించే 80 టీఎంసీల్లో తెలంగాణకూ కొంత నీటిని కేటాయించాల్సి ఉంటుంది.
- తెలంగాణలో పులిచింతల నిర్మించారు. ఈ ప్రాజెక్టులో సుమారు 45 టీఎంసీలు నిల్వ చేయొచ్చు. ఇందులో సుమారు 6.589 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలి. తద్వారా సుమారు 24,500 ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది.

'సీట్ల' ఫైలు కదిలింది!

(మొదటిపేజీ తరువాయి...)

వెళ్లాయి. ఆ పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. 2008 పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 2026 వరకూ నియోజకవర్గాల్లో ఎటువంటి మార్పుచేర్పులకు అవకాశం లేదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. కానీ తెలుగు రాష్ట్రాలకు వచ్చేసరికి పరిస్థితి మారింది. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని పార్లమెంటు ఆ తర్వాత ఆమోదించింది. ఈ రెండు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు 2008 నాటి చట్టంలోని నిబంధనలే వర్తిస్తాయా లేక 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలా అన్నది కేంద్ర హోంశాఖ ముందున్న సమస్య. దీనిపైనే హోంశాఖ ఈసీ అభిప్రాయం కోరింది. మరో అంశం కూడా తేలాల్సి ఉంది. పోయినసారి నియోజకవర్గాలను పునర్విభజించినప్పుడు ఎస్సీ నియోజకవర్గాలను రాష్ట్రమంతా విస్తరింపజేశారు. వారి జనాభా ఎక్కువ ఉన్నచోట మాత్రమే ఇస్తే రిజర్వుడు నియోజకవర్గాలన్నీ ఒకేచోట వస్తున్నాయని.. అది సరికాదనే అభిప్రాయంతో ఇలా చేశారు. అప్పటి చట్టం దానికి అనుమతించింది. ఇప్పుడు కూడా దానినే పరిగణనలోకి తీసుకోవాలా అన్నది మీమాంస. దీనిపైన ఈసీ తన అభిప్రాయాన్ని తెలపాల్సి ఉంది. ఈ అభిప్రాయాల వెల్లడికి ఎన్నికల కమిషన్ ఎక్కువ సమయం తీసుకోదని, ఒకట్రెండు రోజుల్లోనే తెలియజేస్తుందని హోంశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆ తర్వాత మరో 4 శాఖలకు కూడా హోం శాఖ ఇటువంటి లేఖలు రాయాల్సి ఉంది. వాటికి కూడా సమాధానాలు వచ్చాక అన్నిటినీ కలిపి తుది ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఆమోదించాక దీనిని మంత్రివర్గ సమావేశం ముందు పెడతారు. కేబినెట్ ఆమోదిస్తే అప్పుడు అది పార్లమెంటు ముందుకు వెళ్తుంది. అంతిమంగా రాజకీయ నిర్ణయమే కీలకమని, అది జరిగితే అన్నీ వేగంగా ముందుకెళ్తాయని హోం శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్రంలో రాజకీయ నిర్ణయం జరిగినప్పుడే రెండు రాష్ట్రాల్లో నియోజకవర్గాలు పెరుగుతాయని ఒక సీనియర్ అధికారి స్పష్టం చేశారు.

9 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేటు వేయండి

- ఈసీ, రాష్ట్రపతికి రేవంత్ ఫిర్యాదు
- ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌ను ఉల్లంఘించారని లేఖ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 'ఆప్' ఎమ్మెల్యేల తరహాలోనే తెలంగాణలోనూ పార్లమెంట్ సెక్రెటరీలుగా కొనసాగిన ఆరుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, లాభదాయకమైన అదనపు పదవుల్లో నియమితులైన మరో ముగ్గురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రపతికి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. తెలంగాణలో ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ ఉల్లంఘనకు సంబంధించిన అంశాన్ని తాను తెర మీదకు తీసుకువచ్చానని రేవంత్ అన్నారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2014 డిసెంబరు 29న జీవో జారీచేసిందని, అయితే, రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యను హైకోర్టులో సవాలు చేయగా 2015 మే 1న హైకోర్టు ఈ నియామకాలను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిందని వివరించారు. అయితే, కొత్త విధానంలో మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను తెలంగాణ సాంస్కృతిక సారథిగా, రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణను ఆర్టీసీ చైర్మన్‌గా, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమించారని రేవంత్ ఫిర్యాదు చేశారు.

మోత్కుపల్లిపై చర్యలుంటాయా?

- టీడీపీటీఎస్ కేడర్‌లో అయోమయం
- రోజుకో విధంగా రాష్ట్ర నాయకత్వం ప్రకటనలు



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన మోత్కుపల్లి నర్సింహులుపై చర్యలు తీసుకునే విషయంలో పార్టీ నాయకత్వం ఎటూ తేల్చకపోవడం కేడర్‌ను అయోమయానికి గురి చేస్తోంది. తాజా పరిణామాలపై పార్టీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ స్పందిస్తూ మోత్కుపల్లి పొలిట్‌బ్యూరో సభ్యుడైనందున జాతీయ నాయకత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. ఇంతలోనే పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన శిక్షణ శిబిరంలో ప్రసంగిస్తూ మోత్కుపల్లి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాల్సిందేనన్నారు. అయితే, అసలు మోత్కుపల్లిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారా? లేదా? అన్నది చర్చనీయాంశమైంది.

పార్టీ కేడర్‌లో అసంతృప్తి : రమణ



మోత్కుపల్లి వ్యాఖ్యలపై పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొందని టీడీపీటీఎస్ అధ్యక్షుడు రమణ అన్నారు. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల శిక్షణ శిబిరం ప్రారంభం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వంటేరు ప్రతాప్ రెడ్డి అరెస్టుపై 29న కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలవనున్నట్లు తెలిపారు. కాగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ 35వ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్లాక్ మెయిల్ బాబా గారు

(మొదటిపేజీ తరువాయి...)

భార్యాభర్తలను విడివిడిగా ప్రశ్నిస్తాడు. చివరిగా అత్యంత కీలక ప్రశ్న అంటూ దుర్గామాత విగ్రహంపై చేతులుంచి ప్రమాణ పూర్తిగా మీకు ఎవరెవరితో వివాహేతర సంబంధాలు ఉన్నాయో చెప్పాలంటాడు. లేకపోతే, నీ భర్త ప్రాణాలే కాదు.. పిల్లల ప్రాణాలూ గాల్లో కలిసిపోతాయని భయపెడతాడు. పురుషులనూ ఇలాగే ప్రశ్నిస్తాడు. భార్యాభర్తలను వేర్వేరుగా బ్లాక్ మెయిల్ చేస్తాడు. విరుగుడుగా శాంతి, సర్పదోష పూజలు చేయాలంటాడు. అందుకు వేల రూపాయల పూజా సామగ్రితోపాటు లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తాడు. కాదు కూడదంటే.. మీరు చెప్పిన వివరాలు వీడియోలో రికార్డయ్యాయని బెదిరిస్తాడు. దాంతో, పలువురు భార్యాభర్తలు అప్పు చేసి మరీ లక్షలాది రూపాయలు సమర్పించుకున్నారు. ఒంటరి మహిళల సమస్యలు, భార్యాభర్తల మధ్య గొడవలను తనకు అనుకూలంగా మలచుకుంటాడు. మీ అదృష్టం బాగుండాలంటే కొన్ని పరీక్షలు చేయాలని ఏకంగా బ్లౌజులను విప్పించి వీపు మీద శంఖు చక్రాలు ఉన్నాయో లేవో పరిశీలిస్తాడు. అవి ఇప్పుడిప్పుడే ఏర్పడుతున్నాయని, కొన్ని పూజలు చేస్తే అదృష్టం దరిద్రం పట్టినట్లు పట్టుకుంటుందని ఆశపెడతాడు. వశీకరణ పూజల పేరిట ఉన్నతస్థాయిలో ఉద్యోగం చేసే ఇద్దరు అమ్మాయిలకు వల వేశాడు. వారు ఇప్పుడు ఏకంగా అతని వద్ద ఊడిగం చేస్తున్నారు. ఆయనకు ఆశ్రయం ఇచ్చిన ఇంటికి కన్య పూజల పేరుతో రోజుకో అమ్మాయిని తీసుకొస్తుంటే ఇంటి యజమాని దాదాపు తన్ని తగలేసినంత పని చేసింది. హోమాలు, యజ్ఞాలు చేస్తానని చెప్పి ఇంట్లోకి అమ్మాయిలను తీసుకొచ్చి కళ్ల ముందే తలుపులు వేసుకుంటున్నావని నిలదీసింది. దాంతో, కన్య పూజలు కూడా తాంత్రి క పూజల్లో భాగమేనని సెలవిచ్చాడట. 'నువ్వు వద్దు, నీ పూజలు వద్దు' అంటూ తక్షణం ఇంటి నుంచి వెళ్ళగొట్టింది. భీమారంలోని ఓ తండ్రి తన కూతురు తమ కులం కాని యువకుడితో పీకల్లోతు ప్రేమలో మునిగిపోయిందని, ఆమె మనసు మార్చాలని దొంగ గురూజీని ఆశ్రయించాడు. పూజకు, పూజా సామగ్రికి లక్ష సమర్పించుకున్నాడు. పూజలు చేసిన 15 రోజులకే ఆ అమ్మాయి మనసిచ్చిన వాడితో పారిపోయి మనువాడింది. ఇదేంటి స్వామి.. అని ఆ తండ్రి ప్రశ్నిస్తే, నువ్వు చేసిన పూజలో లోపం ఉందని, మళ్లీ చేయాలని అన్నాడు. ఇప్పటి దాకా చేసిన పూజ చాలు, ఇంకోసారి అవసరం లేదని ఆయన ఆగ్రహంతో వెళ్లిపోయాడట.

గుట్టు విప్పిన మహిళ



కుటుంబ సమస్యల పరిష్కారానికి ఓ మహిళ తనకు తెలిసిన వారి ద్వారా దొంగ బాబాను ఆశ్రయించింది. సర్పదోష పూజ పేరుతో వేలాది రూపాయలు కొట్టేశాడు. తనతోపాటు ఉండి దైవసేవ చేస్తే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని నమ్మబలికాడు. ఏడాదిగా మహిళలను ఎలా మోసం చేస్తున్నాడో చూ సింది. ఆమె ఎదురు తిరగడంతో తనకు పలుకుబడి ఉందని, అంతు చూస్తానని బెదిరించాడు. దాంతో ఆమె 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'ను ఆశ్రయించారు. "పూజల పేరిట నా శ్రమ దోపిడీ చేశాడు. సమస్యలతో వచ్చేవారి నుంచి లక్షలాది రూపాయలు గుంజాడు. శంఖు చక్రాల పేరుతో మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు" అని వివరించారు. తాజాగా పోలీసులకూ ఫిర్యాదు చేశారు.

పద్ధతులు నచ్చక వెళ్లడం మానేశాను

నేను బ్యాంకు అధికారిని. కొన్ని కారణాలతో ఉద్యోగంలో సమస్యలు వచ్చాయి. ఆయన్ను ఆశ్రయించాను. వృత్తిరీత్యా పురోహితుడిని కావడంతో యజ్ఞ యాగాలకు నన్ను ఉపయోగించుకునేవాడు. ఆయన పద్ధతులు నచ్చక మానేశాను.

-బ్యాంకు మాజీ అధికారి

మా కొలువులు ఇంకెప్పుడు?

- పరీక్షలై రెండేళ్లైంది..
- ఇంకెన్నాళ్లు ఎదురుచూపులు
- ఫలితాలు వెంటనే ప్రకటించాలి
- టీఎస్‌పీఎస్సీ ముందు గ్రూప్-2, ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన



టీఎస్‌పీఎస్సీ భవన్ ముందు ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వివిధ నోటిఫికేషన్ల భర్తీకి చేపడుతున్న ప్రక్రియలో జాప్యం జరుగుతోందని నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు కేసుల కారణంగా గ్రూప్-2 భర్తీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఇప్పటికే అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు. తాజాగా ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష, ఫిజికల్ టెస్టుల ఫలితాలను వెంటనే ప్రకటించాలని టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముందు అభ్యర్థులు ధర్నాకు దిగారు. 2016లో 341 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇంతవరకు భర్తీ ప్రక్రియ పూర్తి కాలేదని అభ్యర్థులు ఆరోపించారు. కేవలం 314 పోస్టుల భర్తీకి 4 దఫాలుగా అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఫిజికల్, మెడికల్ టెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. దాంతో నోటిఫికేషన్ జారీ అయి రెండేళ్ల గడుసున్నా.. ఫలితాలు వెల్లడి కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితాలు వెల్లడి కాకపోవటంతో ఇతర ఉద్యోగాలకు పోటీ పడేందుకు ఇబ్బందిగా ఉన్నట్లు అభ్యర్థులు తెలిపారు. ధర్నా అనంతరం అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. ఇంకా 39 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు 2,700 మందిని పిలిచామని, త్వరలో భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు అభ్యర్థులు తెలిపారు. మరోవైపు రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జారీ చేసిన గ్రూప్-2 రాత పరీక్షను 2016 నవంబరు 11, 13 తేదీల్లో పూర్తి చేశారు. టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేసింది. అయితే ఫలితాలు వెల్లడించేందుకు కోర్టు కేసులున్నాయంటూ జాప్యం చేస్తోందని, ఈ వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఇటీవల అభ్యర్థులు కమిషన్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఏళ్లకొద్ది రిక్రూట్‌మెంట్ ప్రక్రియ కొనసాగితే నిరుద్యోగుల మానసిక పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.



టీఎస్‌టీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న ఉత్తమ్. చిత్రంలో భట్టి తదితరులు

కేసీఆర్ పాలనలో విద్యా రంగం నాశనం: ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని కేసీఆర్ సర్వనాశనం చేశారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా విద్యారంగానికి ఒరిగిందేమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉపాధ్యాయులు సైతం టీఆర్ఎస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం టీఎస్‌టీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. లక్షలాది మంది నిరుద్యోగులు నిరీక్షిస్తుంటే ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా తాత్సారం చేయడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు.

'బఫూన్' మాటను విరమించుకుంటున్నా: నారాయణ

తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఓ బఫూన్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కాస్త వెనక్కి తగ్గారు. బఫూన్ అన్న మాటను విరమించుకుంటున్నానని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా గవర్నర్ నిర్వహించే 'ఎట్ హోం' విందుకు మాత్రం హాజరు కాబోనని స్పష్టం చేశారు.

ఫీజులు పెంచితే గుర్తింపు రద్దు

- ప్రైవేటు స్కూళ్లకు విద్యాశాఖ హెచ్చరిక.. ఉత్తర్వులు జారీ

ప్రైవేటు పాఠశాలలు ఎట్టి పరిస్థితుల్లో ఫీజులు పెంచొద్దని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎడ్యుకేషన్ యాక్ట్ 1983 ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ అధికారం ప్రభుత్వానికి ఉందని, ఇష్టానుసారం ఫీజులు పెంచితే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య హెచ్చరించారు. "నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే జరిమానాలు వేస్తాం. గుర్తింపు రద్దు చేసే అవకాశం ఉంది" అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

లౌకిక, ప్రజాతంత్ర పార్టీలతో ఐక్యవేదిక: సీపీఐ

రాష్ట్రంలోని లౌకిక, ప్రజాతంత్ర విధానాలతో పనిచేస్తున్న పార్టీలతో కలసి విశాల ఐక్యవేదిక ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం సూత్రపాయంగా తీర్మానించింది. మంగళవారం స్థానిక మగ్దూంభవన్‌లో పార్టీ సీనియర్ నేత బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గం అత్యవసరంగా సమావేశమైంది. ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ ఈ వేదిక ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం విడుదల చేసింది. 83 నియోజకవర్గాల్లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టనుంది. బుధవారం నుంచి ఫిబ్రవరి 14 వరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారు. అనంతరం మార్చి 24న ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనుంది.

టీమాస్ ఫోరం రాష్ట్ర చైర్మన్‌గా కంచ ఐలయ్య

రాంనగర్/హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీమాస్ ఫోరం రాష్ట్ర చైర్మన్‌గా కంచ ఐలయ్య ఎన్నికయ్యారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మంగళవారం జరిగిన టీమాస్ ఫోరం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా జాన్‌వెస్లీ, కో-కన్వీనర్‌గా జ్వలిత ఎన్నికయ్యారు. అనంతరం కంచ ఐలయ్య మాట్లాడుతూ టీమాస్ రాజకీయ పార్టీ కాదని, ఎన్నికల్లో పోటీ చేయబోదని స్పష్టం చేశారు. బీసీ వర్గం అని చెప్పుకునే పవన్‌కల్యాణ్ ఏనాడూ జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పించలేదన్నారు. ప్రజాగాయకుడు గద్దర్, కాకి మాధవరావు పాల్గొన్నారు.

9వ తరగతి టాపర్లకు విజ్ఞానయాత్రలు

కొత్తగూడెం అర్బన్, జనవరి 23: ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో విజ్ఞాన - విహార యాత్రలు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా ఒక్కో విద్యార్థికి రూ.2000 చొప్పున 5,639 మందికి రూ.112.78 లక్షలు మంజూరయ్యాయి. ఎంపికైన వారి వివరాలను ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

నివేదికలపై ఇంత నిర్లక్ష్యమా?

- 3 వారాల్లోగా నివేదిక ఇవ్వండి.. తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సేకరించిన భూములకు పరిహారం చెల్లింపులపై గతంలో తామిచ్చిన ఆదేశాలకు చిత్తశుద్ధితో స్పందించకపోవడంపై హైకోర్టు తెలుగు రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తామిచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం మొక్కుబడిగానైనా నివేదిక సమర్పించిందని, ఏపీ ప్రభుత్వం నివేదిక సమర్పణకు గడువు కోరడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రజాప్రయోజనం కోసం సర్కారు సేకరించిన భూములకు పరిహారం చెల్లింపునకు సంబంధించి కింది కోర్టులు ఇచ్చిన ఉత్తర్వుల్లో అమలు చేసినవి ఎన్ని? ఇంకా అమలు చేయాల్సినవి ఎన్ని? తదితర వివరాలు మూడు వారాల్లో సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. లేకపోతే తెలుగు రాష్ట్రాల సీఎస్‌లు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. పరిహారం చెల్లింపులకు సంబంధించి కింది కోర్టు ఆదేశాల అమల్లో ఇలాగే నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మొత్తం భూసేకరణ ప్రక్రియను నిలిపివేసేలా ఆదేశాలు జారీచేయాల్సి ఉంటుందని హెచ్చరించింది.

'పాలమూరు'పై 3 వారాల్లో కౌంటర్: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి దాఖలు చేసిన పిల్‌పై 3 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, బీహెచ్‌ఈఎల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ పిల్‌ను అత్యవసరంగా వినాలని ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ గంగారావులతో కూడిన ధర్మాసనాన్ని నాగం అభ్యర్థించారు. అయితే కౌంటర్ దాఖలుకు తమకు గడువు కావాలని రాష్ట్ర ప్రభుత్వం, బీహెచ్‌ఈఎల్ చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి అనుమతించారు.

కార్పొరేట్ కళాశాలల్లో ఆత్మహత్యలపై సర్కారుకు నోటీసులు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కళాశాలల్లోని విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. లక్ష్యం సాధించాలని తల్లిదండ్రులు పిల్లలపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని, అందుకే వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించింది. తెలంగాణ, ఏపీలోని కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదంటూ వచ్చిన ఒక లేఖను ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం పిల్‌గా మార్చి మంగళవారం విచారించింది. ఇందులో ప్రతివాదులుగా ఉన్న ఏపీ, తెలంగాణ ప్రభుత్వ సీఎస్‌లు, విద్యా, హోంశాఖ ముఖ్య కార్యదర్శులు, ఇంటర్ బోర్డు, స్విమ్స్, నిమ్స్, శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

చూచిరాతలతో విద్యా వ్యవస్థ నాశనం: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంచి మార్కుల కోసం పరీక్షలలో చూచిరాతలకు అవకాశమిస్తే విద్యావ్యవస్థ నాశనం అవుతుందని, వీటిని ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు అభిప్రాయపడింది. చదివి రాస్తున్నారా? చూసి రాస్తున్నారా? అనేది చూసుకోకుండా 90 శాతం మార్కులు రావాలని కోరుకుంటున్న తల్లిదండ్రులు విపరీత ధోరణితో ఉంటున్నారని పేర్కొంది. చూచిరాతలకు డీఈవోలతోపాటు విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులను బాధ్యులుగా చేయాలని, అప్పుడే కొంత ఫలితం ఉంటుందని సూచించింది. చూచిరాతలు ఎక్కువగా జరుగుతున్న పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, వాటిని ప్రోత్సహిస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో 3 వారాల్లో నివేదిక సమర్పించాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

తెలంగాణ నా ప్రాణం!

ఆఖరి శ్వాస వరకు సేవ చేస్తా.. తెలంగాణ కోసం రక్తాన్ని ధారపోస్తాను: పవన్



సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

జై తెలంగాణ నినాదంతో నాలోని అణువణువూ పులకరిస్తుంది.
పునర్జన్మనిచ్చిన తెలంగాణ తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను
తెలంగాణ తల్లికి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించండి
వందేమాతరం గొప్పదనం జై తెలంగాణ పదంలోనూ ఉంది. జై తెలంగాణ స్వేచ్ఛకు ప్రతీక.
నేను తెలంగాణ వ్యతిరేకిని కాదు. నేను పెరిగిన తెలంగాణ అంటే నాకు ఎంతో ఇష్టం, ప్రేమ. ప్రాణం కూడా.
తెలంగాణ కోసం మీకు రక్తం కావాలంటే ఇచ్చేస్తాను. నాకు అంత ఇష్టం తెలంగాణ అంటే!
తెలంగాణ పసిబిడ్డ. ఈ బిడ్డను జాగ్రత్తగా కాపాడాల్సిన బాధ్యత నాకే కాదు.. ప్రతి ఒక్క తెలంగాణ నాయకుడికీ ఉంది.
కేసీఆర్ అంటే నాకు ముందు నుంచీ ఇష్టం. అవసరమైతే, సందర్భాన్ని బట్టి విభేదిస్తాను
తెలంగాణ బంగారు భవిష్యత్తు కోసం మీతో కలిసి పోరాటం చేస్తాను

కరీంనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): "ఆంధ్ర జన్మనిస్తే.. తెలంగాణ పునర్జన్మనిచ్చింది.నాకు పునర్జన్మనిచ్చిన తెలంగాణ తల్లికి రుణపడి ఉంటా. ఆఖరి శ్వాస వరకు తెలంగాణకు సేవచేస్తాను" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ భావోద్వేగం తనకు చాలా దగ్గరగా ఉండటంతో చాలాఇష్టమన్నారు. 'చలోరే.. చలోరే చల్ యాత్ర'లో భాగంగా మంగళవారం ఆయన కరీంనగర్‌లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల జనసేన కార్యకర్తలతో సమావేశమయ్యారు. అరగంట సేపు మాట్లాడిన ఆయన జై తెలంగాణ నినాదంతో ముగించారు. జనసేన 7 సిద్ధాంతాలతో ముందుకెళ్తుందన్నారు.అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం, పర్యావరణ పరిరక్షణ, కులాలను కలిపే ఆలోచన విధానం, మతాల ప్రస్తావన లేని రాజకీయం, భాషను గౌరవించే సంప్రదాయం, సంస్కృతిని కాపాడే సమాజం, ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అనే ప్రధాన సిద్ధాంతాలతో జనసేన ముందుకెళ్తుందన్నారు. తెలంగాణలో జనసేన రాజకీయ ప్రస్థానాన్ని కరీంనగర్ నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. "తెలంగాణ యాసని, తెలంగాణ భాషని గౌరవించలేదు. ఇది బాధ కలిగించే విషయం. ఇక్కడ నాకు ఎంతోమంది కవులు,కళాకారులు, స్నేహితులు ఉన్నారు. తెలంగాణ కవులు, కళాకారులపై నాకున్న గౌరవం, అభిమానం నా సినిమాలు చూస్తే తెలుస్తుంది. భాషను, యాసను గౌరవించడం జనసేన సిద్ధాంతాల్లో ముఖ్యమైనది" అన్నారు.ప్రజలు వేరు, పాలకులువేరని, అందరినీ ఒకేలా చూడకూడదంటూ పెద్దలు కేసీఆర్, కాంగ్రెస్ నేతలు సహా ప్రతి ఒక్క నాయకుడికి పేరుపేరునా విన్నవించానన్నారు.

2019లో తెలంగాణలో సత్తా చాటుదాం

"2019 ఎన్నికల్లో జనసేన తెలంగాణలోనూ పోటీ చేసి సత్తా చాటుతుంది. మీరు నాకు అండగా నిలబడండి. నేను మీ ఇంట్లో ఒకడిగా అండగా ఉంటా" అని కార్యకర్తలకు పవన్ భరోసా ఇచ్చారు. జనసేనది సుదీర్ఘ పోరాటమన్నారు. "నేను ఒకసారి వచ్చి వెళ్లిపోయే వ్యక్తిని కాదు. చాలా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాను. దెబ్బలు తినడానికైనా సిద్ధమే. విమర్శలు, దాడులు ఎదురైనా మడమ తిప్పను" అని ఆవేశంగా అన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవమైన మార్చి 14న పూర్తిస్థాయి ప్రణాళికను విడుదల చేస్తామన్నారు. అధికారం కొన్ని కులాల వారికే పరిమితమైందని, దాన్ని బ్రేక్ చేయాలన్నారు. మిగిలిన బీసీ కులాల్లోనూ రుగ్మతలు,అసమానతలను అర్థం చేసుకొని రాజకీయాలను ముందుకుతీసుకెళ్లాలన్నారు. తనకు ఏ ఒక్కరితోనూ వ్యక్తిగత గొడవలు, వ్యక్తిగత మనస్పర్థలు లేవని, తనకు ఉన్నదల్లా విధివిధానాలపై మాట్లాడటమేనని చెప్పారు. కాగా, పవన్ కల్యాణ్ మంగళవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెనికి చేరుకున్నారు. సింగరేణి అతిథి గృహంలో బస చేశారు. బుధవారం ఉదయం మీడియాతో మాట్లాడతారు. 9.30గంటల నుంచి కొత్తగూడెం నుంచి రోడ్డుషో ద్వారా ఖమ్మం వెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఖమ్మంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

మా అన్నయ్య కాంగ్రెస్ నాయకుడే

సీఎం కేసీఆర్‌ను స్మార్ట్‌గా పని చేస్తారని అంటే కొంతమంది నాయకులకు ఇబ్బందికరంగా ఉందని, తన అన్నయ్య చిరంజీవి కూడా కాంగ్రెస్ నాయకుడే అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. కేసీఆర్ అంటే తనకు ముందునుంచీ ఇష్టమేనని, రాజకీయాల్లో ఉంటూ ప్రజల కోసం కష్టపడే నాయకులను తాను ఇష్టపడతానన్నారు. తనకు ఏ పార్టీ మీద ద్వేషం లేదని, ఆంధ్రాలో తిరుగుతావ్.. తెలంగాణకు ఎందుకు రావని అడిగితే వస్తానని చెప్పి ఈరోజు వచ్చానన్నారు. "ఆంధ్ర వేరు కాదు. తెలంగాణ వేరు కాదు. దేశం కోసం నా గుండె కొట్టుకుంటుంది. తెలంగాణ కోసం చివరి రక్తాన్ని ధారపోస్తాను" అని పవన్ ఉద్వేగంగా ప్రకటించారు.

తెలంగాణ ఉనికిని బలంగా చాటడానికే..

"ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు ఆంధ్ర కవులను, కళాకారులను పిలవలేదంటూ చాలా మంది నాకు మెసేజ్‌లు పంపించారు. శ్రీశ్రీ, గుంటూరు శేషేంద్ర శర్మ గారి పేర్లు లేవని శేషేంద్ర శర్మగారి సతీమణి మెసేజ్ పెట్టారు. ఈ విషయాన్ని లేఖ ద్వారా ప్రభుత్వానికి తెలపాలనుకున్నాను. కానీ, ఒక్కసారి మన ఉనికిని చాలా బలంగా చాటి చెప్పాల్సిన అవసరముందనే కోణంలో తెలంగాణ కవులను, కళాకారులను గౌరవించడం తప్పుకాదని ప్రపంచ తెలుగుసభల్లో అర్థమైంది" అని పవన్ తెలిపారు. ఆంధ్ర, తెలంగాణలో నిబద్ధత, బాధ్యతతో రాజకీయాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

సీఎంను పొగిడేందుకు ఎంత తీసుకున్నావు?

- పవన్‌కల్యాణ్‌కు పొన్నం సూటి ప్రశ్న
- అనుమతిచ్చినందుకేనా భజన?: వీహెచ్, జీవన్‌రెడ్డి
- ఉద్యమ ద్రోహులతో స్నేహమా ?: కోదండరాం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

"సీఎంను పొగిడేందుకు ఎంత తీసుకున్నావు?"అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ సూటిగా ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మారుపాకలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పవన్ పర్యటనతో అమరవీరుల ఆత్మలు క్షోభిస్తాయన్నారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టానని చెబుతున్న ఆయనకు రైతుల ఆత్మహత్యలు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఇసుక మాఫియా కారణంగా ప్రాణాలు కోల్పోయిన బాధితులను ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. ఎంసెట్ రద్దు విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డెక్కి ఆందోళన చేసినా.. దళితుల భూపంపిణీ హామీ అటకెక్కినా కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. "నీ సినిమాను ఐదు షోలు ప్రదర్శించేలా అనుమతి ఇచ్చినందుకే కేసీఆర్ భజన చేస్తున్నావా? అందుకే కేసీఆర్ స్మార్ట్ సీఎం అయిపోయాడా? అసలు తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసా?" అని పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి సీనియర్ కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి, వి.హనుమంతరావు ప్రశ్నించారు. గాంధీభవన్‌లో వారు మాట్లాడుతూ కేసీఆర్ పాలన అంత బాగుంటే జనసేన పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని పవన్‌కు సలహా ఇచ్చారు. తెలంగాణలో వాస్తవ పరిస్థితులు ఏమిటో తనతో వస్తే చూపిస్తానని, అందుకు సిద్ధమా అని వీహెచ్ సవాల్ విసిరారు. పవన్ కల్యాణ్ పర్యటన వెనుక సీఎం కేసీఆర్ కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. మంథనిలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పవన్ పర్యటించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పాటైనందుకు బాధతో ఉపవాస దీక్ష చేసిన పవన్ కల్యాణ్‌కు సీఎం కేసీఆర్ ప్రేమ ఎక్కువైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారితో మంచి సంబంధాలను కొనసాగించడం సిగ్గుచేటన్నారు. ఉద్యమ ద్రోహులను ప్రభుత్వం దగ్గరకు తీస్తోందని టీజేఏసీ రాష్ట్ర చైర్మన్ కోదండరాం ఆరోపించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ పవన్ గురించి మాట్లాడి తన స్థాయిని తగ్గించుకోదల్చుకోలేదన్నారు.



సీజేఐ అభిశంసనకు సీపీఎం పావులు

- ఎన్సీపీ, జేడీయూ (రెబెల్) నేతలతో సీతారాం ఏచూరి చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 23: పార్లమెంటులో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అభిశంసనకు సీపీఎం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రతిపక్షాలను కూడగట్టేందుకు పావులు కదుపుతోంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మంగళవారం ఎన్సీపీ నేత తారిక్ అన్వర్, జేడీయూ తిరుగుబాటు నేత శరద్ యాదవ్‌లతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సుప్రీం కోర్టులో నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలను న్యాయవ్యవస్థ పరిష్కరించలేకపోయింది. దాంతో, ఆ సంక్షోభాన్ని శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు కలిసి పరిష్కరించేందుకు సమయం ఆసన్నమైంది' అని తెలిపారు. ఇప్పటికీ సుప్రీం కోర్టులో పరిస్థితులు చక్కబడినట్లు కనిపించడం లేదని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో అభిశంసన తీర్మాణాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నామన్నారు.

ఉగ్రవాదంపై మా యుద్ధమే పెద్దది!

- ఆంక్షలతో అమెరికాకే నష్టం
- పాక్ ప్రధాని అబ్బాసీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 23: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు... అనేది ఓ సామెత! 'ఉగ్రవాదులపై పోరు' విషయంలో పాకిస్థాన్ అచ్చం ఇలాగే వ్యవహరిస్తోంది. ఒకవైపు... ముంబై పేలుళ్ల సూత్రధారి హాఫీజ్ సయీద్‌ను స్వేచ్ఛగా వదిలేసి... మరోవైపు 'ఉగ్రవాదంపై ప్రపంచంలోనే మేం అతిపెద్ద యుద్ధం చేస్తున్నాం' అని ఆ దేశ ప్రధాని షాహిద్ అబ్బాసీ పేర్కొన్నారు. రాయిటర్స్ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. "అమెరికా మాకు సహాయం నిలిపివేసినా, ఆంక్షలు విధించినా... అది ఆ దేశానికే నష్టం చేస్తుంది. ఉగ్రవాదంపై అమెరికా చేస్తున్న పోరుకే విఘాతం కలుగుతుంది" అని అబ్బాసీ హెచ్చరించారు. 'ఉగ్రవాదులకు, విధ్వంసకారులకు పాక్ స్వర్గధామంగా మారింది' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. అఫ్గాన్‌లో తమ బలగాలకు, ఇతర అవసరాలకు విమానాలు నడుపుతున్న అమెరికా... తమ గగనతలాన్ని వినియోగించుకుంటున్నందుకు డబ్బు వసూలు చేసే ఆలోచన ఉందన్నారు. కాగా,, అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న తాలిబన్ నేతలను వెంటనే అరెస్టు చేయాలని, లేదా వారిని దేశం నుంచి బహిష్కరించాలంటూ పాకపై మరోమారు అమెరికా ఒత్తిడి పెంచింది.

బీజేపీతో రాంరాం!

2019 ఎన్నికల్లో ఒంటరి పోరు.. శివసేన వెల్లడి



- ఇకపై అన్ని రాష్ట్రాల్లో పోటీ
- హిందూత్వ అజెండాతోనే : థాకరే

ముంబై, జనవరి 23: శివసేన బీజేపీకి గుడ్‌బై చెప్పింది. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీతో కలిసి పోటీచేయబోమని ప్రకటించింది. మహారాష్ట్ర అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించింది. భారతీయ జనతా పార్టీతో దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న బంధానికి రాంరాం చెప్పింది. హిందూ ఓట్లు చీలిపోకూడదన్న ఉద్దేశంతో ఇప్పటివరకు ఇతర రాష్ట్రాల్లో పోటీ చేయని సేన.. భవిష్యత్‌లో అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల బరిలో దిగనున్నట్లు పేర్కొంది. రాబోయే లోక్‌సభ, విధాన సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలన్న తీర్మానాన్ని మంగళవారమిక్కడ జరిగిన శివసేన జాతీయ కార్యనిర్వాహక సమావేశంలో ఎంపీ సంజయ్ రౌత్ ప్రవేశపెట్టగా.. ఏకగ్రీవంగా ఆమోదించారు. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో సేన కనీసం 25 సీట్లు గెలుచుకుంటుందని, అలాగే 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 150 స్థానాలు దక్కించుకుంటుందన్నారు .ఫలితాల గురించి ఆలోచించకుండా వచ్చే ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో పోటీ చేస్తామని సేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ప్రకటించారు. మోదీ సర్కారు పాకిస్థాన్ అంశాన్ని ఎన్నికల్లోనూ ఉపయోగించుకుంటోందని విమర్శించారు. గోవులను చంపడం నేరమంటూ దాన్ని నిషేధించినప్పుడు.. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం కూడా నేరమేనని, దాన్నీ ఆపాలని చెప్పారు. మోదీ నెతన్యాహూతో కలిసి గాలిపటాలు ఎగరేసేకంటే శ్రీనగర్ తీసుకెళ్లి జాతీయ జెండా ఎగరేస్తే బాగుండేదని థాకరే పేర్కొన్నారు. శివసేన పార్టీ అధ్యక్ష పదవి, ఇతర పదవులకు కూడా మంగళవారం అంతర్గత ఎన్నికలు నిర్వహించారు. ఉద్ధవ్ థాకరే మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు ఆదిత్య థాకరేకు 'నేత'గా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం యువసేన బాధ్యతలు చూస్తున్న జూనియర్ థాకరేకు నేత హోదా కల్పించడంతో పార్టీ కోర్ టీంలో సభ్యుడయ్యారు.

ప్రజలు సీరియస్‌గా తీసుకోవట్లేదు!

మహారాష్ట్రలో ప్రజలు శివసేనను సీరియస్‌గా తీసుకోవట్లేదని కాంగ్రెస్, ఎన్సీపీలు పేర్కొన్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదన్న సేన.. మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో ఇప్పటికీ ఇంకా ఎందుకు కొనసాగుతోందని ప్రశ్నించాయి.

వారికే నష్టం: బీజేపీ

మహారాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలన్న నిర్ణయంతో శివసేనే నష్టపోతుందని బీజేపీ వ్యాఖ్యానించింది.

'పద్మావత్'..యథాతథం!


- ఉత్తర్వుల్లో మార్పులకు సుప్రీం నో
- రేపు దేశమంతా సినిమా విడుదల
- 'జనతా కర్ఫ్యూ'కు కర్ణిసేన హెచ్చరిక



ముంబైలోని సిద్ధివినాయక ఆలయంలో దీపిక పూజలు

న్యూఢిల్లీ, జైపూర్, ముంబై, జనవరి 23 : పద్మావత్ చిత్రం విడుదలను ఏ రాష్ట్రమూ అడ్డుకోరాదన్న తన ఉత్తర్వులను సవరించాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. తమ ఆదేశాలకు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో గురువారం పద్మావత్ చిత్రం విడుదలకు సంబంధించిన అన్ని అడ్డంకులూ దాదాపు తొలగిపోయాయి. ఈ చిత్రాన్ని కొన్ని రాష్ట్రాలు ఆ నిషేధించగా.. ఆ నిర్ణయాన్ని ఈ నెల 18న సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై పునరాలోచన చేయాలంటూ మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును కోరాయి. తమ నిర్ణయానికి తిరుగులేదని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. అనుకోని పరిస్థితులు తలెత్తితే.. తమను సంప్రదించొచ్చునని పిటిషనర్లకు బెంచ్ వెసులుబాటునిచ్చింది. అయితే, సుప్రీం ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వాలను తప్ప తమను నిర్దేశించలేవని కర్ణిసేన నాయకుడు లోకేంద్ర సింగ్ కల్వీ అన్నారు. 'ఈ సినిమాను ప్రదర్శించే థియేటర్లను తగలబెట్టడానికీ వెనుకాడం. థియేటర్ల వద్ద జనతా కర్ఫ్యూ నిర్వహిస్తామ'ని చెప్పారు. ఇదిలాఉండగా, 'పద్మావత్' టైటిల్ పాత్రధారి దీపికా పదుకొనే మంగళవారం ముంబైలోని సిద్ధి వినాయక ఆలయానికి వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేతాజీకి జాతి ఘన నివాళి



న్యూఢిల్లీ, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు జాతి ఘనంగా నివాళులర్పించింది. ఆయన 121వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా మంగళవారం పలువురు నేతలు, ముఖ్యమంత్రులు నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ గొప్ప నేత అని, యువతకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. పలు రాష్ట్రాల గవర్నర్లు, సీఎంలు, ప్రజాప్రతినిధులు నేతాజీకి ఘన నివాళి అర్పించారు. నేతాజీ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించకపోవడంపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రాన్ని విమర్శించారు. ఆయన అదృశ్యంపై ప్రజలకు వాస్తవాలు తెపాలని కోరారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తే నేతాజీ మరణంపై వాస్తవాలు తెలుస్తాయని ఆయన కుమార్తె అనితా బోస్ పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలకు నగదు విరాళం రూ.2 వేలకు మించొద్దు

- ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనే చందాలు: ఐటీశాఖ


న్యూఢిల్లీ, జనవరి 23: అక్రమంగా నగదు లావాదేవీలకు పాల్పడొద్దని దేశ పౌరులకు ఆదాయ పన్ను శాఖ పిలుపిచ్చింది. ముఖ్యంగా రాజకీయ పార్టీలకు రూ.2 వేలకు మించి నగదు రూపంలో విరాళంగా ఇవ్వొద్దని మంగళవారం ఓ ప్రకటనలో సూచించింది. రాజకీయ పార్టీలకు నిధులు అందించే విధానాన్ని ప్రక్షాళన చేస్తూ ప్రభుత్వం ఈ నెల మొదట్లో ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. పార్టీలకు విరాళాలు ఇవ్వదలచినవారు ఈ బాండ్లను మాత్రమే కొనుగోలు చేయాలి. వాటిని సదరు పార్టీలకు లేదా ట్రస్టులకు ఇవ్వాలి. ఈ బాండ్లు నిర్దేశిత ఎస్‌బీఐ శాఖల్లో లభ్యమవుతాయి. ప్రతి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో పది రోజుల పాటు ఇవి అందుబాటులో ఉంటాయి. ఈ బాండ్ల కాలపరిమితి 15 రోజులు. వీటిపై దాత పేరు ఉండదు. కానీ వీటిని కొనుగోలు చేసేవారు 'నో యువర్ కస్టమర్ (కేవైసీ) ఫారాన్ని పూర్తిచేయాల్సి ఉంటుంది. 'ఒకేరోజు ఏ వ్యక్తి నుంచీ రూ.2 లక్షలు, అంతకుపైన నగదుగా స్వీకరించొద్దు. ఒకే అంశానికి సంబంధించి కూడా ఇంత మొత్తంలో లావాదేవీలు జరపొద్దు. స్థిరాస్తుల బదిలీకి సంబంధించి రూ.20 వేలు, అంతకుమించి స్వీకరించొద్దు. చెల్లింపులు జరపొద్దు. వ్యాపారం లేదా వృత్తి వ్యయానికి సంబంధించి ఎవరూ రూ.10 వేలకు మించి నగదుగా చెల్లించకూడదు. ఈ పరిమితికి మించి నగదు చెల్లింపులు చేస్తే పన్ను గానీ, జరిమానా గానీ విధించే అవకాశం ఉంది' అని ఐటీ శాఖ హెచ్చరించింది. ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘించినా.. నల్లధనం ఛాయలు కనిపించినా.. బినామీ ఆస్తుల లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే తన ఈ-మెయిల్ blackmoneyinfo@incometax.gov.inకు సమాచారం పంపాలని కోరింది. ఐటీ శాఖ ప్రిన్సిపల్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించింది.

కౌన్సెలింగ్ కార్నర్

వీకెండ్స్‌లో ఆ కుంగుబాటు ఏమిటి?

మా తమ్ముడి వయసు 26. చాలాకాలం దాకా చదువు కోసం బెంగుళూరులోనే ఉండిపోయాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఏడాది నుంచి మాతోనే ఉంటున్నాడు. సాధారణంగా వీకెండ్ రోజుల్లో, పండగ రోజుల్లో ఇతరులెవరైనా సంతోషంగా ఉంటారు. అందుకు భిన్నంగా, మా తమ్ముడేమో చాలా డిప్రెసివ్‌గా ఉంటాడు. ఎవరితోనూ కలవడు. ఎవరైనా మాట్లాడాలని వెళితే, ఒకటి రెండు మాటలే మాట్లాడి అటు నుంచి లేచి వెళ్లిపోతాడు. ఎప్పుడూ ఒంటరిగా ఉండడాన్ని ఇష్టపడతాడు. ఎందుకిలా? ఈ స్థితి నుంచి వాడిని బయటికి తెచ్చే మార్గమేదైనా ఉంటే చెప్పండి.

- డి. ప్రవీణ్, శంషాబాద్



ఈ తత్వం కొందరిలో జీవితంలోని కొన్ని చేదు అనుభవాల ద్వారా ఏర్పడుతుంది. తన మనుగడకు సంబంధించిన ఒక అభద్రతా భావం, ఈ సమాజంతో నేను వేగలేను అన్న ధోరణి వీరిలో బలంగా ఉంటాయి. సమాజంతో కలిసిపోవడం అన్నది వీరికి అసాధ్యంగా ఉంటుంది. దానికి వీరిలోని ఒక నిరంతరమైన ఆందోళన కారణం కావచ్చు. ఇతరులెవరితోనూ కలిసిపోయే అవకాశమే రాకపోవడం కారణం కావచ్చు. ఇవేమీ కాకుండా, ఎవరితోనూ కలవకూడదని ముందే ఒక నిర్ణయం తీసుకోవడం కారణం కావచ్చు. సాధారణంగా ఇలా కలవకూడదనుకోవడానికి వాళ్లకు ఎదురైన చేదు అనుభవాలు ఒక కారణమైతే, అరుదుగా కొందరిలో జన్యుపరమైన కారణాలు కూడా ఉంటాయి. అయితే 20 ఏళ్లు దాటాక ఎదురయ్యే చేదు అనుభవాలను ఎంతో కొంత తట్టుకునే శక్తి అప్పటికి ఉంటుంది. ఒకవేళ టీనేజ్‌లోనే ఏవైనా అవమానాలకు గురికావడం కానీ, హింసకు గురికావడం గానీ జరిగితే వీళ్లు బాగా కుంగిపోతారు. అప్పటినుంచే ఈ ధోరణి మొదలవుతుంది. జరిగిన అవమానాల్నీ, హింసనూ ఏళ్లపర్యంతం తలుచుకుంటూ మదనపడుతుంటారు. తన జీవితానికి అర్థం కానీ, పరమార్థం కానీ లేవనుకుంటారు. అసలు జీవితమే వ్యర్థమైపోయిందనుకుంటారు. ఇలాంటి వారిని దారికి తీసుకురావడంలో అయినవాళ్ల, ఆత్మీయుల భూమిక చాలా ఎక్కువగా ఉంటుంది. నలుగురిలో కలిపే ఒకటి రెండు ప్రయత్నాలు చేసి, ఫలితం కనిపించకపోతే ఇక వీడింతే అని వదిలేయకుండా, ఆ ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉండాలి. వాళ్లల్లో ఏదైనా సృజనాత్మక విషయం ఉంటే కనీసం దాన్ని పెంపొందించుకునే దిశగానైనా వారిని ప్రేరేపించాలి. ఏదో ఒక హాబీ, ఏదో ఒక విషయానికి సంబంధించి ఒక ప్యాషన్ ఉండడం వీరికి చాలా అవసరం.

- డాక్టర్. ప్రవీణ్‌కుమార్ చింతపంటి
కన్సల్టెంట్ సైకియాట్రిస్, ట్రాంక్విల్ హాస్పిటల్
హైదరాబాద్



'కాస్ నాయుడు'

కామెంటరీ క్వీన్!

క్రికెట్ అంటే ప్రాణం పెట్టేవాళ్లని చాలామందిని చూస్తాం. ఆడే ఆడపిల్లల్ని కూడా చూస్తున్నాం. అంతెందుకు మన భారత మహిళా క్రికెట్ టీం ప్రతిభ తెలిసిందే. అయితే క్రికెట్ వ్యాఖ్యాతలంతా మగవాళ్లే... సీనియర్ క్రీడాకారులే. మగ వ్యాఖ్యాతలకు ఏమాత్రం తీసిపోకుండా మాటల సిక్సర్లతో తన సత్తాను చాటుతోంది తెలుగు సంతతికి చెందిన తొలి ఆఫ్రికా మహిళా క్రికెట్ వ్యాఖ్యాత **కస్తూరి నాయుడు**. 14వ ఏట నుంచీ తన కలను సాకారం చేసుకోవడానికి మాటల 'పరుగులను' ప్రారంభించిన కస్తూరి ఈ రంగంలో తన సత్తా చాటుతోంది. కిక్రెట్ సర్కిల్స్‌లో 'కాస్ నాయుడు' గా చిరపరచితమైన కస్తూరి గురించిన కబుర్లు ఆమె మాటల్లోనే...

'మా అమ్మమ్మ, తాతయ్యలది విశాఖపట్నం. అమ్మ వాళ్ల కుటుంబం ఎన్నో ఏళ్ల క్రితం సముద్రంలో ప్రయాణించి దర్బన్‌కి వచ్చింది. నేను క్రికెట్ వ్యాఖ్యాత కావాలనే ఆలోచన అనుకోకుండా వచ్చింది. అదే చివరకు నా కల అయింది. ఆ కలను నిజం చేసుకున్నాను.. అది కూడా చాలా విచిత్రంగా జరిగింది.

అప్పుడు నాకు 14 ఏళ్లు. టీవీలో దక్షిణాఫ్రికా సిరీస్‌కు మహిళా కామెంటేటర్ డొన్నా సిమండ్స్ వ్యాఖ్యానం ఇస్తోంది. అది వింటున్న నా గుండె లయ తప్పింది. అంత చిన్న వయసులో ఆమె వ్యాఖ్యానం నన్ను ఎంతో ఉత్తేజపరిచింది. నాలో ఉద్వేగం ఉవ్వెత్తున ఎగిసింది. ఇంతకు మునుపు ఎన్నడూ జరగనిది జరిగింది. క్రికెట్‌తో ఆ క్షణం నుంచే నేను గాఢంగా కనెక్టయిపోయా. అప్పటి నుంచి క్రికెట్టే నా సర్వస్వం అయింది. అంతకు మునుపు చాలాసార్లే టీవీలో మధ్యవయస్కులైన ఇంగ్లీషు వ్యాఖ్యాతలు క్రికెట్ మ్యాచ్ గురించి వ్యాఖ్యానించడం చూశాను. అలా ఒకరోజు టీవీ చూస్తున్నప్పుడు ఎంతో మృదువుగా, సున్నితంగా , మరింత అందంగా ఉండే బార్బాడియన్ ఉచ్ఛారణలో, గంభీరమైన వ్యక్తీకరణతో సిమండ్ చేస్తున్న వ్యాఖ్యానం నన్ను ఎంతో ఆకట్టుకుంది. అప్పుడు మా అమ్మతో ' అమ్మా నేను దక్షిణాఫ్రికా తొలి మహిళా క్రికెట్ వ్యాఖ్యాతనవుతా. అదే నా లక్ష్యం' అని చెప్పాను.

మా ఇంట్లో వాళ్లందరిలోకి నేను కొద్దిగా భిన్నమైన వ్యక్తిని. నాలో టామ్‌బాయ్ స్వభావం కూడా ఎక్కువే. నాకు ఇద్దరు అన్నలున్నారు. అందరిలోకి చిన్నదాన్ని కావడంతో ఇంట్లో నన్నెంతో గారాబంగా పెంచారు. నెట్‌బాల్ బాగా ఆడే దాన్ని కానీ క్రికెట్ మటుకు ఎప్పుడూ ఆడలేదు. ఒకసారి క్రికెట్‌కు 'క్లీన్‌బౌల్డ్' అయిపోయిన తర్వాత దాని గురించి అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. అందుకోసం క్రికెట్ విద్యార్థిని కావాలనుకున్నాను. 14 ఏళ్ల వయసులోనే క్రికెట్ గురించి కూలంకషంగా తెలుసుకోవడం మొదలెట్టాను. బడి నుంచి తొందరగా బయటపడి వెంటనే కింగ్స్‌మెడ్‌కు వెళ్లి అక్కడ జరిగే ప్రతి క్రికెట్ మ్యాచ్‌నీ చూసేదాన్ని. స్కోరుబోర్డును జాగ్రత్తగా గమనించేదాన్ని. నా సోదరుడి సహాయంతో క్రికెట్ గురించి బాగా అధ్యయనం చేశాను. ఈ విధంగా 11 సంవత్సరాలు కష్టపడ్డా. ఆ తర్వాత క్రికెట్ గురించి అధ్యయనం చేయాలనుకునే వారికి ప్రత్యేకంగా ఎస్ఎబిసి ఉందని తెలిసింది. అందులో ప్రవేశించడానికి పరీక్షకు సిద్ధమయ్యాను. అలా క్రికెట్‌పై దశాబ్ద కాలంపాటు కష్టపడ్డాను.

ఈ సబ్జెక్టు నేర్చుకోవడం అనుకున్నంత సులభం కాదు. అందుకే ఎంతో కష్టపడ్డాను. 2006లో 'హాంకాంగ్ సిక్సీస్' మ్యాచ్‌కి వ్యాఖ్యాతగా వ్యవహరించి పలువురి మన్ననలను పొందాను. ఎన్నో పోస్ట్ మ్యాచ్‌మీట్స్ నిర్వహించాను. 2003 ఐసిసి వరల్డ్ కప్‌లో అవకాశం వచ్చింది. అది నా జీవితాన్ని మలుపుతిప్పింది. దక్షిణాఫ్రికా తొలి మహిళా క్రికెట్ వ్యాఖ్యాతగా రికార్డు సృష్టించాను. ఎస్ఎబిసి నాలుగు ప్రపంచకప్పులకు వ్యాఖ్యాతగా వ్యవహరించాను. ప్రస్తుతం ఇండియా-దక్షిణాఫ్రికా టూర్‌కు యాంకర్ కమ్ కామెంటేటర్‌గా ఉన్నాను. ఈ రంగంలో ఎదురయ్యే అన్ని రకాల సవాళ్లనూ ఎదుర్కోవాలని దృఢంగా నిశ్చయించుకునే ఇందులోకి అడుగుపెట్టాను. వచ్చిన ప్రతి అవకాశాన్ని దొరకబుచ్చుకుని సద్వినియోగం చేసుకున్నా. నా ప్రతిభను నిరూపించుకున్నాను. క్రికెట్ సర్కిల్స్‌లో నన్ను అందరూ ప్రేమతో 'కాస్ నాయిడు' అని పిలుస్తుంటారు.

నాకు తొమ్మిదేళ్ల కొడుకు ఉన్నాడు. వాడి పేరు డేనియల్. లెగ్ స్పిన్ బాగా చేస్తాడు. విరాట్ కోహ్లీని కలవాలన్నది డేనియల్ కల. వాడు ఇండియా వెడితే లెగ్ స్పిన్ బాగా నేర్చుకోవచ్చంటున్నాడు. ప్రస్తుతం ఆ ఒత్తిడి నాపై ఉంది.

మా అమ్మ తండ్రిగారు 1910లో ఐదు సంవత్సరాల వయసులో విశాఖపట్నంలోని వెంకోజిపాలెం నుంచి నౌకలో ప్రయాణించి దర్బన్‌కి వచ్చారు. అప్పట్లో పోర్ట్‌నాటల్ హార్బర్‌కు చేరుకోవడానికి ఆయనకు 45 రోజులు పట్టిందట. అక్కడి నుంచి వాళ్లు మౌంట్ ఎడ్జేకోంబెకు చేరుకున్నారు. తర్వాత 1968లో అమ్మ సముద్రం మీద ప్రయాణించి భారత్‌కు చేరుకున్నారు. అప్పుడామె అనకాపల్లితో పాటు ఇండియాలోని పలు ప్రదేశాలు చూసింది. ఆ తర్వాత 2007లో తీర్థయాత్రలు చేసింది. మా అమ్మమ్మది కూడా విశాఖపట్నం యలమంచిలి. మా అమ్మ వాళ్ల కుటుంబం ఎంతో కష్టపడిన కుటుంబం. అమ్మ భగవతికి నాన్నతో సన్నాసిసైదులో 1973లో పెళ్లయింది. వాళ్లకి మేం ముగ్గురు పిల్లలం.




ఫ్యామిలీతో...

ఈ రంగంలో మహిళలకు ఎదురయ్యే సవాళ్లు చాలా ఉంటాయి. అందులోనూ పురాషాధిక్య రంగంలో పరిస్థితులు మరింత క్లిష్టంగా, సమస్యాత్మకంగా ఉంటాయి. నేను కామెంటరీ చెప్పేటప్పుడు బాగా పేరున్న నిపుణుల సరసన కూర్చుని పనిచేయాల్సి ఉంటుంది. అలాంటి అవకాశాలు ఎన్నో వచ్చాయి. ఆ అనుభవం నిజంగా ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. క్రికెట్ గురించిన జ్ఞానం కూడా మనకు బాగా పెరుగుతుంది. అనుభవజ్ఞులైన క్రీడాకారులతో పనిచేయడం నిజంగా ఒక గొప్పఅవకాశం. నన్ను ఈ స్థాయికి తీర్చిదిద్దిన వ్యక్తి ఇంగ్లీషు క్రికెటర్ రాబిన్ జాక్‌మన్. అతను నాకు క్రికెట్ గురించి నేర్పించిన విషయాలు ఎన్నో. ఎప్పటికప్పుడు నాకు ప్రతి గేమ్ గురించిన ఫీడ్‌బ్యాక్ ఇస్తూ నన్ను క్రికెట్‌లో రాటుతేల్చారు రాబిన్.

2004లో నాకు పెళ్లయింది. ముగ్గురు పిల్లలు. నాన్న చనిపోయారు. అమ్మ నాతోనే ఉంది. దక్షిణాఫ్రికా మొత్తంలో కేవలం మహిళల కోసం ఆన్‌లైన్ రిసోర్సు 'జీ స్పోర్ట్స్ ఫర్ గర్ల్స్' నిర్వహిస్తున్నాను. ప్రతిభావంతులైన మహిళా క్రీడాకారులను తయారుచేయడం, కార్పొరేట్ సంస్థలు మహిళా అథ్లెట్లకు అండగా నిలబడేట్టు కృషి చేయడం నా లక్ష్యం. ప్రతి ఏటా జీ స్పోర్ట్స్ అవార్డులు కూడా ఇస్తున్నాం.

- చిన్న వయసులోనే క్రికెట్ వ్యాఖ్యాతను అవాలని ఎందుకు కలలు కన్నానో అప్పుడైతే తెలియదు కానీ ఇప్పుడు ఎందుకో అర్థమైంది. క్రికెట్ ఆట ద్వారా దక్షిణాఫ్రికాను ఒకటి చేయాలనే కోరిక నా లోలోపల దాగుంది.
- మహిళలందరూ ఐక్యంగా నిలిస్తేనే గానీ కలిసికట్టుగా అభివృద్ధి బాట పట్టలేము.
- క్రికెట్ అంటే ఎంతో ఆసక్తి, ఏకాగ్రత. అందుకే నిరంతరం సోషల్ మీడియాలో క్రికెట్ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటాను.
- 27 ఏళ్ల వయసులో దక్షిణాఫ్రికా తొలి మహిళా క్రికెట్ వ్యాఖ్యాతనయ్యాను. దీనికి ముందు టాక్ రేడియో 702, ఇతర వెంచర్లలో పనిచేశాను.
- క్రికెట్ సౌత్ ఆఫ్రికా (సిఎస్ఎ) కుంభకోణంలో నా పేరు ఎందుకు వచ్చిందో తెలియదు. కానీ ఒక్కటి చెప్పగలను నేను క్రికెట్‌కు మంచి మాత్రమే చేశానని. అది నాకు తృప్తినిస్తుంది.
- నిజాయితీతో కూడిన జీవితాన్ని గడపాలనేది మా నాన్న జీవన వేదం. అదే నాకూ నేర్పారాయన.
- వివాదాస్పద అంశాల ద్వారా నేను జీవితంలో నేర్చుకున్న పాఠం ఏమిటంటే ఏదీ మనసుకు తీసుకోకూడదని.
- మహిళ క్రీడాకారుల వార్తలు, దక్షిణాఫ్రికా వార్తలను ప్రచురిస్తుంటాను. ఏటా ప్రముఖ క్రీడాకారిణులను అవార్డులతో సత్కరిస్తాను.

స్ఫూర్తి

అంధత్వాన్ని 'పట్టా' లెక్కించింది!

రెండేళ్ల వయసున్నప్పుడు జరానా మహేశ్వరికి కళ్లు సరిగా కనిపించడం లేదనే విషయాన్ని ఆమె తల్లిదండ్రులు గుర్తించారు. కంటి వైద్యుడిని సంప్రదిస్తే రెటీనిస్ పిగ్‌మెంటోసా (ఆర్‌పి) అనే జన్యుపరమైన రుగ్మతతో బాధపడుతోందని చెప్పారు. జరానాకు పసితనంలోనే లోకమంతా చీకటయ్యింది. అయితేనేం... ఆమె తనలోని వి'జ్ఞాననేత్రాన్ని' తెరిచింది. ప్రస్తుతం జరానా గుజరాత్‌లోని సెంట్రల్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. తన కలలు పండించుకునేందుకు వెలుగువైపు ఆమె సాగించిన ప్రయాణం స్ఫూర్తిదాయకం.

జరానా మహేశ్వరి (32) అంటే ఆ ప్రాంగణంలో అందరికీ తెలుసు. గుజరాత్‌లోని సెంట్రల్ యూనివర్శిటీలో 'తులనాత్మక సాహిత్యం, అనువాద అధ్యయనాలు'పై ఆమె తీసుకునే తరగతులకు విద్యార్థులు అమితాసక్తితో హాజరవుతారు. కళ్లు లేకపోయినా సబ్జెక్టుపై అంత 'డెప్త్'గా పాఠాలు చెప్పే అరుదైన ప్రొఫెసర్ అని కితాబులిస్తారు. గత ఐదేళ్లుగా జరానా గైడెన్స్‌లో ఇంగ్లీష్ లిటరేచర్‌లో ఎంఫిల్, మాస్టర్స్ చేస్తున్న విద్యార్థులంతా గర్వంగా ఫీలవుతారు. వారికి పాఠాలు చెప్పేందుకు ఆమె స్క్రీన్‌రీడర్, టెక్స్ట్ టు స్పీచ్ కన్వర్టర్‌ను ఉపయోగిస్తారు. "స్టూడెంట్స్‌తో ఫ్రెండ్లీగా ఉండటం మా ప్రొఫెసర్‌లోని గొప్ప లక్షణం. పాఠాలను అర్థమయ్యేలా చెప్పడం ఆమె ప్రత్యేకత" అంటారామె శిష్యులు. ఇంతకీ తొలిసారి తనకు కళ్లు లేవని తెలిసినప్పుడు ఆమె ఎలా ఫీలయ్యింది? ఇదే ప్రశ్నను జరానా ముందుంచితే హాయిగా నవ్వి "శరీరంలోని ఒక ఇంద్రియం పనిచేయనప్పుడు, మిగతా ఇంద్రియాలను మరింత శక్తివంతంగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అంతకు మించిన ఆప్షన్ ఉండదు కదా" అంటారామె.



సాధారణ బడిలోనే ...

కళ్లు లేవనే నిజాన్ని గ్రహించిన తర్వాత జరానా తల్లిదండ్రులు చింతిస్తూ కూర్చోకుండా ధైర్యాన్ని కూడగట్టుకున్నారు. జరానాకు మనోధైర్యాన్ని ఇచ్చి, ఆమెను అంధురాలిగా కాకుండా అందరిలా పెంచాలనుకున్నారు. అందుకే జరానాను ప్రత్యేక పాఠశాలలో కాకుండా రెగ్యులర్ స్కూల్లోనే చేర్పించారు. తల్లి పాఠాలు బయటికి చదువుతూంటే జరానా వాటిని మననం చేసుకునేది. స్కూల్లో కూడా తోటి విద్యార్థులు ఆమెకు బాసటగా నిలిచారు. అయితే స్కూల్‌వర్క్ చేయడంలో మాత్రం చాలా ఇబ్బంది పడేది. తోటివారంతా రెండు మూడు గంటల్లో పూర్తిచేస్తే, ఆమెకు ఏడెనిమిది గంటలు పట్టేది. అయితే ఏకాగ్రత మాత్రం లోపించేది కాదు. ఫలితంగా పదవతరగతిలో 89 శాతం మార్కులు, ఇంటర్‌మీడియెట్‌లో 85 శాతం మార్కులు తెచ్చుకుని అందర్నీ ఆశ్చర్యపరిచింది. బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీలో కూడా గోల్డ్‌మెడల్ సాధించింది. ఆ తర్వాత జరానా విజయపరంపర అలాగే కొనసాగింది. మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత గుజరాత్‌లోని సెంట్రల్ యూనివర్శిటీలో ఎంఫిల్ కూడా పూర్తి చేసింది. అయితే ఈ ప్రయాణమంతా సులువుగా ఏం సాగలేదు. ప్రతీ డిగ్రీ వెనుక ఆమె పడ్డ కష్టం ఎంతో ఉంది. జరానా తన 'గోల్'ను చెప్పినప్పుడు చాలామంది గేలి చేశారు. నిరాశపరిచారు. అయినా సరే వెనుకడుగు వేయకుండా ఆత్మస్థయిర్యమే ఆయుధంగా మలుచుకుని గత ఏడాది తన కల నెరవేర్చుకున్నారామె. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ సాధించి 'పట్టా' సాధించిన (గుజరాత్‌లో) రెండో అంధురాలిగా గుర్తింపుపొందారు.



'పవర్'ఫుల్ చంద్రిక

బొల్లినేని చంద్రిక... 'పవర్'ఫుల్ లేడీ అంటారెవరైనా. వెయిట్ లిఫ్టింగ్‌లో తిరుగులేని క్రీడాకారిణిగా ఎదగడానికి ఆమె పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చిన్నతనంలోనే తండ్రికి దూరమై, ఇడ్లీలు అమ్ముకుంటూనే తన లక్ష్యాన్ని చేరుకుంది. నవ్యాంధ్ర రాజధాని ముఖద్వారం మంగళాద్రి క్షేత్రంలో మెరిసిన ఈ 'స్వర్ణ' చంద్రిక చిన్నతనంలోనే భుజాలకెత్తుకున్న సమస్యలు తెలిస్తేగానీ ఆమె విజయాల గొప్పదనం అర్థంకాదు. ఆమె తన ప్రస్థానాన్ని 'యంగ్' తో పంచుకున్నారిలా...

స్కూల్ డేస్ నుంచి నాకు ఆటలంటే చాలా ఆసక్తి. నేను బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు కబడ్డీ ఆడేదాన్ని. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మా సీనియర్స్ ముఖ్యంగా సలోమి, షేక్ నగీనా ప్రైజులు సాధించినప్పుడు స్కూలు అసెంబ్లీలో వారి గురించి టీచర్లు గొప్పగా చెప్పేవారు. ఆ పొగడ్తలు నాలో క్రీడలపై ఆసక్తిని కలిగించాయి. నా ఆసక్తిని గమనించిన పీఈటీ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ వైపు ప్రోత్సహించారు. మంగళగిరి అంటేనే వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌కు పెట్టిందిపేరు. సొంతగా ప్రాక్టీస్ చేస్తూనే మరిన్ని మెళకువలు నేర్చుకునేందుకు అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు షేక్ సందాని వద్ద శిక్షణలో చేరా.

కుటుంబ నేపథ్యం...

మేము కృష్ణా జిల్లా రామవరప్పాడులో ఉండేవాళ్లం. మా నాన్న నరసింహమూర్తి అక్కడ ఆర్ఎంపీగా పనిచేసేవారు. అమ్మ నాగరాణి. మేం ముగ్గురు సంతానం. అయితే చెల్లెలు మాధురి, తమ్ముడు ప్రకాష్. నేను చిన్నప్పటి నుంచి అమ్మమ్మ పార్వతి వద్దే పెరిగాను. అమ్మమ్మ వాళ్ల స్వగ్రామం మేడికొండూరు మండలం పాలడుగు. తాతయ్య గుంటుపల్లి శేషయ్య వ్యవసాయం చేసేవారు. 35 సంవత్సరాల క్రితం మంగళగిరి వచ్చేశారు. ఇక్కడ ఫ్లోరింగ్ పాలిషింగ్ మేస్త్రీగా ఉండేవారు. నాకు ఆరేళ్ల వయసు ఉన్నప్పుడే నాన్న అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలానికే తాతయ్య కూడా కాలం చేశారు. అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. అమ్మ స్థానికంగా ప్రైవేటు వైద్యశాలలో నర్సుగా పనిచేసేవారు. అమ్మమ్మ చిన్న హోటల్ నడిపేవారు. కష్టాల సహవాసంతోనే పెరిగాను. విధి వక్రీకరించి అమ్మకూడా 2010లో అనారోగ్యంతో చనిపోయారు. దీంతో కుటుంబ బాధ్యత అంతా అమ్మమ్మ మీదే పడింది.

ఎన్నో ఆటుపోట్లు...

ఓ వైపు స్కూల్‌కు వెళుతూనే అమ్మమ్మకు చేదోడుగా ఉండేదాన్ని. ఆమె చిన్నపాటి హోటల్ నడుపుతుండడంతో నేను కూడా సమీప ఇళ్లకు వెళ్లి ఇడ్లీలు అమ్మి వచ్చేదానిని. ఆ సంపాదనతోనే అమ్మమ్మ మమ్మల్ని చదివించింది. నాకు స్వతహాగా క్రీడలపై ఉన్న ఆసక్తికి తోడు పీఈటీ ప్రోత్సాహం తోడవడంతో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ వైపు దృష్టి సారించా. ఇంటర్‌మీడియట్‌కు వచ్చేసరికే లిఫ్టర్‌గా గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత బీటెక్‌లో చేరా. అదే సమయంలో అమ్మ కూడా చనిపోవడంతో పవర్ లిఫ్టింగ్ కోచింగ్ ఆపేశాను. అయితే అమ్మకు నన్ను గొప్ప క్రీడాకారిణిగా చూడాలనే కోరిక ఉండేది. అందుకే గుండె నిబ్బరం చేసుకుని మరుసటి ఏడాది మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టా. నా ప్రతిభను గుర్తించిన కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్ ఫాదర్ లూర్దురెడ్డి నా కోసం ప్రత్యేకంగా కోచ్‌ను నియమించడమే కాకుండా జిమ్‌ను కూడా ఏర్పాటు చేయించారు. డైట్ కోసం నెలకు వెయ్యి రూపాయలు ఇచ్చేవారు. వెయ్యి నుంచి రూ. 5000 వరకు పెంచుకుంటూ వెళ్లారు. పోటీలకు వెళ్లేందుకు టీఏ, డీఏలు కూడా ఇచ్చి ప్రోత్సహించారు. పవర్‌లిఫ్టింగ్‌లో పేరు తెచ్చుకునేందుకు కఠోర సాధన చేశా. బలవర్థకమైన ఆహారం కోసమే నెలకు రూ.25 వేల వరకు ఖర్చు అయ్యేది. ప్రత్యేకంగా స్పాన్సర్స్ కూడా ఎవరూ లేరు. దీంతో ఓవైపు సాధన, మరోవైపు స్పాన్సర్స్‌ను వెతుక్కోవాల్సి వచ్చేది. అంతేకాదు మంగళగిరి నుంచి ప్రాక్టీసు కోసం మూడు ఆటోలు మారి వెళ్లాలి. ఉదయం వెళితే మధ్యాహ్నం వచ్చేదాన్ని. సాయంత్రం వెళితే ఇంటికి వచ్చేసరికి రాత్రి 10 గంటలు అయ్యేది. గతేడాది జనవరిలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో గోల్డ్ మెడల్ కొట్టాక.. మే వరకు ప్రాక్టీస్‌కు వెళ్లలేదు. విజయవాడ స్టేడియంలో ప్రాక్టీస్ చేసే వెయిట్‌లిఫ్టర్ నరేంద్ర (నేషనల్ మెడలిస్టు) వచ్చి మధ్యలో ఆపివేయడం మంచిదికాదని, భవిష్యత్తు ఉంటుందని ప్రోత్సహించడంతో మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టా.





కామన్వెల్త్‌లో పతకాల పంట...

గత సెప్టెంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనడానికి చాలామంది సాయం చేశారు. వారి ప్రోత్సాహంతోనే కామన్వెల్త్ పోటీలకు వెళ్లగలిగా. 84 కిలోల విభాగం పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణపతకాలు సాధించా. స్క్వాడ్, డెడ్‌లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లోనూ స్వర్ణాలతో మొత్తం నాలుగు స్వర్ణాలు అందుకున్నా. స్వర్ణపతకాలతో వచ్చిన నాకు మాతృగడ్డపై ఘనమైన స్వాగతం లభించింది. నన్ను 'స్వచ్ఛ మంగళగిరి' బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించారు. అయితే నిరుపేద కుటుంబ నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంటెక్ ఫైనలియర్ చదువుతున్న నాకు తగిన ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరుకుంటున్నా. భవిష్యత్తులో ఔత్సాహిక లిఫ్టర్లకు శిక్షణ ఇవ్వాలనేది నా లక్ష్యం.

స్టార్ కార్

బర్త్‌డే గిఫ్ట్





అందం.. అభినయంలోనే కాదు... వివాదాలతోనూ ఎప్పుడూ వార్తల్లో ఉండే బాలీవుడ్ సెక్సీ సుందరి... కంగనా రనౌత్! ఏదైనా సరే సూటిగా చెప్పేసే ఈ తార ఎప్పుడూ తనకంటూ ఓ ప్రత్యేకత చూపిస్తుంటుంది... చేసే సినిమాలైనా... తిరిగే కార్లయినా..! పదిహేడేళ్లకే తెరంగేట్రం చేసినా... తొలి కారు సొంతం చేసుకోవడానికి తనకు నాలుగేళ్లు పట్టింది. 2008లో 21వ పుట్టినరోజు నాడు కారు కొనుక్కుని... తనకు తానే బహుమతిగా ఇచ్చుకుంది. నాలుగేళ్లు కష్టపడి సంపాదించిన సొమ్ముతో బీఎండబ్ల్యూ 7 సిరీస్ కొనుగోలు చేసింది. దీని ధర సుమారు కోటి రూపాయలు. ఆ తరువాత ఓ కార్ల కంపెనీకే బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. ఇప్పుడు ఈ బ్యూటీ ఖరీదైన కార్లలోనే షికారు చేస్తుంది. ఇండస్ట్రీలో గాడ్‌ఫాదర్లు ఎవరూ లేరని చెప్పుకొనే కంగనా... తన ప్రతిభే నేడు తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని గర్వంగా చెప్పుకుంటుంది. సంపాదనలో అధిక భాగం కార్లు, స్థలాలు, డ్రెస్సులపై ఖర్చు పెడుతుంది. నిసాన్ మైక్రా ఎక్స్ షిఫ్ట్‌తో పాటు మరికొన్ని కార్లు ఆమె షెడ్‌లో ఉన్నాయి.

దూసుకెళ్లిపోండి!

కొత్త బండి గురూ!

2017 వెళ్లిపోయింది
గతేడాది ఎన్నో బైక్‌లు మార్కెట్లోకి వచ్చేశాయి
బైక్‌ప్రియులకు మంచి జోష్‌నిచ్చాయి
గతం గతః
మరి ఈ ఏడాది మాటేంటి?
ఎలాంటి బైక్స్ రాబోతున్నాయి
విడుదల కావడానికి రెడీగా ఉన్నవేంటి?
కిక్కః కిక్కస్య కిక్కోభ్యః అనుకునేలా
ఆ క్రేజీ బైక్స్ లిస్ట్ మీ కోసం!

'హీరో' వస్తున్నాడు

గతేడాది నవంబర్‌లో మిలన్ నగరంలో జరిగిన ఓ షోలో హీరో మోటోకార్ప్ ఓ బైక్‌ను విడుదల చేసింది. అదే 'హీరో ఎక్స్‌పల్స్'. విభిన్నమైన డిజైన్‌తో, రాకింగ్ లుక్‌తో తయారైన ఈ బైక్ మరి కొద్ది నెలల్లో మార్కెట్లోకి విడుదల కానుంది.

ఇంజిన్ డిస్‌ప్లే: 200సీసీ
బరువు: 140 కేజీలు
ధర: సుమారు రూ. 1.2 లక్షలు
మార్కెట్లోకి ఈ ఏడాది నవంబర్‌లో



ఈ రెండూ సూపరే!

కార్లలో బీఎమ్‌డబ్ల్యూ అంటే ఎంత క్రేజో చెప్పనవసరం లేదు. అలాగే బైక్‌లకు కూడానూ. టీవీఎస్ సంస్థతో కలిసి బీఎమ్‌డబ్ల్యూ జీ- 310 జీఎస్, జీ- 310 ఆర్ బైకులను బీఎమ్‌డబ్ల్యూ తయారు చేసింది. ఈ ఏడాదే విడుదల కానున్నాయి. అందులో జీ- 310 జీఎస్ గురించి...

ఇంజిన్ డిస్‌ప్లే: 313సీసీ
టార్క్: 34 బీహెచ్‌పీ
ధర: సుమారు రూ. 2.8 లక్షలు
విడుదల తేదీ: నవంబర్- 2018



విదేశాల్లో హిట్!

డీఎస్కే- బెనెల్లీ కంపెనీ భారత్‌లో ఇప్పటివరకూ ఆరు బైక్‌లను విడుదల చేసింది. ఇందులో 'టీఎన్‌టీ 300' ధర రూ. 3.10 లక్షలు. ఇదే కనిష్ఠ ధర. ఇక, ఈ కంపెనీ ఈ ఏడాది విడుదల చేసే బైక్ పేరు 'బెనెల్లి టీఆర్కే 502'. ఇప్పటికే విదేశీ మార్కెట్లోకి విడుదల చేసిందీ సంస్థ. అక్కడ క్లిక్ అయింది కూడా. త్వరలోనే భారత్‌లోకి రానుంది.

ఇంజిన్ డిస్‌ప్లే: 500సీసీ
టార్క్: 47 బీహెచ్‌పీ
ధర: సుమారు రూ. 6.5 లక్షలు
గేర్లు: 6
విడుదల తేదీ: మార్చి- 2018



ఇటాలియన్ బైక్!

భారత్ మార్కెట్లోకి అడుగుపెట్టనున్న ఇటాలియన్ బైక్ కంపెనీ త్వరలో ఈ బైక్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. సూపర్‌డ్యూయల్‌గా రానున్న ఈ బైక్ ఫీచర్స్ ఏంటంటే....

ఇంజిన్ డిస్‌ప్లే: 600సీసీ
టార్క్: 54 బీహెచ్‌పీ
ధర: సుమారు రూ.6 లక్షలు
విడుదల తేదీ: మార్చి- 2018



కవసాకీ షురూ!

బైక్ ప్రియులకు మరో డ్రీమ్ బ్రాండ్- కవసాకీ. ఈ అమెరికన్ బైక్ కంపెనీ ఇప్పటివరకూ భారత్‌లో 23 మోడళ్లను మార్కెట్లోకి దించింది. తాజాగా ఈ ఏడాదిలో రానున్న మరో మోడల్ 'కవసాకీ నింజా హెచ్2 ఎస్ఎక్స్'. మిగతా మోడళ్లతో పోలిస్తే ఈ బైక్ ఖరీదు చాలా ఎక్కువ.

ఇంజిన్ డిస్‌ప్లే: 998సీసీ
టార్క్: 137.3 ఎన్ఎమ్- 9500ఆర్పీఎమ్
గేర్స్: 6
ధర: సుమారు రూ.22 లక్షలు
విడుదల తేదీ: మార్చి- 2018



పీసీఓడీ సమస్యకు హోమియో వైద్యం

ప్రస్తుత ఆధునిక కాలంలో మానవుడి జీవన విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, అధిక మానసిక ఒత్తిడికి లోనవడం, వ్యాయామాలు చేయకపోవడం వంటి వాటివల్ల చాలా మంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం స్త్రీలను వేధిస్తున్న సమస్య పీసీఓడీ. ఈ సమస్య ఉన్న మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీనివల్ల వీరిలో రుతుచక్ర సమస్యలు తలెత్తుతాయి. యుక్తవయస్సు వారిలో తొలిత మొటిమలు, అవాంఛిత రోమాలు, అధిక బరువు వంటివి వస్తాయి. దీనికి సరైన చికిత్స తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులకు దారి తీసే అవకాశాలు ఉన్నాయి.



పీసీఓడీ అంటే: అపరిపక్వమైన అండం (ఇమ్మెచ్యూర్ ఫాలికల్) నీటి బుడగల వలే మారి అండాశయపు గోడలపై ఉండిపోవడాన్ని పాలిసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్ (పీసీఓడీ) అంటారు. సాధారణంగా రుతుచక్రం ఉన్న మహిళల్లో నెలసరి అయిన 11-14 రోజుల మధ్య నెలకు ఒక అండాశయం నుంచి అండం విడుదలయి ఫలదీకరణకు సిద్ధంగా ఉంటుంది. కానీ పీసీఓడీ ఉన్న మహిళల్లో అండాశయం నుంచి అండం విడుదల కాకుండా, అపరిపక్వత చెందిన అండాలు, నీటి బుడగల్లా మారి అండాశయపు గోడలపై కనిపిస్తాయి. ఇలా రెండు అండాశయాలపై నీటి బుడగలు కనిపిస్తే... వైద్య పరిభాషలో దాన్ని బైలేటరల్ పీసీఓడీ అంటారు.

కారణాలు: ఈ సమస్యకు కచ్చితమైన కారణాలు తెలియలేదు. కానీ కొన్ని జన్యుపరమైన, వంశపారంపర్య అంశాల వల్ల ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ఈస్ట్రోజన్, టెస్టోస్టిరాన్ హార్మోన్ల అసమతుల్యత, సరైన జీవన శైలి లేకపోవడం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, అధిక మానసిక ఒత్తిడి వంటి వాటివల్ల ఈ సమస్య ఏర్పడవచ్చు.

ఇన్సులిన్ రెసిస్టెన్స్: దీనివల్ల రక్తంలో ఇన్సులిన్ శాతం పెరిగి, టెస్టోస్టిరాన్ హార్మోన్ స్థాయిలు పెరుగతాయి. ఇది స్థూలకాయానికి దారితీసి, పీసీఓడీ సమస్యను ప్రేరేపిస్తుంది.

లక్షణాలు: నెలసరి రాకపోవడం, నెలసరిలో ఎక్కువ రక్తస్రావం అవ్వడం, నెలసరి సరిగా వచ్చినా అండాశయం నుంచి అండం విడుదల కాకపోవడం, ముఖం, వీపు భాగంలో మొటిమలు, చర్మం ముడతలు, మెడ భాగంలో మందంగా, నల్లగా మారడం, సంతానలేమి సమస్యను ఎదుర్కోవడం, తలనొప్పి, బరువు పెరగడం, జుట్టు రాలిపోవడం, ముఖం, ఛాతీపై మగవారి మాదిరిగా వెంట్రుకలు ఎక్కువగా రావడం గమనించవచ్చు.

దుష్ఫలితాలు: టైప్-2 డయాబెటిస్, గుండె జబ్బులు, కొలెస్ట్రాల్ సమస్యలు, అధిక రక్తపోటు, ఎండోమెట్రియల్ క్యాన్సర్ వంటి సమస్యలకు పీసీఓడీ దారితీస్తుంది.

తీసుకోవల్సిన జాగ్రత్తలు: జీవన విధానంలో తగిన మార్పులు చేసుకోవడం ద్వారా... ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా డయాబెటిస్, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చు.

హోమియోకేర్ ఇంటర్నేషనల్ వైద్యం: హోమియోకేర్ ఇంటర్నేషనల్‌లో అందించే జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ చికిత్సా విధానం ద్వారా హార్మోన్ల అసమతుల్యత వల్ల ఏర్పడే వ్యాధులను సమర్థవంతంగా నియంత్రణలో ఉంచే అవకాశం ఉంటుంది. అంతేకాకుండావ్యాధి సంబంధిత కాంప్లికేషన్లు ఉన్నా, వాటిని తప్పక నియంత్రించవచ్చు. యుక్తవయస్సులోనే దీనికి సరైన చికిత్స తీసుకోవడం వల్ల సంతానలేమి, ఒబేసిటీ వంటి దుష్ఫలితాల నుంచి కాపాడుకోవచ్చు.



ఆటోఇమ్యూన్ వ్యాధులకు హోమియో పరిష్కారం

శరీరం వ్యాధుల బారిన పడకుండా కాపాడటానికి, పోరాడటానికి ఒక రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఆ రక్షణ వ్యవస్థ పొరబడి తన సొంత శరీరంపైనే దాడి చేస్తే థైరాయిడ్ సమస్యలు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, తెల్లమచ్చలు, సోరియాసిస్ వంటి వ్యాధులు వస్తాయి. అందుకే వీటిని ఆటో ఇమ్యూన్ వ్యాధులు అని అంటారు. శరీర కణజాలాన్ని రక్షించడానికి రక్షణ వ్యవస్థ ఉంటుంది. అది శరీరంలో రక్షణ కవచాన్ని ఏర్పరుస్తుంది. అలాంటి వ్యవస్థలో లోపం వల్ల సొంత శరీరంపైనే, కణజాలంపైనే దాడిచేస్తుంది.

కారణాలు: బ్యాక్టీరియా, వైరస్, కెమికల్స్, కాలుష్యం, వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా ఉంది. **లక్షణాలు:** కండరాల నొప్పి, నీరసం, జ్వరం, అలసట, కీళ్ల నొప్పులు, చర్మం, రక్తకణాలు, రక్తనాళాలు ప్రభావానికి లోనవుతాయి.

వ్యాధి నిర్ధరణ: ఆటోయాంటీ బాడీస్ పరీక్షలు, సి- రియాక్టివ్ ప్రొటీన్, ఈఎస్ఆర్, సీబీపీ, ఎరిత్రోసైట్ సెడిమెంటిన్ రేట్

కొన్ని రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులు



రుమటాయిడ్ అర్థరైటిస్: ఇదొక ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్. జీవక్రియలో ఏర్పడే అసమతుల్యత వల్ల తలెత్తే ఈ ఆటో ఇమ్యూన్ వ్యాధి శరీరంలో రెండు పక్కలా ఉండు కీళ్లకు సమాంతరంగా వ్యాపిస్తుంది. ఆ తర్వాత తీవ్రమైన వాపునకు గురై వాటి కదలికలు పూర్తిగా స్తంభిస్తాయి. తద్వారా కీళ్ల వైకల్యానికి గురవుతాయి. కళ్లు, నోరు, ఊపిరితిత్తులకు కూడా వ్యాపిస్తుంది.

థైరాయిడ్ సమస్య: యాంటీబాడీలు శరీరంలోనే తయారుకావడం వల్ల అవి థైరాయిడ్ గ్రంథికి వ్యాపిస్తాయి. రేడియేషన్ చికిత్స ఇచ్చినప్పుడు థైరాయిడ్ గ్రంథి దెబ్బతిని హైపోథైరాయిడిజం రావచ్చు.

లక్షణాలు: మలబద్ధకం, డిప్రెషన్, నీరసం, వెంట్రుకలు రాలిపోవడం, గోళ్ల విరగడం, కాళ్లు చేతులు వాయడం, గొంతు బొంగురుపోవడం

వ్యాధి నిర్ధారణ: లిపిడ్ ప్రొఫైల్, సీబీసీ, ఎల్ఎఫ్‌టీ, ప్రొలాక్టిన్ మొదలైన పరీక్షలు

సోరియాసిస్: ఇది దీర్ఘకాలపు చర్మ వ్యాధి. ఎక్కువగా వంశపారంపర్యంగా ఇది వ్యాపిస్తుంది. ఎక్కువగా మోచేతులు, తల, వీపు, అరిచేతులు, కాళ్ళు, మెడ, నుదురు మొదలైన ప్రాంతాల్లో వ్యాపిస్తుంది. సోరియాసిస్‌ను వివిధ వర్గాలుగా విభజించారు. ప్లేక్ సోరియాసిస్, గట్టెట్ సోరియాసిస్, ఇన్వెర్స్, పుస్తులార్, ఎరిత్రోడెర్మిక్, సోరియాటిక్ ఆర్థరిటిస్.

లక్షణాలు: చర్మం ఎర్రబడటం, జుట్టు రాలిపోవటం, కీళ్ల నొప్పులు, చర్మం పొడిబారి, పగుళ్ల ఏర్పడటం, రక్తస్రావం అవటం

నిర్ధారణ పరీక్షలు: స్కిన్ బయోప్సీ, ఈఎస్ఆర్, సిబిపి, ఎక్స్‌రే

డయాబెటిస్: టైప్ 1 రకం డయాబెటిస్ అనేది ఆటో ఇమ్యూన్ డిసార్డర్‌లో మరో రకం. డయాబెటిస్ (సుగర్) వ్యాధి ఏ వయసులోనైనా రావొచ్చు. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి లోపం వల్ల తలెత్తుతుంది. వంశపారం పర్యంగా కూడా రావచ్చు. డయాబెటిస్ రెండు రకాలుగా ఉంటుంది. టైప్1, టైప్ 2. టైప్ 2 రకం 20 సంవత్సరాల లోపు వారిలో వచ్చే వ్యాధి. దీన్ని ఆటోఇమ్యూన్ డిసీజ్‌గా చెబుతారు. ఇది చిన్నవారిలో కనిపించే సమస్య కనుక అది వారి మానసిక, శారీరక పెరుగుదల మీద ప్రభావాన్ని చూపుతుంది. టైప్ 2 డయాబెటిస్ 20 సంవత్సరాలు పైబడిన వారిలో కనిపిస్తుంది. టైప్1, టైప్ 2 కాకుండా టైప్ 3 డయాబెటిస్ కూడా ఉంది. ఇది జెస్టేషనల్ డయాబెటిస్. ముఖ్యంగా గర్భిణుల్లో కనిపిస్తుంది.

లక్షణాలు: ఆకలి, నీరసం, దాహం ఎక్కువగా ఉండటం, అతిమూత్రం, కళ్లు మసకగా కనిపించడం, బరువు తగ్గటం, తలనొప్పి, గుండెదడ, చెమటలు పట్టటం, గాయాలు నయం కాకపోవటం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావటం

సిస్టమిక్ ల్యూపస్ ఎరిథెమెటసస్:
ఎస్ఎల్ఈ వలన శరీరంలోని అనేక అవయవాలు వ్యాధికి గురవుతాయి. మన రోగ నిరోధక వ్యవస్థలోని తెల్లరక్తకణాలు మన సొంత కణాలపై దాడి చేయటం వల్ల వచ్చే వ్యాధులను ఆటో ఇమ్యూన్ డిసీజెస్ అంటారు. ఇది 15 నుంచి 35 సంవత్సరాల స్త్రీలలో అధికంగా వచ్చే అవకాశం ఉంది. వ్యాధి లక్షణాలు కొద్ది రోజులు తీవ్రంగానూ, మరికొద్ది రోజుల తక్కువగానూ కనిపిస్తాయి. జన్యుపరమైన, పర్యావరణ, మానసిక ఒత్తిడి వల్ల ఈ జబ్బు వచ్చే అవకాశం ఉంది.
హోమియో చికిత్స: ఆటోఇమ్యూన్ డిజార్డర్స్ అన్నింటికీ హోమియోలో మంచి మందులు ఉన్నాయి. వీటితో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. మన రక్షణ వ్యవస్థను ప్రతిష్ఠం చేయడం, వ్యాధి తిరగబెట్టకుండా చికిత్స చేయటం హోమియోలో విశేషం.



ఎలా చెప్పను!

సృష్టిలో అన్నింటి కన్నా తియ్యనైనది... మరణం లేనిది ప్రేమ. కానీ ఇలలో... కలలో... తనే నా ప్రాణమని తలచి వలచితే... వంచనకు గురయ్యాను. తియ్యని మాటలకు పడిపోయి... నన్ను ప్రేమిస్తున్నాని చెబితే... అతనికి మనసు అర్పించుకున్నాను. తరువాత అతడు వేరొక అమ్మాయికి వలవేస్తూ, నన్ను కాదు పొమ్మంటే... నాలో నేను కుమిలిపోయి నిద్ర లేని రాత్రులెన్నో గడిపాను. ఇంతలో మధుకర్‌తో పరిచయం. సూటిగా సుత్తి లేకుండా మాటలు... లోపల ఏదీ దాచుకోలేని బలహీనతలు... అతడి సాంగత్యంలో పాత గాయాలు ఒక్కొక్కటిగా మాసిపోతున్నాయి. మనుషులు కాదు... మనసులు శాశ్వతమని... దాన్ని పెనవేస్తున్న ప్రేమ నిజమైనదని నాలో నమ్మకాన్ని కలిగించాడు. కాలం తిరుగుతోంది..! యుగం క్షణంలా గడిచిపోతోంది. తొలి ప్రేమ మొగ్గలోనే మాడిపోతే... మధుకర్‌తో మలి ప్రేమ పువ్వులా వికసిస్తోంది. తను నా పక్కనుంటే ఈ జీవితానికిది చాలనిపించేది. నాకు తెలుసు... అతడూ నన్నే కోరుకుంటున్నాడని. అందుకే మూడు ముళ్లూ వేయించుకుని మధుకర్‌ను జీవిత భాగస్వామి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కొత్త సంవత్సరం... మీటింగ్ స్పాట్ తనే ఫిక్స్ చేశాడు. ఉదయం వెళ్లేసరికి చేతి నిండా గులాబీలతో అతడు నా కోసం ఎదురుచూస్తున్నాడు. ఆ క్షణం... పరుగున వెళ్లి అతడి ఒడిలో వాలిపోవాలనిపించింది. మదిలో ఉప్పొంగుతున్న ఆనందాన్ని పెదవుల కింద పట్టి... 'ఐ వాన్ట్ టు మ్యారీ యూ' అని ఠక్కున చెప్పేసి కళ్లుమూసుకున్నా. అటు నుంచి కాదని బదులొస్తే! ఆ సందేహమే నరాలను నిస్సత్తువ చేస్తోంది. ఇంతలో మధుకర్... 'మీ టూ...' అన్నాడు. ఎగిరి గంతేశాను. మా ఇద్దరి ఎంటెక్ అయిపోయింది. ముంబైలో ఉద్యోగం వచ్చిందని, అక్కడికి వెళ్లి కాల్ చేస్తానని మధుకర్ వెళ్లిపోయాడు. నాలుగు నెలలు గడిచిపోయాయి. ఇన్ని రోజుల్లో అతడి నుంచి ఎలాంటి కమ్యూనికేషనూ లేదు. క్షణం ఒక యుగంలా మారింది. మధుకర్‌కు ఏమన్నా అయిందేమోనన్న అనుమానం మొదలైంది. వెంటనే అతడి స్నేహితుల నుంచి మధుకర్ పనిచేసే కంపెనీ పేరు తెలుసుకున్నా. పూర్తిగా వివరాలు సేకరించిన నాకు పెద్ద షాక్! అతడు వెళ్లింది ముంబై కాదు... ఢిల్లీ! రెండు నెలల కిందట పనిచేసే కంపెనీలో సహోద్యోగిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని తెలిసి దిమ్మ తిరిగింది. ప్రేమపై ఉన్న నమ్మకం పోయింది. స్వచ్ఛమైన మనసుతో అతడిని కోరుకుంటే... నిర్దాక్షిణ్యంగా నన్ను మోసగించాడు. అప్పుడే అర్థమైంది నాకు... ప్రేమన్నది వట్టి మాటలేనని... ఆకర్షణ... అవసరం తప్ప అందులో మనసుకు చోటు లేదని! నిజమైన ప్రేమనేదే లేదని! కానీ... ఈ వేదన నరనరాన్నీ దహించివేస్తోంది. అతడి ప్రేమను దక్కించుకోవడానికి అటు కన్నవారిని వదులుకున్నా... ఇటు ప్రేమనూ దక్కించుకోలేకపోయా! ఎవరికీ చెప్పుకోలేని బాధ నాది!

- మధులిత (పేర్లు మార్చాం)

మీ మనసులో మాట మాతో పంచుకోండి navya@andhrajyothy.com



కలకాలం సాగాలంటే!

ప్రేమబంధం



"నిన్న రాత్రి కాల్ చేస్తే అస్సలు కాల్ లిఫ్ట్ చేయలేదు?" అడిగాడు వరుణ్. "నిన్న రాత్రి త్వరగా నిద్రపోయా" అని బదులిచ్చింది కావ్య. మళ్లీ వరుణ్ సందేహంగా- "ఆ తర్వాత మళ్లీ చేస్తే బిజీ అని వచ్చింది" అని అనుమానం అతని గొంతులో. విసిగిపోయింది కావ్య. "అబ్బా... అమ్మ ఫోన్ చేస్తే మాట్లాడుతున్నా. దూరంగా ఉన్నవాళ్లు కంగారు పడతారు. అందుకే అమ్మ ఫోన్ లిఫ్ట్ చేశా" అని చిరాగ్గా మాట్లాడి ఫోన్ పెట్టేసిందామె. ఇలా రోజూ ఏదో గొడవ. వన్ ఫైన్ డే ఇద్దరూ బ్రేకప్ చెప్పేస్తుకున్నారు. ఏకంగా అయిదేళ్ల ప్రేమాయణానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు వారిద్దరూ. ప్రేమలో పడినా నిలబెట్టుకోలేని వాళ్లు ఇలా మన కళ్ల ముందు తిరుగుతూనే ఉంటారు. ఎక్కడో చోట ఫెయిల్ అవుతూ ఉంటారు. అస్సలు ప్రేమ అనే కాన్సెప్ట్‌కు దూరంగా ఉన్నవాళ్లూ ఉన్నారు. అసలు మనసుకు నచ్చేవాళ్లు, ప్రేమించే వాళ్లు దొరకడం అంటే అదృష్టమే! కానీ అందుకోసం ఏం చేయాలి? బండలు మోయాలా? కండలు పెంచాలా? అవసరం లేదు. అర్థం చేసుకుంటే చాలు! అది మనిషినైనా.... చుట్టూ ఉన్న పరిస్థితులునైనా! అప్పుడు ప్రేమలో పడటం.... ఆ బంధాన్ని కలకాలం నిలబెట్టుకోవడం ఏ మాత్రం కష్టం కాదు అంటున్నారు కొంత మంది పరిశోధకులు!

❖ ఎక్కువ ఆశించొద్దు

అందరూ చాలా సింపుల్‌గా చేసే తప్పు- అంచనాలు పోగేసుకోవడం! లవ్‌లో పడిన మొదటిరోజు నుంచే ఎదుటివాళ్లు 'ఇలాగే ఉండాలి'... 'ఇలా చేయకూడదు' అనుకుంటూ మనసులో గిరి గీసు కొని కూర్చొంటారు కొంతమంది. ఇలాంటి ఆలోచనల నుంచి బయటకు వచ్చేస్తే చాలా మంచిది. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. ఆ బంధం బ్రేకప్‌కు చాలా దగ్గర్లో ఉన్నట్లే! సో.... మనకు నచ్చి, మనల్ని మెచ్చిన వాళ్లతో కాస్త జాగ్రత్తగా మెలిగితే అనుబంధానికి ఏడడుగుల దూరంలో ఉన్నట్లే!

❖ గతం...గతః

లవ్ చేసి ఫెయిలయ్యారా? బ్రేకప్ కావడంతో మీ మనసు వికలమైందా? అయితే బాధను ఎంత త్వరగా వీలైతే అంతలా మీ మనసును తుడిచేయండి. బాధపడండి. ఎవరికోసమో దాచుకోవద్దు. కన్నీళ్లు ఇంకిపోవాలి. మరొక్కసారి గుర్తొస్తే హాయిగా నవ్వుకునేంత ధైర్యం మీకు రావాలి. అదో మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాలి. అప్పుడు మీరు మరొకరిని మీ జీవితంలోకి ఆహ్వానించడానికి మీరు రెడీగా ఉన్నట్లే!

❖ ఎవరో ఒకరు ఉంటారు

మీకు ఒక వ్యక్తిని బాగా ఇష్టపడ్డారు. కానీ ప్చ్.... వారు ఇదివరకే మరొకరితో రిలేషన్‌షిప్‌లో ఉన్నారని తెలిసింది. ఇక్కడే చాలా మంది చేసే తప్పేంటంటే... ఏమైనా సరే ఆ వ్యక్తే కావాలని మీ మనసులో బలంగా ఫిక్స్ అయిపోతారు. కానీ ఇలా చేస్తే మిగిలేది శూన్యమే. సో... బాధపడకండి. మీ కోసం ఎవరో ఒకరు రెడీగా ఉంటారు. ఆ టైమ్ రావాలంతే!

❖ కష్టాలు లేనిదెవరికి?

ప్రేమలో పడటం చాలా ఈజీ. కానీ ఆ అనుబంధాన్ని నిలబెట్టుకొని జీవితంలో గెలిచేవాళ్లను ఎక్కువ మంది లేకపోవచ్చు. ఏదో ఒక ఆకర్షణకు లోనై, దాన్నే ప్రేమగా భావించేవాళ్లూ ఉన్నారు. అన్నీ బాగానే ఉన్నప్పుడు ఓకే. కానీ కష్టాలు రాకుండా ఊరుకోవు కదా! అడుగడుగునా సహనాన్ని పరీక్షిస్తాయి. ఎదుటి వ్యక్తిలోని అసలు స్వరూపం బయటపడేదీ అప్పుడే! బీ స్ట్రాంగ్!

❖ ఇది ముఖ్యం కాదేమో!

రోడ్డు మీదకు వెళితే చాలు. అమ్మాయి, అబ్బాయి చెట్టాపట్టాలేసుకుంటూ తిరిగే దృశ్యం చూస్తే మనస్సు చివుక్కుమంటుంది. మనకూ ఉంటే ఎంత బాగుంటుంది అని అనిపిస్తుంది. కానీ వెంటనే పరిసరాలు మారితే, పనిలో పడితే ఆ ధ్యాసే ఉండదు. ఇలా ఉంటే, ప్రస్తుతానికి లవ్ మీ లిస్ట్‌లో లేనట్లే. లైట్‌తీసుకోండి. కెరీర్ మీద దృష్టి పెట్టండి.

సెలబ్ స్టయిల్

'లిప్' సింక్ అయిందా?



ఎనిమిది రోజుల క్రితం... బాలీవుడ్ నటి ఈషా గుప్తా ట్విటర్‌లో ఓ ఫొటో ట్వీట్ చేశారు. ఇంతకీ ఈ బ్యూటీ ఎవరో చెప్పలేదు కదూ! హిందీ సినిమాలతో పాటు ఓ తెలుగు సినిమా కూడా చేసిందండోయ్! ఆ సినిమా గత ఏడాదే విడుదల అయింది. ఇప్పుడు ఈషా చేతిలో పెద్దగా సినిమాల్లేవు. కానీ గత కొంత కాలంగా హాట్ హాట్ ఫొటో షూట్లతో కుర్రకారు హృదయాలను వేడెక్కిస్తూ ఫోకస్‌లో ఉండటానికి చాలా ప్రయత్నాలే చేస్తున్నారీ భామ. ఈ క్రమంలో ఆమె ఇటీవల పోస్ట్ చేసిన ఫొటో కూడా అలాంటిదేమో అని చాలా మంది అనుకున్నారు. కానీ, జాగ్రత్తగా గమనిస్తే ఆమె అందంలో ఏదో తేడా ! ఉలిక్కి పడ్డారు! మునుపటి కన్నా, పెదాలు కాస్త లావుగా ఉన్నాయి. అదీ సంగతి. దాంతో ఆమె తన పెదాలకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారన్న వార్తలు హల్‌చల్ చేయడం మొదలయ్యాయి. అయితే ఈషా వీటికి సమాధానం చెప్పకుండా ఫొటోలు అప్‌లోడ్ చేస్తూనే ఉన్నారు. ఇక అప్పటి నుంచి ఆమె డ్రెస్సింగ్ స్టయిల్ కన్నా ఆమె పెదాల మీదే నెట్‌లో కామెంట్లు క్యూలు కడుతున్నాయి. కొందరు 'అబ్బే ఏం బాగాలేదు' అని విమర్శిస్తుంటే, మరి కొందరు 'మీరు సూపర్' అంటూ ఆమెను ఆకాశానికెత్తేస్తున్నారు. ఏ మాటకామాట.. సెలబ్రిటీలు ఏం చేసినా ఆ కిక్కే వేరప్పా!

కౌన్సెలింగ్

గెలవాల్సింది పరీక్షలోనా? జీవితంలోనా?

తరచూ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొంటున్న పరిస్థితి. మెడికల్ సీట్ వస్తుందో రాదో అని ఆత్మహత్య చేసుకొనే వారు కొందరైతే ఎంబీబీస్‌లో చేరాక మంచి మార్కులు రావడం లేదని బలవన్మరణానికి పాల్పడేవారు కొందరు. పరిస్థితి భయానకంగా వుంది. పిల్లల ఆత్మహత్యకు కార్పొరేట్ సంస్థల్లోని విపరీతమైన ఒత్తిడి కారణం అనేది అందరికీ తెలిసిందే. మరో కారణం పిల్లలకు లైఫ్ స్కిల్స్‌తో విద్య అందక పోవడం! కింది తరగతుల నుంచి మార్కులు, ర్యాంక్‌లపై దృష్టి పెట్టి, క్రీడా స్ఫూర్తి నింపే ఆటలు, ఆత్మ విశ్వాసాన్ని పాదుకొలిపే లైఫ్ స్కిల్స్ పాటలు ఉండకపోవడం మరో కారణం. పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపే ఒక చిన్ని ప్రయత్నం ఈ పోస్ట్...

గెలుపు లోకానికి నిన్ను పరిచయం చేస్తుంది. ఓటమి లోకాన్ని నీకు పరిచయం చేస్తుంది.' ఏది ముఖ్యం? లోకాన్ని నువ్వు తెలుసుకోవడమా లేక లోకానికి నువ్వు పరిచయం కావడమా? ముందుగా లోకాన్ని తెలుసుకోవాలి. లోకాన్ని తెలుసుకోకుండా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన సినిమా, క్రికెట్ స్టార్‌లు జీవితం మలి దశలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. కొందరైతే అర్థంతరంగా జీవితం చాలించారు. గెలుపు ప్రతికూల మిత్రుడు .. కన్నింగ్ ఫ్రెండ్! అయాచితంగా చిన్న వయసులో విజయం సాధించినవారు.. తమ శక్తి సామర్థ్యాలను ఎక్కువగా ఊహించుకొని, "ఇక మనకు మొత్తం తెలుసు; ఇక నేర్చుకోవలసింది ఏమీ లేదు" అనే మనస్తత్వంతో జీవితంలో చతికిలపడతారు. ఓటమి అనుకూల శత్రువు -హానెస్ట్ ఎనిమీ! ఒక్క ఓటమి ఎన్నో పాఠాలు నేర్పుతుంది. జీవితం అనే మారథాన్‌లో ఇలా రాటుదేలిన వారికే హ్యాపీనెస్ జీవితాంతం ఉంటుంది. వంద మీటర్ల పరుగు పందెం లాంటి ఒక్క పరీక్షలో (ఎంబీబీస్, ఐఐటీ, సివిల్స్, మిస్ వరల్డ్) నెగ్గితే తాత్కాలిక ఆనందం వస్తుంది. నిన్నటి కంటే నేడు గొప్పగా ఉండాలి .. నేటి కంటే రేపు గొప్పగా ఉండాలి. అలా కాకుండా నిన్నటి కంటే నేడు హీనం అయితే ఇక బతుకు దయనీయం.

"అదేంటి? ఐఏఎస్ పరీక్షలో ఒకసారి పాస్ అయితే ఇక జీవితాంతం హ్యాపీగా బతకొచ్చు కదా!" అనుకొంటున్నారా ? అయితే మీకు వారి జీవితాల గురించి పెద్దగా అవగాహన లేనట్టే!

అది ఒక హిందూ దేవాలయం. అందులోని విగ్రహం రాతితో చేసింది. గర్భగుడి నేలపై కూడా రాతి బండలు పరిచారు. ఒక రాయి బండ చాలా రోజుల పాటు జరుగుతున్న తంతును చూసి ఒక రోజు విగ్రహంతో ఇలా అందట... "అదేంటి? నువ్వు, నేనూ ఒకే కొండపై ఉండే బండ రాయి నుంచే వచ్చాము కదా! నీకు జనాలు వంగి దండం పెట్టి పూజలు చేసి పూలు చల్లుతున్నారు. నా మీద ఎక్కి నిల్చుంటున్నారు. నువ్వు చేసిన పుణ్యం ఏమిటి? నేను చేసిన పాపం ఏంటి" అని అడిగింది. దానికి విగ్రహంలోని రాయి ఇలా అంది... "మిత్రమా! ఇద్దరం ఒకే చోటు నుంచి వచ్చిన మాట నిజం. కానీ నన్ను ఈ రూపంలో నిలపడానికి శిల్పి వేలాది దెబ్బలు నా ఒంటిపై వేశాడు. అన్నిటికీ తట్టుకొని నిలబడ్డాను. అందుకే ఈ రోజు ఈ గౌరవం" అంది. వజ్రం.. బొగ్గు.. రెండూ రూపొందింది కార్బన్‌తోనే అని ఎంసెట్, ఐఐటీలకు బట్టీ కొట్టే వాళ్ళకి తెలియంది కాదు. ఒకటో- రెండో ఓటములు, అవమానాలు ఎదురైతే ఆత్మహత్య చేసుకోవడం ఏంటి? అంబేద్కర్‌కు చిన్న వయసులో ఎదురైన అవమానాలు ఎన్ని? ఆయన కూడా నేటి యువత లాగా ఆలోచించి ఉంటే భారత జాతికి 'నవ సమాజ నిర్మాత' దక్కేవాడా? అబ్దుల్ కలాం జీవితం కూడా ఇదేగా? అన్నింటి సారాంశం ఒక్కటే.. నేటి కష్టం రేపటి సుఖాన్ని వడ్డీతో సహ తెస్తుంది. కావాల్సిందల్లా మనం కష్టం నుండి, ఓటమి నుండి, అవమానం నుండి సరైన పాఠాన్ని గ్రహించడమే.

ఇంత గొప్ప వ్యక్తుల గురించి కాదు కానీ మీకు మరో సాదా సీదా వ్యక్తి గురించి చెబుతాను. మీ అమ్మా నాన్నలాగే అతని తల్లితండ్రులు కూడా పుట్టినప్పుడే "మా వాడు డాక్టర్ కావాలి" అని నిర్ణయించేశారు. మూడేళ్ళు నిండకుండానే ఒకటో తరగతిలో చేర్చేశారు టీచర్లయిన ఆ తల్లితండ్రులు. "మనవాడు చురుగ్గా చదువుతున్నాడు, చిన్న వయసులో అయితే ఎలాంటి డైవర్షన్స్ లేకుండా టార్గెట్ సాధిస్తాడు" అని ఆశ పడ్డారు. చదువైతే చురుగ్గానే సాగించాడు. ఇంటర్ పూర్తయింది కానీ ఆ అబ్బాయికి అండర్ ఏజ్ కారణంగా ఎంబీబీస్ రాసే అవకాశం రాలేదు. విధి లేక బిఎస్సీలో చేరాల్సి వచ్చింది. డిగ్రీ పూర్తయ్యాక ఎంబీబీస్ రాసే అవకాశం వచ్చినా "మనకంటే జూనియర్స్‌తో ఎలా?" అని పరీక్షకు సరిగ్గా ప్రిపేర్ కాలేదు. ఏమైతే ఏం.. డాక్టర్ కావాలనుకున్నా కాలేక పొయ్యాడు. అటుపై ఐఏఎస్ అనుకొన్నాడు. ఇది సొంత ఆలోచన. ప్రయత్నం తీవ్రంగానే చేశాడు. మొత్తం మూడు సార్లు ప్రిలిమ్స్, మెయిన్స్ దాటి ఇంటర్వ్యూకు వెళ్లినా, ఏదో ఒక సర్వీస్ వచ్చింది కానీ అనుకొన్నది రాలేదు. కారణాలు ఏవైతేనేం? మళ్ళీ టార్గెట్ ఛేదనలో ఫెయిల్. సో! ఏం చెయ్యాలి? రెండు ఓటములు అతనికి లైఫ్ స్కిల్స్ పాఠాల్ని నేర్పాయి. జీవితంపై అవగహన పెంచాయి. చెయ్యాల్సింది ఏమిటో అర్థం అయ్యేలా చేశాయి. 'డాక్టర్- ఐఏఎస్' లక్ష్యమా? లేక మార్గమా? మార్గం మాత్రమే. ఐఏఎస్, డాక్టర్ అయితే హ్యాపీగా బతకొచ్చు. లక్ష్యం హ్యాపీగా బతకడం, మంచి పేరు సంపాదించడం, నలుగురికి ఉపయోగపడడం. ఇప్పుడతడు వేలమందిని డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దుతున్నాడు. టీచింగ్ తన 'ప్యాషన్' అని అతనికి చాలా లేటుగా అర్థం అయింది. తన ప్రొఫెషన్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. మన అభిరుచికి తగ్గ రంగం మనకు దొరికినప్పుడు మనం పూర్తి స్థాయి జాబ్ శాటిస్ఫాక్షన్ పొందుతాం. చేస్తున్న పనిని ఎంజాయ్ చేస్తాము. అప్పుడు మనకు అలసట తెలియదు. అర్థం చేసుకోండి. మీకు వీకెండ్ టెస్టుల్లో తక్కువ మార్కులు వస్తున్నాయా? మీ సెక్షన్ కిందకు వెళ్తోందా? మీ లెక్చరర్స్, మీ అమ్మా నాన్నా... చివరకు మీ స్నేహితులు కూడా మిమ్మల్ని చిన్న చూపు చూస్తున్నారా? అబ్బా! మీరెంత అదృష్టవంతులు! ఆ కసిని అలాగే ఉంచుకోండి. మిమ్మల్ని ఇప్పుడు వెక్కిరించినవారే మీ ఆఫీస్ ముందు ఉద్యోగం కోసం నిలిచే రోజు వస్తుంది. వాళ్ళు బిట్టు బట్టీ కొడుతున్నారు. మీరు లైఫ్ స్కిల్స్ పాఠాన్ని ప్రాక్టికల్‌గా నేర్చుకొంటున్నారు. అలాగే మారథాన్ రేస్ సాగించండి. మరీ ఎక్కువ వేగం అక్కర లేదు. వేగంగా పయనించిన వాడు ఎవ్వడూ మారథాన్ రేస్‌లో గెలిచినట్టు చరిత్రలో లేదు. తెల్సుకోండి! మీరు గెలవాలనుకొంటున్నది పోటీ పరీక్షలోనా? జీవితంలోనా? కేవలం పరీక్షలోనే అయితే మీకు నా సానుభూతి. 'జీవితం'లో అనుకుంటే మళ్ళీ కలుద్దాం!

● **వాసిరెడ్డి అమర్‌నాథ్**, విద్యావేత్త



సైనికులకు వందనం!


అల్లు అర్జున్

"సైనికులకు వందనంలా ఉంటుందీ పాట. నేను పాట, అందులోని సాహిత్యం వినగానే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలుస్తుందనే నమ్మకముంది. గుండెల్లో దాచుకునే పాట అవుతుంది" అన్నారు లగడపాటి శ్రీధర్. అల్లు అర్జున్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా-శ్రీధర్ నిర్మిస్తున్న సినిమా 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. ఇందులోని 'సైనిక...' పాటను గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం (జనవరి 25) సాయంత్రం విడుదల చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ "ప్రస్తుతం హైదరాబాద్ నానక్‌రామ్‌గూడా రామానాయుడు స్టూడియోలో వేసిన స్పెషల్ సెట్‌లో పీటర్ హెయిన్ నేతృత్వంలో ఇంటర్వెల్ బ్యాంగ్ తీస్తున్నాం. మా హీరో బన్నీ బాడీ లాంగ్వేజ్, నటన... ప్రతిదీ కొత్తగా ఉంటుంది. మరో 25 రోజులు చిత్రీకరణ చేస్తే సినిమా పూర్తవుతుంది. బడ్జెట్ గురించి నేనెప్పుడూ ఆలోచించ లేదు. ప్రేక్షకుల ఆశలకు మించి బడ్జెట్ ఉండాలనేది నా ప్రయత్నం. హిందీ సంగీత దర్శక ద్వయం విశాల్-శేఖర్ బన్నీ కాబట్టే... సినిమాకి సంగీతం అందిస్తున్నామని చెప్పారు. తన డ్యాన్సులతో వాళ్లను బన్నీ అంత ఇన్‌స్పైర్ చేశారు. 'సైనిక...' పాట కాకుండా ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు ఒక రొమాంటిక్ సాంగును విడుదల చేయబోతున్నాం. ప్రారంభోత్సవం రోజున ప్రకటించినట్టు ఏప్రిల్ 14న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ "సైనికుల త్యాగాలు, మనస్తత్వాలు, కష్టనష్టాలను... వాళ్ల గొప్పతనాన్ని వివరించే పాటను ఈ సినిమాలో రాశా. హీరో పరిచయ గీతాలకు ఒక వరవడి ఉంటుంది. దాన్ని బ్రేక్ చేసి... కథకు, పాత్రలకు ప్రాముఖ్యతనిస్తూ దర్శకుడు వక్కంతం వంశీ పాటలు రాయించుకున్నారు. ఆయనకు గొప్ప సంగీత అభిరుచి ఉంది" అన్నారు.

వెంకీతో రోహిత్


నారా రోహిత్

తన సినిమాలతో ఎక్కువశాతం కొత్త ఆర్టిస్టులను పరిచయం చెయ్యడం దర్శకుడు తేజ స్టైల్. ఏళ్ల తర్వాత ఆయన అందుకున్న 'నేనేరాజు నేనేమంత్రి' చిత్రానికి మాత్రం తన పంథా కాస్త మార్చాడనే అనిపించింది. ఎందుకంటే అందులో తెలిసిన ఆర్టిస్టులే ఎక్కువగా కనిపించారు. ప్రస్తుతం వెంకటేశ్‌తో ఓ సినిమా తెరకెక్కించే పనుల్లో ఉన్నారాయన. ఆ చిత్రం కోసం ఫేస్‌బుక్‌లో తేజ పోస్ట్ చేసిన కాస్టింగ్‌కాల్ లిస్ట్ చూస్తే మళ్లీ పాత పంథాలోకే వెళ్తునట్లు అనిపిస్తోంది. పాత్రల వారీగా ఆరేళ్ల ఛైల్డ్ ఆర్టిస్ట్ నుంచి 60 ఏళ్ల క్యారెక్టర్ ఆర్టిస్టుల వరకు తేజకు కావలసిన రిక్వైర్‌మెంట్‌ను ఫేస్‌బుక్‌లో ఉంచారు. ఆసక్తి ఉన్న కొత్త ఆర్టిస్ట్‌లంతా తేజ ఫేస్‌బుక్ వాల్ మీద ఫోటోలను పోస్ట్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమాలో ఓ కీలక పాత్ర కోసం నారా రోహిత్‌ను ఎంపిక చేసినట్లు కూడా ఆయన సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఫిబ్రవరిలో ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుంది.


వెంకటేశ్

సెక్సీ స్వీపర్!

మాటల్లేవ్.. మాట్లాడుకోవడాలు లేవ్! శృంగారమంటే సన్నీ లియోన్.. సన్నీ లియోన్ అంటే శృంగారం అనేంతలా ప్రతిసారి సెక్సీగా, సరికొత్తగా కనిపించడం సన్నీ లియోన్‌కి మాత్రమే సాధ్యమనుకుంట! 'పాత్ర ఏదైనా... ఘట్టం ఏదైనా... సెక్సీగా కనిపించడానికి నేను రెడీ' అన్నట్టు ప్రముఖ ఫొటోగ్రాఫర్ డబూ రత్నాని క్యాలెండర్‌కి ఇదిగో ఇలా స్వీపర్‌గా ఫోజిచ్చారు సన్నీ లియోన్. శృంగారప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది ఈ స్టిల్!!


సన్నీ లియోన్



తమిళ్ రాదు.. తెలుగూ రాదు!

- అమైరా దస్తూర్

"తమిళంలో 'అనేగన్' (తెలుగులో 'అనేకుడు'గా విడుదలైంది) చేయడానికి ముందు నాకు తమిళ్ మాట్లాడం రాదు. కానీ, ఆ సినిమా చేసిన తర్వాత ఏ భాషలోనైనా నటించగలననే నమ్మకం వచ్చింది. తెలుగు, మలయాళం... ఏదైనా! ఇప్పుడు నాకు తెలుగు రాదు. కానీ, నటించా" అన్నారు అమైరా దస్తూర్. సందీప్ కిషన్ హీరోగా మంజుల దర్శకత్వంలో పి. కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మించిన 'మనసుకు నచ్చింది'లో ఓ కథానాయికగా నటించారామె. త్రిధా చౌదరి మరో కథానాయిక. ఫిబ్రవరి 16న విడుదల కానున్న ఆ సినిమా గురించి అమైరా మాట్లాడుతూ "నాకు మంజుల గారు ఏడాది క్రితం ఈ కథ చెప్పారు. త్రిధ చేసిన పాత్ర కోసం అడిగారు. ఆ పాత్రలో నాకు నేను కనిపించలేదు. మళ్లీ కొన్ని రోజుల తర్వాత ఫోన్ చేసి, నిత్యా పాత్ర చేస్తావా? అనడిగారు. నా వ్యక్తిత్వానికి నిత్యా పాత్ర దగ్గరగా ఉంటుందని చెప్పారు. నాకూ ఆ పాత్ర బాగా నచ్చడంతో ఓకే చెప్పేశా. ఆ కథంతా నిత్య, సూరజ్ (సందీప్) పాత్రల చుట్టూ తిరుగుతుంది. కాసేపటిలో పెళ్లి చేసుకోవలసిన వీళ్లిద్దరూ ఎందుకు పారిపోయారు? ఆ తర్వాత ఏం జరిగిందనేది కథ. మంజులగారు చాలా బాగా తీశారు. సందీప్ ఎంతో హెల్ప్ చేశాడు. తెలుగు రాకపోవడం వల్ల సెట్‌లో ఇబ్బందులు పడ్డా. ప్రస్తుతం తెలుగు నేర్చుకునే పనిలో ఉన్నా. ఈ సినిమా తర్వాత రాజ్‌తరుణ్‌కి జంటగా నటించిన 'రాజుగాడు'తో మళ్లీ వస్తా" అన్నారు.



స్వీటీ షాకయింది!

- కళా దర్శకుడు రవీందర్

"దర్శక-నిర్మాతలకు 'భాగమతి బంగ్లా' స్కెచ్‌లు చూపించి, సరేనన్నాక పని ప్రారంభించా. బంగ్లా నిర్మాణం పూర్తయ్యే వరకూ ఎవరినీ లోపలికి రానివ్వలేదు.. నిర్మాతలతో సహా! చిత్రీకరణ తొలి రోజు సెట్‌లో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. పదకొండు గంటల నుంచి రెండింటి వరకూ సెట్ గురించి డిస్కస్ చేసుకున్నారు. స్వీటీ (అనుష్క) అయితే షాకయింది. అదే ప్రతిరోజూ సెట్‌కి వచ్చుంటే ఆ 'వావ్ ఫ్యాక్టర్' మిస్సయ్యేది. నిర్మాతలు నా స్నేహితులు కావడం వల్ల ఇదంతా సాధ్యమైంది. బంగ్లా చూసిన తర్వాత చిత్రబృందంలోని ప్రతి ఒక్కరిలో (మాలో మాకు) కాంపిటీషన్ పెరిగింది... మనమూ 'ది బెస్ట్' ఇవ్వాలని! దాంతో సినిమా సూపర్‌గా వచ్చింది" అన్నారు కళా దర్శకుడు రవీందర్. అనుష్క ముఖ్యతారగా అశోక్ దర్శకత్వంలో యు.వి. క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన 'భాగమతి'కి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేశారీయన. ముఖ్యంగా ప్రచార చిత్రాల్లో కనిపించిన బంగ్లా సెట్ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుందనీ, 29 రోజుల్లో రూ. 3కోట్ల వ్యయంతో కొత్త టెక్నాలజీతో దాన్ని నిర్మించామనీ ఆయన తెలిపారు. ఇంకా సినిమా గురించి మాట్లాడుతూ "అనుష్క కెరీర్‌లో అత్యుత్తమ చిత్రమిది. అద్భుతంగా నటించిందామె. పూర్తిస్థాయి హారర్ చిత్రం కాదిది. కొన్ని హారర్ అంశాలున్నాయి. వాటి కోసం, కథ ప్రకారం సెట్‌ని చీకటిగా తీర్చిదిద్దాం. అందువల్ల, ఒక్కోసారి సెట్‌లో నడుస్తున్నప్పుడూ నేనూ భయపడ్డా. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇస్తుంది" అన్నారు. ఇక, తన పనితీరు గురించి రవీందర్ మాట్లాడుతూ "దర్శకుడు కథ చెప్పిన తర్వాత నేను న్యాయం చేయగలనా? లేదా? అని ఆలోచిస్తా. కథ నచ్చకపోతే... సున్నితంగా తిరస్కరిస్తా. హిందీ నుంచి అవకాశాలు వస్తున్నాయి. అయితే... అక్కడికి ఒక్కసారి వెళితే మళ్లీ వెనక్కి వచ్చేలా ఉండకూడదు. అందుకని, ఆలోచిస్తున్నా. ఇక్కడి సినిమాలతోనే సరిపోతుంది. హిందీకి వెళ్లేంత ఖాళీ లేదు" అన్నారు.



శివానీ ఎంట్రీ!


అడివి శేష్

జీవితారాజశేఖర్ తనయ శివానీ హీరోయిన్ ఎంట్రీ గురించి కొన్నాళ్లగా చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా శివానీ ఎంట్రీ షురూ అయింది. హిందీలో భారీ విజయాన్ని అందుకున్న '2 స్టేట్స్' చిత్రానికి రీమేక్‌గా వెంకట్‌రెడ్డి దర్శకత్వం వహించనున్న చిత్రంలో శివానీ కథానాయికగా ఎంపికైంది. అడివి శేష్ ఇందులో కథానాయకుడు. లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని లక్ష్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎం.ఎల్.వి.సత్యనారాయణ నిర్మిస్తున్నారు. హిందీలో అలియాభట్ పోషించిన పాత్రను తెలుగులో శివానీ పోషించనుంది. అనూప్‌రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత తెలిపారు.





జియో పాపులర్ ఆఫర్లపై మరింత డేటా

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో మరింత పోటీకి తెర లేపింది. రిపబ్లిక్ డే ఆఫర్ కింద ప్రస్తుతమున్న రూ.98, రూ.399 వంటి పాపులర్ ప్యాక్‌లపై రోజు వారీ డేటా వినియోగాన్ని మరో 500 ఎంబి పెంచుతున్నట్టు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం రూ.98 ప్యాక్‌పై రోజుకు 1 జిబి చొప్పున, రూ.399 ప్యాక్‌పై 1.5 జిబి చొప్పున డేటా వినియోగించేందుకు అవకాశం ఉంది. ఈ నెల 26 నుంచి దీన్ని మరో 500 ఎంబి పెంచుతున్నట్టు తెలిపింది. అలాగే 14 రోజుల గడువు ఉండే రూ.98 ప్యాక్ గడువును 28 రోజులకు పొడిగించింది. ఎయిర్‌టెల్ ఇటీవల రూ.399 ప్యాక్‌లో 84 రోజులు చెల్లుబాటయ్యేలా రోజుకు 1 జిబి 4జి డేటా వినియోగంతో కొత్త ఆఫర్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

భారత్ పిలుస్తోంది..

రండి.. బిజినెస్ చేయండి.. సిఇఒల సమావేశంలో ప్రధాని మోదీ

ప్రధాని మోదీ గుజరాత్ బిడ్డ అనిపించుకున్నారు. దావోస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక వేదిక సమావేశాల్లో గ్లోబల్ ఇన్వెస్టర్లు, పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే ఏకైక లక్ష్యంతో మోదీ బలమైన ప్రయత్నాలు చేశారు. డబ్ల్యుఇఎఫ్ ప్లీనరీలో మాట్లాడిన మోదీ, విడిగా జాతీయ, అంతర్జాతీయ సిఇఒల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. దావోస్‌లో భారత్‌ను మార్కెట్ చేయడమే ఏకైక ఎజెండాగా దేశీయ సిఇఒలతో చేతులు కలిపి పిపిపి వ్యూహాన్ని అనుసరించారు.



దావోస్: అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు భారత్‌లో అపారమైన అవకాశాలు వేచి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా అంతర్జాతీయ కంపెనీల సిఇఒలతో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. "ఇండియా అంటేనే వ్యాపారం" అనే అంశంపై మాట్లాడుతూ, గత కొద్ది సంవత్సరాల్లో ఆర్థిక రంగంలో భారత్ సాధించిన విజయాల గురించి ఆయన వివరించారు. ప్రధానితో పాటు సిఇఒల సమావేశానికి కేంద్ర ప్రభుత్వ విదేశాంగ శాఖలో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా ఉన్న విజయ్ గోఖలే, విదేశాంగ శాఖ కార్యదర్శి జై శంకర్, డిఐపిపి సెక్రటరీ రమేష్ అభిషేక్ హాజరయ్యారు. బహుళ జాతి కంపెనీలు, విదేశీ కంపెనీలకు చెందిన 40 మంది సిఇఒలు, దేశీయ కంపెనీలకు చెందిన మరో 20 మంది సిఇఒలు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు ట్వీట్ చేశారు. ప్రధాని ప్రసంగంతో సభకు హాజరైనవారు ముగ్ధులయ్యారని ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక రంగాన్ని అనూహ్యంగా మార్చివేయడంలో 130 కోట్ల మంది భారత ప్రజలు సాధించిన విజయాలను మోదీ వివరిస్తున్నప్పుడు యావత్ ప్రపంచం హర్షం వ్యక్తం చేసిందని ట్వీట్ చేశారు. దావోస్ సమావేశాల సందర్భంగా ప్రధాని పలువురు దేశాధినేతలతోనూ బడా పారిశ్రామికవేత్తలతోనూ ముఖాముఖి మాట్లాడారు.

చేతులు కలిపితే సాధిస్తాం..

దావోస్ సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీ దేశీయ సిఇఒలతోనూ విడిగా భేటీ అయ్యారు. దావోస్ సదస్సు నుంచి భారత్ పూర్తి స్థాయిలో లబ్ధి పొందాలంటే ఏకతాటిపై ఉండి అవకాశాలను కొల్లగొట్టాలన్న వ్యూహంతో మోదీ భారత్ సిఇఒలను కలుపుకొని ముందుకు కదిలారు. భారత్ విజయాలను, భారత్‌లో ఉన్న అవకాశాలను ఉమ్మడిగానే దావోస్ వేదికలో చాటారు. రాహుల్ బజాజ్, ఆనంద్ మహీంద్రా, చందా కొచ్చార్, ఉదయ్ కోటక్, నరేష్ గోయల్, ఎన్ చంద్రశేఖరన్, సునీల్ మిట్టల్, రవి రుయా, చంద్రజిత్ బెనర్జీ ప్రధానితో పాటే ఉన్నారు. ఈ వివరాలను ప్రభుత్వ ప్రతినిధులు ట్వీట్ చేశారు.

దావోస్‌లో అమరరాజా



దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అమరరాజా బ్యాటరీస్ వైస్ చైర్మన్ గల్లా జయదేవ్ అధికారిక సభ్యుని హోదాలో పాల్గొంటున్నారు. భారత్ నుంచి పాల్గొంటున్న దాదాపు 130 మంది సిఇఒల బృందంలో గల్లా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా కొన్ని ప్రత్యేక సదస్సుల్లో జయదేవ్ ప్రసంగించనున్నారు.

ఇండస్ట్రీ 4.0తో
సామాజిక తిరుగుబాట్లు!

» భారత్‌లో ఆర్థిక అసమానతలు మరింత పెరిగే చాన్స్ : డెలాయిట్

దావోస్: నాలుగో తరం పారిశ్రామిక విప్లవం (ఇండస్ట్రీ 4.0)పై అంతర్జాతీయ ఆడిటింగ్ సేవల సంస్థ డెలాయిట్ అధ్యయన నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇండస్ట్రీ 4.0కు నాంది పలుకుతున్న కృత్రిమ మేధ (ఎఐ), డేటా అనలిటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), కాగ్నిటివ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగం పెరుగుతుండటం భారత్, దక్షిణాఫ్రికా, చైనాలో సామాజిక తిరుగుబాట్లకు దారితీయడంతోపాటు ఆర్థిక అసమానతలను మరింత పెంచవచ్చని హెచ్చరించింది. ఇండస్ట్రీ 4.0తో చోటు చేసుకోబోయే మార్పులపై పారిశ్రామిక రంగ ప్రతినిధులకు అవగాహన ఉన్నప్పటికీ.. వాటి ద్వారా లబ్ధి పొందడమెలాగని మాత్రం వారికి అంతగా తెలియదని డెలాయిట్ రిపోర్టు పేర్కొంది. దావోస్‌లో ప్రారంభమైన వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సమావేశాల్లో సంస్థ ఈ నివేదికను విడుదల చేసింది.

భారత్, దక్షిణాఫ్రికా, చైనాలు ఈ మధ్యకాలంలో రాజకీయ, ఆర్థిక పరంగా పెనుమార్పులకు లోనయ్యాయని.. ఫలితంగా కొన్ని గరిష్ఠ స్థాయి వృద్ధిని సాధించగలిగినప్పటికీ సామాజిక వ్యవస్థకు బీటలు పడ్డాయని డెలాయిట్ రిపోర్టు పేర్కొంది. ఈ పరిణామం భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

నాలుగో పారిశ్రామిక విప్లవం సామాజిక తిరుగుబాట్లకు దారితీయడంతోపాటు ఆర్థిక అసమానతలను మరింత పెంచవచ్చని డెలాయిట్ సర్వేలో పాల్గొన్నవారిలో 20 శాతం మంది ఎగ్జిక్యూటివ్‌లు అభిప్రాయపడ్డారు. ఉత్తర అమెరికా (8 శాతం), లాటిన్ అమెరికా (6 శాతం) కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లలో ఈ తరహా భయాలు వ్యక్తపర్చినవారు చాలా తక్కువ. భారత్ (32 శాతం), దక్షిణాఫ్రికా (28 శాతం), చైనా (23 శాతం)లో అధికమంది ఎగ్జిక్యూటివ్‌లు ఆందోళన వ్యక్తం చేశారని రిపోర్టు వెల్లడించింది. మొత్తం 19 దేశాల్లోని 1,600 మంది సి లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లను సర్వే చేసినట్లు డెలాయిట్ తెలిపింది.

ముంబైలో నాలుగో
పారిశ్రామిక విప్లవ కేంద్రం

» చేతులు కలిపిన రిలయన్స్, డబ్ల్యుఇఎఫ్

న్యూఢిల్లీ : భారత్‌లో నాలుగో పారిశ్రామిక విప్లవ కేంద్రం (సి4ఐఆర్)ను ఏర్పాటు చేయాలని రిలయన్స్ ఇండస్ట్రీస్, డబ్ల్యుఇఎఫ్ నిర్ణయించాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న డబ్ల్యుఇఎఫ్ నాలుగో పారిశ్రామిక విప్లవ కేంద్రానికి ముంబైలోని కేంద్రం సోదర సంస్థగా ఉంటుంది. నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని అందరికంటే ముందుగా అందుకొని ముందుకు దూసుకుపోవడానికి విధాన నిర్ణేతలు, మేధావులు, పారిశ్రామికవేత్తలకు ఒక ఉమ్మడి వేదికగా ఈ కేంద్రం ఉపయోగపడుతుంది.

» జపాన్‌ను అధిగమించి ఐదో స్థానంలో
» తేల్చి చెప్పిన పిడబ్ల్యుసి

భారత్ బంగారు గని

దావోస్ : భారత్‌లో పెట్టుబడుల వాతావరణం బాగా మెరుగు పడిందని మరో అంతర్జాతీయ సంస్థ కితాబిచ్చింది. ఈ సంవత్సరం (2018) ప్రపంచంలో పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన దేశాల్లో భారత్ జపాన్‌ను తోసిపుచ్చి ఐదో స్థానానికి ఎదిగిందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ప్రైస్ వాటర్ కూపర్స్ (పిడబ్ల్యుసి) ఒక నివేదికలో తెలిపింది. అమెరికా, చైనా, జర్మనీ, బ్రిటన్ వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలోని మేటి కంపెనీల సిఇఒలతో మాట్లాడి ఈ సంస్థ ఈ నివేదిక రూపొందించింది. దావోస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సదస్సు సందర్భంగా పిడబ్ల్యుసి మంగళవారం ఈ నివేదిక విడుదల చేసింది. భారత్‌లో వ్యాపార అవకాశాలపైనా సర్వేలో పాల్గొన్న సిఇఒలో ఎక్కువ మంది అత్యంత ఆశాభావం వ్యక్తం చేశారు. 'సంస్థాగత సంస్కరణలతో గత ఏడాది కాలంగా భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోంది' అని పిడబ్ల్యుసి ఇండియా చైర్మన్ శ్యామల్ ముఖర్జీ చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, వాతావరణ మార్పులు వేధిస్తున్నా.. మౌలిక సదుపాయాలు, తయారీ రంగం, ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సర్వేలో పాల్గొన్న సిఇఒల్లో 41 శాతం మంది అంతర్జాతీయ ఉద్రిక్తతలు, సైబర్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఎక్కడా లేనన్ని అవకాశాలు

ప్రస్తుతం భారత్‌లో ఉన్నన్ని పెట్టుబడి అవకాశాలు ప్రపంచంలో మరెక్కడా లేవని డబ్ల్యుఇఎఫ్ సదస్సుకు హాజరైన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 'గత మూడేళ్లుగా మాది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. ఇపుడు మేము మా మౌలిక సదుపాయాలనీ పెద్ద ఎత్తున అభివృద్ధి చెస్తున్నాం. చాలా మంది దీన్నో భారీ పెట్టుబడి అవకాశంగా చూస్తున్నారు' అన్నారు. ఒక్క మౌలిక సదుపాయాల రంగంలోనే భారత్‌లో రెండు లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. ప్రధాని మోదీ కృషితో అంతర్జాతీయంగానూ భారత పేరు ప్రతిష్ఠలు పెరిగి పోయాయని గోయల్ చెప్పారు.

మహిళలనూ కలుపుకు పోవాలి : లగార్డే

ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో భారత్ మహిళలను కూడా కలుపుకు పోవాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టినా లగార్డే కోరారు. ఉద్యోగాల్లో మహిళల సంఖ్య పురుషులతో సమాన స్థాయికి చేరితే భారత జిడిపి మరో 27 శాతం పెరుగుతుందన్నారు. అయితే ఇందుకోసం భారత్ ద్రవ్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకు రావలసి ఉందన్నారు. ఈ సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థ 7.4 శాతం వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని లగార్డే మరో సారి చెప్పారు.

పటేల్ బాగా పని చేస్తున్నారు : రాజన్

భారత్‌లో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసే విషయంలో ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నాయకత్వంలోని ద్రవ్య విధాన కమిటీ చక్కగా పని చేస్తోందని డబ్ల్యుఇఎఫ్ సదస్సుకు హాజరైన ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కితాబిచ్చారు. కీలక వడ్డీ రేట్లు తగ్గించకుండా ఆర్‌బిఐ జాప్యం చేస్తోందని ప్రభుత్వ పెద్దల నుంచి విమర్శలు వినిపిస్తున్న సమయంలో రాజన్ తన మాజీ సహచరుడిని వెనకేసుకు రావడం విశేషం. ద్రవ్యోల్బణం ఒత్తిడి ఉన్న దేశాల్లో ధరలు అదుపు తప్పకుండా చూడడమే ప్రధానమని రాజన్ స్పష్టం చేశారు. పశ్చిమ దేశాలు తమ అభివృద్ధి ఫలితాలను వర్ధమాన దేశాలతో పంచుకోవాలని కూడా రాజన్ కోరారు. లేకపోతే ముందు ముందు సంపన్న దేశాలే నష్టపోతాయని హెచ్చరించారు. జనాభాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతున్న తరుణంలో, తమ ఉత్పత్తులకు వర్ధమాన దేశాలే ప్రధాన మార్కెట్లు అనే విషయాన్ని ఈ దేశాలు వెంటనే గ్రహించాలని కోరారు.



వేవ్‌రాక్ ధర రూ.2,000 కోట్లు!

విక్రయానికి జిఐసి, టిష్‌మన్ సన్నాహాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్ ప్రాపర్టీ వేవ్‌రాక్‌ను 2,000 కోట్ల రూపాయలకు విక్రయించేందుకు సింగపూర్ సార్వజనీన వెల్త్‌ఫండ్ జిఐసి పిఎల్‌సి, న్యూయార్క్‌కు చెందిన డెవలపర్ టిష్‌మన్ స్పియర్ సన్నాహాలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టిఎస్ఐఐసి) ప్రమోట్ చేసిన స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) అయిన గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన వేవ్‌రాక్‌ను జిఐసి, టిష్‌మన్ స్పియర్ చెరిసగం భాగస్వామ్యంతో నిర్మించాయి. వేవ్‌రాక్‌ను విక్రయించేందుకు గాను ఇరు సంస్థలు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జోన్స్ లాంగ్ లాసల్లే ఇంక్ (జెఎల్ఎల్) నియమించుకున్నట్లు తెలిసింది. వేవ్‌రాక్‌ను కొనుగోలు చేసేందుకు ఇప్పటికే అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లు సహా మరికొంత మంది ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిసింది.

వేవ్‌రాక్‌లో ఇప్పటికే గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలైన యాపిల్ ఇంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), యాక్సెంచర్, జిజికె టెక్నాలజీస్, అవీవా సొల్యూషన్స్, డ్యూపాంట్ ఇండియా, క్యాప్‌జెమినీ, బిర్లా సాఫ్ట్ కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకోవటం ద్వారా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. 2015లో టిష్‌మన్ స్పియర్‌కు చెందిన వేవ్‌రాక్‌లో జిఐసి 50 శాతం వాటాను కొనుగోలు చేసింది. అనంతరం ఇరు సంస్థలు కలిసి కార్యాలయ స్థలాన్ని 25 లక్షల చదరపు అడుగులకు విస్తరించాయి.

అంతర్జాతీయంగా పేరొందిన ఆర్కిటెక్చర్ సంస్థలైన పీ కోబ్ ఫ్రీడ్ అండ్ పార్ట్‌నర్స్ వేవ్‌రాక్ భవనాన్ని డిజైన్ చేశాయి. టిష్‌మన్ స్పియర్స్ 2010, 2014 సంవత్సరాల్లో రెండు దశల్లో వేవ్‌రాక్‌లో 15 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా ఇటీవలి కాలంలో హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్‌కు పెరగటంతో పాటు కొత్త ఆఫీస్ స్పేస్ భవనాల నిర్మాణాలు ఊపందుకుంటూ వస్తున్నాయి. మరోవైపు భారతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపథంలో సాగుతుండటం సహా సేవల రంగంలో డిమాండ్ ఊపందుకోవటం హైదరాబాద్ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతూ వస్తోంది.

ఎపి ప్రభుత్వంతో ఎఐఎస్ఇసిటి జట్టు

» ఎస్‌సి యువతకు నైపుణ్య శిక్షణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి)తో నైపుణ్య శిక్షణ సంస్థ ఎఐఎస్ఇసిటి జట్టు కట్టింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన రికగ్నిషన్ ఆఫ్ ప్రయర్ లెర్నింగ్ (ఆర్‌పిఎల్) సిఫారసులను అమలు చేయటంలో తోడ్పాటునందించటంతో పాటు నంద్యాల, గుంటూరు, చిత్తూరుల్లో 120 మంది నిరుద్యోగ షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతకు నైపుణ్య శిక్షణను అందించనున్నట్లు ఎఐఎస్ఇసిటి తెలిపింది. అలాగే నెల్లూరు, విశాఖపట్నం, చిత్తూరు, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో 500 మంది అభ్యర్థులకు ఆర్‌పిఎల్ ద్వారా శిక్షణను ఇవ్వనున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలోని ఎస్‌సి యువతకు ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ లింక్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. ఒప్పందంలో భాగంగా కర్నూలు జిల్లా నంద్యాలలో 30 మందికి మెడికల్ యూత్ రిప్రజెంటేటివ్స్, మరో 30 మందికి జనరల్ డ్యూటీ అసిస్టెంట్స్, చిత్తూరు, గుంటూరు జిల్లాలో చెరో 30 మందికి రిటైల్ అసోసియేట్స్‌లో శిక్షణను ఇవ్వనున్నట్లు ఎఐఎస్ఇసిటి తెలిపింది.

హెరిటేజ్ ఫుడ్స్ సిఎఫ్ఒకు ఐసిఎఐ అవార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ సిఎఫ్ఒ ప్రభాకర నాయుడు.. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) నుంచి అవార్డును అందుకున్నారు. వ్యవసాయం, అనుబంధ సర్వీసుల విభాగంలో ఎక్సలెన్స్ ఇన్ సిఎ-సిఎఫ్ఒ అవార్డును గెలుచుకున్నారు. ఇటీవల జరిగిన పదకొండవ ఐసిఎఐ అవార్డుల కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు చేతుల మీదుగా ప్రభాకర నాయుడు ఈ అవార్డును అందుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఐసిఎఐ నుంచి హెరిటేజ్ ఫుడ్స్ సిఎఫ్ఒ ప్రభాకర నాయుడు అవార్డును అందుకోవటం ఎంతో సంతోషాన్నిస్తోందని, ఇది మేనేజ్‌మెంట్, ఉద్యోగులు భవిష్యత్తులో మరిన్ని అవార్డులను సాధించేందుకు దోహదపడుతుందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రాహ్మణి నారా అన్నారు.



ఎఆర్, విఆర్ స్టార్టప్స్‌కు
ఫేస్‌బుక్ చేయూత

టి-హబ్‌తో కలిసి ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : దేశంలో అగ్‌మెంటెడ్, వర్చువల్ రియాల్టీ (ఎఆర్ అండ్ విఆర్) రంగాలకు చెందిన స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు సోషల్ మీడియా దిగ్గజం 'ఫేస్‌బుక్' సంస్థ సిద్ధమైంది. ఇందుకోసం టి-హబ్‌తో కలిసి 'ఇండియా ఇన్నొవేషన్ హబ్ యాక్సిలరేటర్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. టి-హబ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను టి-హబ్ సిఇఒ జయ్ కృష్ణ, ఫేస్‌బుక్ ఇండియా, సౌత్ ఆసియా పార్ట్‌నర్‌షిప్ ప్లాట్‌ఫామ్ హెడ్ సత్యజీత్ సింగ్ మార్చుకున్నారు. 'విద్య, ఆరోగ్య రంగాలను ఎఆర్, విఆర్ టెక్నాలజీల ఆధారిత స్టార్టప్ కంపెనీలు సమూలంగా మార్చేసే అవకాశం ఉంది' అని ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టి-హబ్ సిఇఒ చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ రంగాలకు చెందిన స్టార్టప్ కంపెనీల నుంచి దరఖాస్తులు స్వీకరించి 'ఇండియా ఇన్నొవేషన్ హబ్ యాక్సిలరేటర్' కార్యక్రమం కింద 10 కంపెనీలను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఈ సంవత్సరం ఏప్రిల్ 5 నుంచి ఆ కంపెనీల ప్రతినిధులకు టి-హబ్‌లో మూడు నెలల పాటు ప్రత్యేక తోడ్పాటు అందిస్తారు.

దేశవ్యాప్తంగా ఎఆర్, విఆర్ రంగాలకు చెందిన అన్ని కంపెనీలు ఈ కార్యక్రమం ఫేస్‌బుక్ సహాయ, సహకారాల కోసం పోటీపడవచ్చని జయ్ కృష్ణ చెప్పారు. మూడు నెలల ప్రత్యేక తోడ్పాటు తర్వాత ఫేస్‌బుక్ కొన్ని కంపెనీలను ఎంచుకుని వాటికి అవసరమైన ప్రత్యేక తోడ్పాటు అందిస్తుందన్నారు. విద్య, ఆరోగ్యం, రవాణా రంగాల్లో ఎదురవుతున్న సంక్లిష్టమైన సవాళ్లను ఎఆర్, విఆర్ టెక్నాలజీ ద్వారా అధిగమించేందుకు అవసరమైన సొల్యూషన్స్ అందించే స్టార్టప్స్‌లను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఫేస్‌బుక్ ఇండియా, సౌత్ ఆసియా పార్ట్‌నర్‌షిప్ ప్లాట్‌ఫామ్ హెడ్ సత్యజీత్ సింగ్ చెప్పారు. భారత్ తమకు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ అన్నారు. ఫేస్‌బుక్‌ను మరింత వినూత్నంగా తీర్చిదిద్దేందుకు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని జోడిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నుంచి కూడా తమకు 2,000 మంది యాప్ డెవలపర్స్ ఉన్నట్టు చెప్పారు.

మార్కెట్లోకి డాట్సన్
రెడీ-గో ఎఎంటి వెర్షన్

» ధర రూ.3.80 లక్షలు



న్యూఢిల్లీ: నిస్సాన్ మోటార్ ఇండియా.. 'డాట్సన్ రెడీ- గో' కారులో ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఎఎంటి) వెర్షన్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధరను రూ.3.8 లక్షలుగా నిర్ణయించింది. 'రెడీ-గో స్మార్ట్ డ్రైవ్ ఆటో' వెర్షన్ కార్ల డెలివరీ మంగళవారం ప్రారంభమైందని సంస్థ వెల్లడించింది. ఈ వాహనం డ్యూయల్ డ్రైవింగ్, రష్ హవర్ మోడ్‌లుంటాయి. డ్యూయల్ డ్రైవింగ్ మోడ్‌లో గుట్ట ఎక్కుతున్నప్పుడు, దిగుతున్నప్పుడు లేదా ట్రాఫిక్ అధికంగా ఉన్న సమయంలో ఆటో, మాన్యువల్ మోడ్‌లలో ఒకదాని నుంచి మరొకదానికి మారే వీలుంటుంది. ఒక వాహనం బంపర్ మరొక వాహనానికి తగిలేంతగా రద్దీ ఉన్నప్పుడు రష్ హవర్ మోడ్‌లో గంటకు 5-6 కిలోమీటర్ల వేగంతో కారును నడిపించవచ్చని సంస్థ పేర్కొంది.

వృత్తి నిపుణుల కోసం
అప్‌గ్రేడ్ ఆన్‌లైన్ కోర్సులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భిన్న పారిశ్రామిక విభాగాల్లో పని చేసే ఉద్యోగుల్లో ఐటి, డిజిటల్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను అలవరిచేందుకు అప్‌గ్రేడ్ సంస్థ ఆన్‌లైన్ కోర్సులు నిర్వహిస్తోంది. అప్‌గ్రేడ్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ కుమార్ మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగాలు చేసుకుంటూ నైపుణ్యాలు పెంచుకోవాలనుకునే వారికే ఈ కోర్సులు పరిమితమని చెప్పారు. ఈ కోర్సుల కోసం హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ సహా దేశంలోని నాలుగు ప్రముఖ విద్యా సంస్థలు, బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంతో తాము ఒప్పందాలు కుదుర్చుకున్నామని, తమ వద్ద శిక్షణ పొందిన వారికి ఆ సంస్థలు సర్టిఫికెట్లు జారీ చేస్తాయని ఆయన తెలిపారు. 6 నుంచి 11 నెలల కాలవ్యవధి ఉండే ఈ కోర్సుల్లో ఫీజు లక్ష నుంచి రెండున్నర లక్షల రూపాయలుంటుందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు రోనీ స్క్రూవాలా తెలిపారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రెండున్నర లక్షల మందికి తాము ఉచితంగా శిక్షణ ఇచ్చినట్టు ఆయన చెప్పారు. ఈ శిక్షణ పొందుతున్న వారిలో 25 శాతం మంది హైదరాబాద్ నుంచి ఉండగా 5 నుంచి 10 శాతం మంది ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వారని ఆయన అన్నారు.

ఒఎన్‌జిసికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్!

» ఐఒసి, గెయిల్‌లో వాటా విక్రయానికి అనుమతి

న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి), గెయిల్‌లో తన వాటాలను విక్రయించేందుకు ఒఎన్‌జిసికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్)లో కేంద్రానికి చెందిన 51.11 శాతం వాటాను రూ.36,915 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు ఒఎన్‌జిసి ప్రకటించింది. ఇందుకు అవసరమైన నిధులు సేకరించేందుకు ఐఒసి, గెయిల్‌లోని తన వాటాలను విక్రయించాలని ఒఎన్‌జిసి నిర్ణయించుకుంది. ఒఎన్‌జిసికి ఐఒసిలో 13.77 శాతం, గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో 4.86 శాతం వాటా ఉంది. ఐఒసిలోని వాటా రూ.26,200 కోట్లు, గెయిల్‌లోని వాటా రూ.3,847 కోట్లు విలువ చేస్తుంది.

3 బ్యాంకుల నుంచి రూ.18 వేల కోట్ల రుణం

హెచ్‌పిసిఎల్ కొనుగోలు కోసం ఒఎన్‌జిసిరూ.18వేల కోట్ల మేర రుణం సేకరించనుంది. ఇందుకోసం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి), బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇందులో పిఎన్‌బి రూ.10,600 కోట్లు, బిఒఐ మరో రూ.4,460 కోట్లు, యాక్సిస్ రూ.3 వేల కోట్ల రుణం సమకూర్చనున్నాయి.




ఆకాశమే హద్దుగా..

నిఫ్టీ @11000, సెన్సెక్స్ @ 36000

- 13 నెలలుగా అలుపు లేని బుల్ రన్
- ఐదు సెషన్లలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లు అప్
- 156 లక్షల కోట్లకు ఇన్వెస్టర్ల సంపద

మంగళవారం నాటి బుల్‌రన్‌లో మిడ్‌సెషన్ సమయానికి 14 బ్లూచిప్ స్టాక్‌లు 52 వారాల గరిష్ఠ స్థాయిలను తాకాయి..

కంపెనీ	వృద్ధి (శాతంలో)	52 వారాల గరిష్ఠ స్థాయి (రూ.)
జెఎస్‌డబ్ల్యు స్టీల్	7.41	299.30
వేదాంత	7.03	349.95
హావెల్స్	6.35	587.75
టెక్ మహీంద్రా	3.72	590.70
ఇన్ఫోసిస్	3.30	1188.00
ఇండియా బుల్స్ హెచ్ఎఫ్	3.08	1397.00
హెచ్‌సిఎల్ టెక్	2.66	992.05
యాక్సిస్ బ్యాంక్	2.62	627.60
ఐసిఐసిఐ బ్యాంక్	2.53	360.40
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.00	990.95
ఒఎఫ్ఎస్ఎస్	1.56	4273.70
ఎల్ అండ్ టి	0.95	1412.20
టిసిఎస్	0.83	3142.35
గోద్రెజ్ కన్స్యూమర్	0.67	1100.00



ముంబై : స్టాక్ మార్కెట్లో బుల్‌రన్ అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. మంగళవారంనాడు కీలక సూచీలు రెండూ కీలక మానసిక అవధులు 36000 (సెన్సెక్స్), 11000 (నిఫ్టీ) దాటి చివరి వరకు అదే జోరును కొనసాగించి ఆ స్థాయిల కన్నా పైనే ముగిశాయి. కొత్త సంవత్సరం ప్రారంభమైన తర్వాత 23 రోజుల వ్యవధిలోనే ఇండెక్స్‌లు గణనీయంగా లాభపడ్డాయి. అప్పుడప్పుడు ఏర్పడుతున్న పుల్‌బ్యాక్‌లు మినహాయిస్తే వాటి పరుగుకు ఆకాశమే హద్దుగా ఉంది. వరుసగా 13 నెలలుగా మార్కెట్లో ప్రస్తుత బుల్ రన్ కొనసాగుతోంది. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటుగా భారత ఆర్థిక రంగం వృద్ధి రేటుపై ఐఎంఎఫ్ ప్రకటించిన ఆశావహమైన అంచనా తాజాగా ఇండెక్స్‌లను పరుగులు తీయించింది. మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఇన్‌ఫ్రా రంగాలు మార్కెట్ జోరుకు మద్దతు ఇచ్చాయి.

మొదలయిందిలా...

కార్పొరేట్ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి ల నుంచి ర్యాలీ సాధించడంతో మార్కెట్ మంగళవారం ఎంతో ఉత్సాహంగా ఎగువ స్థాయిల్లో ప్రారంభమయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే రెండు ఇండెక్స్‌లు కీలక మైలురాళ్లను దాటాయి. మార్కెట్ ప్రారంభమైన క్షణాల్లోనే నిఫ్టీ మానసిక అవధి 11000 స్థాయిని దాటి దూసుకుపోయింది. ఆ తర్వాత కొద్ది సమయానికే సెన్సెక్స్ కూడా 36000 స్థాయిని దాటి పోయింది. ఆ తర్వాత కూడా ఇండెక్స్‌లు అదే జోరును కొనసాగించాయి. ఏ క్షణంలోనూ ఆ కీలక స్థాయిల కన్నా దిగజారే ప్రయత్నం జరగలేదు. మొత్తం మీద సర్వత్రా సానుకూల సంకేతాల నడుమ ముగింపు సెషన్‌లో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠ స్థాయి 36170.83 పాయింట్లు, నిఫ్టీ 11092.90 పాయింట్లను తాకాయి. చివరికి సెన్సెక్స్ 341.97 పాయింట్ల లాభంతో 36139.98 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ నెల 17 నుంచి 23 తేదీల మధ్యన కేవలం ఐదే ఐదు సెషన్లలో సెన్సెక్స్ వెయ్యి పాయింట్లు పెరిగి 35000 నుంచి 36000కి చేరింది. నిఫ్టీ 117.50 పాయింట్ల లాభంతో 11083.70 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 10000 పాయింట్ల (2017 జూలై 26) నుంచి 11000 పాయింట్ల మైలురాయిని చేరడానికి ఆరు నెలలు పట్టింది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు కూడా మార్కెట్ ర్యాలీలో తమ వంతు వాటా అందించాయి.

సెన్సెక్స్‌లో 3.84 శాతం వృద్ధితో ఎస్‌బిఐ అగ్రస్థానంలో నిలవగా టాటా స్టీల్ (3.72 శాతం), ఒఎన్‌జిసి (3.60 శాతం), ఐసిఐసిఐ బ్యాంక్ (3.06 శాతం), కోల్ ఇండియా (3.04 శాతం) లాభపడ్డాయి.

బడ్జెట్ తర్వాత 32000

ముంబై : రానున్న బడ్జెట్‌లో దీర్ఘకాలిక పెట్టుబడి లాభాలపై పన్ను విధించిన పక్షంలో డిసెంబరు చివరి నాటికి సెన్సెక్స్ 32000 పాయింట్లకు పడిపోయే ప్రమాదం ఉన్నదని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ (బోఫా ఎంఎల్) హెచ్చరించింది. సుమారు ఏడాది పైగా కనీవినీ ఎరుగని బుల్ రన్‌లో పరుగులు తీస్తున్న మార్కెట్లో ఇలాంటి చర్య ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బ తీస్తుందని పేర్కొంది. 2004లో రద్దు చేసిన ఈ పన్ను ఈ సారి బడ్జెట్‌లో ఏదో ఒక రూపంలో తిరిగి విధించే ఆస్కారం ఉన్నట్టు ఆ సంస్థ జోస్యం చెప్పింది. దీని ప్రకారం ఏ ఆస్తి అయినా ఒక వ్యక్తి చేతిలో మూడు సంవత్సరాలకు పైబడి ఉన్నప్పుడే దాని ద్వారా వచ్చిన లాభాలపై పన్నుపడుతుంది.

బడ్జెట్ వరకు జోరు



స్టాక్ మార్కెట్లోని ఈ అనూహ్యమైన ఉత్సాహం బడ్జెట్ వరకు కొనసాగుతుంది. ప్రజల వినియోగ ధోరణులు బలంగా ఉండడం, ఐటీ, బ్యాంకింగ్ కంపెనీలు మెరుగైన ఫలితాలు ప్రకటించడం మార్కెట్‌కు అండగా నిలిచింది.
– నిలాషా శంకర్, యస్ సెక్యూరిటీస్



మార్కెట్ జోరుకి మెటల్ స్టాక్‌లు అండగా నిలిచాయి. బ్యాంకింగ్ షేర్లు కూడా ర్యాలీలో భాగం పంచుకున్నాయి.
– ఆనంద్ జేమ్స్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్



ఈ ర్యాలీకి ఎఫ్‌పిఐలు అండగా నిలిచాయి. కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు నిరాశాజనకంగా లేకపోవడం కూడా మార్కెట్ పరుగుకు దోహదకారి అయింది.
– వి.గోప్ కుమార్, రిలయన్స్ సెక్యూరిటీస్



ఆదాయాల్లో వృద్ధికి మార్కెట్లు చక్కని పట్టాలు ఎదురు చూస్తున్నాయి. ఇప్పటివరకు వచ్చిన ఫలితాలేవీ నిరాశ కలిగించలేదు. బ్యాంకింగ్, ఎఫ్ఎంసిజి, ఐటీ, ఇన్‌ఫ్రా రంగాలకు చెందిన కంపెనీలన్నీ కూడా అంచనాల కన్నా మెరుగైన ఫలితాలే ప్రకటించాయి.
– అరుణ్ తుక్రాల్, యాక్సిస్ సెక్యూరిటీస్



మార్కెట్ ఆశావహధోరణి, రికార్డు లాభాలు అందించిన ప్రోత్సాహంతోనే నిఫ్టీ 11000 పాయింట్ల మైలురాయిని దాటింది. ఏదేమైనా ఈ బుల్ రన్ కొనసాగుతోంది. క్రూడాయిల్ ధరలు, భౌగోళిక రాజకీయ అంశాల కన్నా మార్కెట్ దేశీయ సానుకూలతలకే ప్రాధాన్యం ఇచ్చింది. 2000 సంవత్సరంలో ఇంత ఉత్సాహం కనిపించింది.
– జయంత్ మాంగ్లిక్, రెలిగేర్ బ్రోకింగ్

కొనసాగిన అప్‌ట్రెండ్

టెక్ వ్యూ

నిఫ్టీ అప్‌ట్రెండ్‌లోనే ప్రారంభమై మానసిక అవధి 11000 దాటిపోయి ఇంట్రాడేలో 11100 వరకు కూడా దూసుకుపోయింది. చివరికి ఎలాంటి బలహీనత లేకుండా డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. కొద్ది రోజులుగా సాగిన ఈ జోరులో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడింది. ఓవర్‌బాట్ స్థితి కారణంగా బలమైన కరెక్షన్ ఆస్కారం ఉంది.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 11100 **మద్దతు :** 11000

- ప్రధాన నిరోధం 11100. ఆ పైన బలంగా క్లోజైతేనే మరింత ముందుకు దూసుకుపోతుంది. పైన ఉన్నవన్నీ మానసిక అవధులే.
- రియాక్షన్‌లో పడితే మైనర్ మద్దతు స్థాయి 11000. దాని కన్నా దిగజారితే మైనర్ బలహీనత సంకేతం ఇస్తుంది.
- బ్యాంక్ నిఫ్టీ కూడా పరుగును కొనసాగించి మానసిక అవధి 27000 కన్నా పైన ముగిసింది. తదుపరి నిరోధం 27500.

సూచన : గరిష్ఠ స్థాయిల్లో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

మిడ్‌సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ శుద్ధ సప్తమి **నక్షత్రం :** అశ్విని

రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, వృషభ, కన్య రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 11083.70 (+117.50)

టెండ్ మార్పు వేళలు : 2.32

ధోరణి : (గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై 10.25 నుంచి 12 గంటల వరకు మెరుగ్గా ట్రేడవుతూ ఆ తర్వాత చివరి వరకు నిలకడ/నిస్తేజంగా మారి చివరలో తిరిగి మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/గనుక (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే ఈ స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 10.20 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 10.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత తిరిగి ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 11125, 11160 **మద్దతు స్థాయిలు :** 11045, 11010

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

ఒక్క రోజులోనే లక్ష కోట్లు వృద్ధి

మంగళవారం నాటి ర్యాలీతో ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద లక్ష కోట్ల రూపాయలు పెరిగింది. బిఎస్ఇలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ 1,08,019.59 కోట్ల రూపాయలు పెరిగి 1,56,56,591 కోట్ల రూపాయలకు చేరింది. బిఎస్ఇలో 1348 షేర్లు లాభపడగా 1578 షేర్లు నష్టపోయాయి. 138 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయి.

ఐపిఓకి బిడిఎల్ దరఖాస్తు

రక్షణ రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి అనుమతి కోరుతూ సెబికి దరఖాస్తు చేసింది. నాలుగు మాసాల కాలంలో సెబికి పబ్లిక్ ఇష్యూ కోసం దరఖాస్తు చేసిన నాలుగో పిఎస్‌యు ఇది.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.50	నెక్ (100 గుడ్లు)		
హైదరాబాద్	390.00	చిత్తూరు	398.00
వరంగల్	404.00	చెన్నై	405.00
విజయవాడ	412.00	నమక్కల్	380.00
గోదావరి	412.00	బెంగళూరు	400.00
విశాఖపట్నం	412.00	ముంబై	435.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.06	67.33
పౌండ్	81.19	94.15
యూరో	71.16	82.54
ఆస్ట్రేలియా డాలర్	46.41	53.72
బ్రహ్రెయిన్ దినార్	157.24	180.19
కువైట్ దినార్	175.52	218.65
ఒమని రియాల్	153.98	176.17
సౌదీ రియాల్	15.46	18.30
సింగపూర్ డాలర్	44.03	52.17
యుఎఇ దిరమ్	15.80	18.47

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,170	30,850	31,150	30,750	30,260
క్రితం ముగింపు	31,130	30,750	31,130	30,670	30,220
22 క్యారెట్లు	28,860	28,650	28,650	28,480	28,820
క్రితం ముగింపు	28,830	28,500	28,630	28,410	28,780
వెండి (కేజీ)	40,000	40,300	39,800	39,900	42,000
క్రితం ముగింపు	40,000	40,300	39,800	39,900	42,010

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77.00	విజయవాడ	82.00
కరీంనగర్	78.00	గుంటూరు	82.00
వరంగల్	77.00	ఒంగోలు	84.00
మహబూబ్‌నగర్	77.00	చిత్తూరు	73.00
కర్నూలు	77.00	నెల్లూరు	81.00
విశాఖపట్నం	76.00	అనంతపురం	77.00
గోదావరి	80.00		


బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 6.91(7.13)75
ADITYA SPIN. 9.61(9.52)410
AGRO TECH FO 689.2(686.2)3052
AISHWARYA TE 9.22(9.98)30465
ALPHAGEO (I) 930.4(954.9)3046
ALU FLUORIDE 129.95(131.25)9978
AMAR RAJA BA 820.75(825.15)16341
ANDHRA BANK 58(56.05)272136
ANDHRA CEMEN 13.18(13.37)43976
ANDHRA PETRO 71.25(67.9)192218
ANJANI PORTL 240.75(243.15)2053
ASTRA MICRO 115.3(117.5)86595
AUROB.PHARMA 654.7(641)97423
AVANTEL LTD 481.3(488.1)3902
AVANTI FEEDS 2543.3(2512.15)17049
B.N.RATHI SE 45.25(46.1)3758
BALAJI AMINE 712.6(701.15)12568
BAMBINO AGRO 300(305.9)1129
BARTRONICSIN 14.8(14.68)31150
BHAGIRA.CHEM 338.9(335)1681
BHAGYA INL 44.35(45.2)10087
BHARATFIN 1033(1005.7)23283
BNR UDYOG 33(32.5)102
CAMBRIDGE 93.15(95.05)10966
CAT TECHN. 1.32(1.34)2015
CCHHL 16.65(17)29998
CCL PRODUCTS 296.5(295.05)8407
CELESTIAL 18.35(18.45)32613
CIL SECURITS 35.65(35.3)104
COROM INTER 572.6(572.1)19287
CUBEX TUBING 26.55(27.05)2964
CYBERMATE 3.97(3.8)210917
CYIENT 663.55(630.5)72825
DANLAW TECH. 90.9(86.6)6661
DECAN CEMENT 612(607.6)346
DHAN ROTO SP 42(40)6148
DIAMONPOWER 19.8(19.55)45892
DIVI'S LAB. 1102.2(1078.75)39484
DIVYA.GRANIT 111.95(111.7)3517
DQ ENT 17.85(18)8743
DR.REDDY'S 2522.45(2491.5)52955
EMPEE SUGARS 4.4(4.6)28611
EVEREST ORG. 153(152.25)1829
FACOR ALLOYS 3.83(3.78)133171
FIRSTOBJ 14.9(15.1)26765
GATI LTD. 138.15(139.5)194645
GAYATRI BIO 10.21(10.74)2251
GAYATRI PROJ 215.15(218.45)28435
GENNEX LAB 5(5.03)195037
GMR INFRASTR 23.85(22.9)6827834
GODAVARI DRU 39.25(40.55)2929
GOLDST INFRA 219.95(227.35)42240
GOLDSTONE EN 16.75(16.25)55553
GRANULES (I) 139.1(138.9)151576
GVK POWERINF 22.75(23.15)972520
HBL P SYS 67.4(66.45)176907
HERITGFOOD 800.35(790.35)2709
HIND.FLUROCA 15.25(14.85)3626
HINDUSTN BIO .6(.58)500
I.C.S.A. IND 4.99(5.25)18071
INCAP LTD. 111.15(112)2127
IPAPPM 373.9(383.35)13386
IVRCL LTD 5.52(5.69)216838
KAKATIYA CEM 384(385.7)5320
KAKATIYA TEX 2.76(2.9)100
KALLAM SPG. 22.95(23.85)38708
KARAN WOO-SN 1.58(1.51)100
KAVERI SEED 519.3(522.5)43102
KCP LTD 147.9(147.7)55668
KERNEX MICRO 56.15(55.95)29825
KNR CONST 317(309.65)22616
KREBS BIOCHM 149.15(150)1961
LANCO INFRA 1.86(1.95)187838
LOKESH MACH 71.95(70.3)16747
LOTUS CHOC 48.75(46.45)33170
MADHUCON PRJ 34.2(34.4)18064
MOLD-TEK TEC 70(71)6400
MOSCHIP SEMI 42.4(40.45)239089
MSR INDIA 39(39.4)7572
N C L IND. 293.45(289.8)13192
NACLIND 57.65(55.9)75149
NATCO PHARM 1016.65(1008.05)18071
NCC 126.7(126.75)365023
NEHA INTER. 8.19(8.43)32595
NETTLINX LTD 86.4(87.05)17686
NEULAND LAB. 879.05(896.4)1044
NIHAR INFO 14.3(14.99)1689
NILE LTD. 945.85(950.65)3609
NTL 4.61(4.85)3975
OIL COUNTRY 53.35(54.05)14761
PADMALAYA TE 6.09(6)16325
PALRED 99.95(107)6019
PANYAM CEMEN 59.9(60.2)10436
PENNAR STEEL 64.75(63.9)72725
PFL INFOTECH 11.11(10.59)10836
PHYTOCHEM I. 73.3(72.15)15171
PITTI LAMIN. 95.6(97.35)7734
POKARNA LTD 227.65(229.25)6853
PRAJAY ENGS. 18(17.7)50546
PREMIER EXPL 468.25(442.05)1831
PRISM CEMENT 140.7(143.15)146246
RAIN 424.85(430.8)470266
RAJ PACKAGIN 41.45(42.25)1410
REG.CERAMIC 7.05(7.27)11381
RESTILE CER. 8.21(8.37)4893
SAGAR CEM. 1071.35(1047.55)3494
SAMKRG PIST. 339.1(338.2)25252
SAMPRE NUTRI 80.85(83.95)10393
SANGHI IND. 131.5(133.65)29565
SATVAH.ISPAT 30.65(31.1)7662
SAVEN TECHNO 23(23.35)6335
SIBAR AUTO 16.12(15.36)11772
SMPL 1.51(1.57)63641
SMS PHARMACE 103.5(105.15)67067
SREE RAYALA 197.9(203.4)4887
STEEL EXCH 34.45(34.4)59824
SUJANA INDUS 1.02(1.06)216529
SURANATP 5.96(6.09)5309
SURYACHAKRA 1.69(1.66)232645
SURYAMBA SP 75.5(75)8756
SURYLAK.COTT 97.15(96.2)5999
SUVEN LIFE S 204.3(199.8)113808
TAJ GVK HOTL 190(188.5)90291
TANLA 38.6(39.6)296697
TRANSCORP IN 46.3(44.1)4090
TRANSGENE BI 2.25(2.35)48127
TRANSPORT CO 280(278.2)1186
USHER AGRO 7.97(8.18)5909
VICEROY HOTE 19.5(19.4)131158
VIJAY TEXTIL 58.2(55.6)78825
VIMTA LABS 217(180.85)317372
VIRAT CRANE 47(48.3)8673
VIRINCHI 128.45(130.6)75589
VISAKA IND. 771.85(779.1)6008
VISTA PHARMA 45.2(46)82480
VIVIMED LABS 95.65(93.3)205224
VST INDUS. 3202.5(3102.05)223
WATERBASE 332.55(326.3)282678
XLENERGY 3.97(4.03)25584
YBRANTDIGI 6.7(6.99)306909
ZEN TECH 129.25(129.8)58814
ZENOTECH 48.8(49.1)12513

ఎన్ఎస్ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 699.25(715.6)25815
AARTIIND 1121.35(1135.4)25503
ABAN 227.5(231.25)1720032
ABB 1639.7(1602.3)227856
ABFRL 167.35(166.05)255987
ABGSHIP 12.5(12.6)8711
ACC 1790.15(1827.2)248086
ADANIENT 204.4(198.9)7561852
ADANIPORTS 438.4(438.05)4659591
ADANIPOWER 38.25(37.6)27045728
ADANITRANS 222.85(227.3)886270
AEGISCHEM 285.6(285.15)140057
AHLUCONT 350.85(362.75)41854
AIAENG 1577.85(1593.3)4796
AJANTPHARM 1566.8(1588.65)117102
AKZOINDIA 1870.8(1871.55)3430
ALBK 72.7(70.5)3228047
ALLCARGO 201.4(202.2)370695
ALOKTEXT 3.75(3.7)2532871
AMARAJABAT 819.65(824.45)360521
AMBUJACEM 262.7(268.45)3127752
AMTEKAUTO 26.25(26.7)285849
ANANTRAJ 70.3(71.7)1541404
ANDHRABANK 58.1(56.15)2432419
APARINDS 835.05(834.55)22556
APLLTD 547.9(550.25)466217
APOLLOHOSP 1146.5(1168.8)229030
APOLLOTYRE 264.85(259.6)1899243
ARVIND 456.6(446.15)1463218
ASHIANA 180.55(178)91507
ASHOKA 231.6(231.5)47454
ASHOKLEY 124(121.05)10962021
ASIANPAINT 1169.9(1176)1841634
ASTRAL 830.45(844.6)14026
ASTRAZEN 1158.6(1156.65)14050
ATUL 2865.8(2869.3)11812
AUROPHARMA 653.75(640.8)1872601
AVANTIFEED 2535.55(2505.3)62868
AXISBANK 620.1(611.55)14286343
BAJAJ-AUTO 3295.95(3274.5)324780
BAJAJCORP 498.1(491.8)102171
BAJAJELEC 527.15(521.7)306922
BAJAJFINSV 5014.6(5051.45)178301
BAJAJHIND 14.3(14.5)3090106
BAJAJHLDNG 2827.65(2800.85)11594
BALKRISIND 1149.7(1138.8)340046
BALLARPUR 15.75(16.15)1728631
BALMLAWRIE 248.9(249.65)83010
BALRAMCHIN 126.4(124.15)2873232
BANKBARODA 173.15(164.8)18168528
BANKINDIA 169.3(164.3)4612077
BASF 2199.55(2200.6)50625
BATAINDIA 733.1(730.35)539573
BBTC 1580.7(1590.7)104013
BEML 1518.75(1515.9)351678
BERGEPAINT 251.4(249.6)1631613
BFUTILITIE 512.35(525.2)452317
BGRENERGY 140.75(139.75)255267
BHARATFIN 1033.8(1005.05)992718
BHARATFORG 748.5(739.7)1206318
BHARTIARTL 492.1(490.7)5543486
BHEL 104.45(104.55)20713446
BHUSANSTL 64(65.45)2646400
BIOCON 643.7(603.85)11193528
BIRLACORPN 1157(1169.55)23486
BLISSGVS 203.05(199.9)734460
BLUEDART 4721.25(4731.45)6055
BLUESTARCO 759.85(779.45)35697
BOMDYEING 254.35(257.85)2692098
BOSCHLTD 19776(19981.5)14150
BPCL 481.15(469.15)3779440
BRFL 81.7(85.05)292527
BRIGADE 302.75(292.4)57298
BRITANNIA 4736.45(4707.35)100355
CADILAHC 430.95(438.75)1006539
CANBK 374.5(362.95)4198832
CAPF 778(777.95)905006
CARERATING 1387.35(1382.75)50108
CASTEXTECH 6.1(6.05)504202
CASTROLIND 188.85(187.9)2626243
CCL 297.45(295.7)112525
CEATLTD 1856.85(1837.85)285413
CENTRALBK 74.5(73.2)475886
CENTURYPLY 332.6(339.2)182117
CENTURYTEX 1424.9(1415.8)522845
CERA 3633.75(3625.75)2917
CESC 1100.6(1111.25)616073
CHAMBLFERT 158.7(155.65)1368877
CHENNPETRO 430.7(427.7)725025
CHOLAFIN 1310.9(1309.1)112831
CIPLA 622.35(601.15)2105060
CLNINDIA 637.55(622.45)49326
COALINDIA 293.1(285.05)3974425
COLPAL 1157.15(1172.55)256965
CONCOR 1466.2(1483.25)256745
COROMANDEL 573.9(575.15)147723
CORPBANK 39.5(39)511384
COX&KINGS 258.6(260.7)113743
CRISIL 1977.55(1995.1)12549
CUB 174.1(174.55)746094
CUMMINSIND 910.2(913.7)308058
CYIENT 662.6(627.4)959297
DABUR 364(363.1)1287281
DALMIABHA 3026.1(2987.2)104527
DBCORP 340.85(347.4)306892
DBREALTY 68(70.2)712798
DCBBANK 185.5(187.85)1089001
DCMSHRIRAM 598.45(595.25)288412
DEEPAKFERT 414.6(407.2)289953
DELTACORP 387.7(350.15)13281255
DEN 129.35(121.1)2433030
DENABANK 26.55(25.95)3719900
DHANUKA 791.5(793.45)13571
DHFL 613.85(631.05)4227361
DISHTV 73.15(71)5410715
DIVISLAB 1101.35(1077.85)1019038
DLF 259.65(250.95)9049840
DREDGECORP 755.9(753.75)319426
DRREDDY 2520.4(2496.55)730091
DYNAMATECH 1936.6(1948.05)5258
ECLERX 1559.55(1552.65)26957
EDELWEISS 295.05(289.55)6976785
EICHERMOT 27071.25(27649.8)117399
EIDPARRY 350.95(349.5)310483
EIHOTEL 200.8(203.55)294857
ELECTCAST 35.2(35.2)904762
ELGIEQUIP 302.45(308.3)26309
EMAMILTD 1243.7(1245.85)125374
ENGINERSIN 177.2(177.1)2411464
EROSMEDIA 224.8(229.5)814258
ESCORTS 810.6(786.5)1807433
ESSDEE 73.75(77.6)41614
ESSELPACK 297.95(295.25)69018
EVEREADY 442.75(451.75)48152
EXIDEIND 222.5(223.6)1654013
FCONSUMER 68(68.6)2633604
FDC 239.1(239.5)28303
FEDERALBNK 103.25(101.6)21438591
FINCABLES 729.05(743.7)32734
FINPIPE 664.15(655.75)155906
FLFL 386.85(385.05)117189
FORTIS 150.5(147.2)7706210
FSL 43.05(43.85)3022615
GAIL 470.8(457.4)6286207
GATI 137.8(139.3)990717
GDL 237.55(238.2)288900
GEPIL 987.65(976.55)64808
GESHIP 436.35(457.35)81741
GET&D 429.7(420.6)907563
GILLETTE 6588.9(6621.85)3402
GLAXO 2458.9(2463.05)15567
GLENMARK 632.5(620.2)792356
GLOBOFFS 37.6(37.65)24039
GMDCLTD 150.85(150.35)432538
GMRINFRA 23.85(22.95)100158161
GODFRYPHLP 984.35(985.25)43519
GODREJCP 1085.4(1092.7)950942
GODREJIND 628.5(640)262472
GODREJPROP 843.85(882.05)461324
GPPL 149.05(151.2)202625
GRANULES 138.95(138.8)2413406
GREAVESCOT 140(138.15)1469391
GREENPLY 379.25(372.85)57588
GRINDWELL 554.15(556.65)42625
GRUH 593(588.95)1469615
GSFC 154.85(155.05)1986856
GSKCONS 6672.3(6648.4)20574
GSPL 208.9(209.7)663758
GUJFLUORO 873.3(882.35)23548
GUJGASLTD 885.3(877.25)44118
GULFOILLUB 893.25(899.15)9719
GVKPIL 22.7(23.15)3335765
HATHWAY 45.2(41.65)12289816
HAVELLS 584.15(552.65)4397044
HCC 39.2(38.05)13808391
HCL-INSYS 57.75(59.2)2143131
HCLTECH 995.35(966.35)2507601
HDFC 1884.65(1872)2158639
HDFCBANK 1951.3(1963.35)1261949
HDIL 61(61.6)12326531
HEIDELBERG 164.7(161.2)287281
HEROMOTOCO 3630(3602.95)285236
HEXAWARE 363.45(352.2)1251613
HFCL 32.1(32.1)6785687
HIMATSEIDE 389.9(390.85)70593
HINDALCO 264.95(255.1)17400430
HINDCOPPER 90.35(90.35)3762804
HINDPETRO 395.9(401.8)5209316
HINDUNILVR 1368.35(1355.1)1284895
HINDZINC 296.65(292.45)2894490
HMT 37.9(38.55)4747
HMVL 261.4(261.3)11917
HONAUT 17790.65(17690.7)2286
HOTELEELA 22.25(22)1149869
HSIL 488.9(488.75)130082
HTMEDIA 107.35(108.5)378422
IBREALEST 239.75(243.3)3418683
IBULHSGFIN 1379.1(1355.15)2611848
ICICIBANK 362.3(351.5)22485663
ICRA 3987.25(3971.2)1656
IDBI 61.9(61.1)3406984
IDEA 99.35(99.5)9798561
IDFC 58.2(58.55)6966923
IFBIND 1415.65(1416.2)7854
IFCI 30.8(31)17648127
IGARASHI 853.9(837.95)10193
IIFL 686.8(697.15)188085
IL&FSTRANS 80.8(83.1)323127
INDHOTEL 156.75(150.65)5126004
INDIACEM 184(184.75)3202579
INDIANB 397.6(382.05)1576073
INDOCO 292.85(287.45)596336
INDUSINDBK 1723.35(1683.2)1763797
INEOSSTYRO 1066.05(1043.35)4625
INFRATEL 339.4(343.5)5668180
INFY 1177.1(1150)7701898
INGERRAND 815.25(820.45)7594
INOXLEISUR 278.1(280.4)66959
INOXWIND 136.35(136.5)140975
INTELLECT 180.95(173.55)930975
IOB 23.2(23)1195051
IOC 389.4(382.5)6610514
IPAPPM 373.95(384.05)93468
IPCALAB 581.5(588.35)414057
IRB 242.35(239.45)1036474
ITC 276.6(273.65)18244388
J&KBANK 75.85(76.85)507148
JAGRAN 179.25(178.9)46202
JAICORPLTD 188.4(191.25)1710998
JBCHEPHARM 326.1(324)40613
JBFIND 204.3(202.25)66868
JCHAC 2657.45(2685)12377
JETAIRWAYS 795.7(783.4)3633682
JINDALPOLY 384.5(386.25)95089
JINDALSTEL 290.75(263.75)36250757
JISLJALEQS 143.55(139.8)18023973
JKCEMENT 1153.15(1153.05)14953
JKIL 334.35(336.05)72540
JKLAKSHMI 428.2(430.7)67623
JKTYRE 178.1(177.85)1576235
JMFINANCIL 161.7(163.85)798038
JPASSOCIAT 22.1(21.95)52899443
JPINFRATEC 15.5(15)15284330
JPPOWER 7.45(7.45)2659374
JSWENERGY 90.6(88.7)7822465
JSWHL 1745.2(1747.1)45519
JUBILANT 891.65(887.45)568753
JUBLFOOD 2283(2273.3)2337022
JUSTDIAL 600.75(603.9)8995205
JYOTHYLAB 371.25(371.15)285018
KALPATPOWR 506.35(480.3)1274688
KANSAINER 495.7(509.8)442507
KEC 367.85(357.5)370929
KESORAMIND 148.65(151.4)446747
KIRLOSENG 407.5(403.1)49546
KITEX 297.8(298.05)46760
KOLTEPATIL 372.5(378.25)282765
KOTAKBANK 1075.45(1074.1)2458463
KPIT 203.45(199.95)2432704
KRBL 633.75(630.65)169498
KSCL 522.55(522.95)388095
KSK 17.2(18.1)1036640
KTKBANK 159.65(158.35)3345935
KWALITY 101.9(102.5)463015
L&TFH 179.65(178.3)7156394
LAKSHVILAS 137.4(140.3)509186
LAOPALA 652(656.45)35247
LAXMIMACH 6210.45(6226.15)3298
LICHSGFIN 573.5(575.05)2237016
LITL 1.85(1.9)941471
LT 1410.7(1398.85)4804202
LUPIN 937.35(930.05)1507345
M&M 769.05(759.6)2775928
M&MFIN 508(488.6)2995179
MAGMA 169.45(171.6)71265
MAHINDCIE 239.3(238.45)99507
MAHLIFE 523.2(518.85)47211
MANAPPURAM 119.35(120.9)8022751
MANPASAND 414.3(406.65)253918
MARICO 313.85(316.35)599429
MARKSANS 44.35(44.05)3578295
MARUTI 9393.4(9310.1)561948
MAYURUNIQ 550.5(527.2)72460
MCDOWELL-N 3750.6(3787.15)714156
MCLEODRUSS 182.5(181.25)204777
MERCK 1445.8(1457.15)70082
MHRIL 372.9(362.65)65891
MINDACORP 212.35(208.5)404846
MINDTREE 762.55(757.35)2763558
MMTC 64.85(64.8)1981944
MOIL 248.5(245.15)440090
MONSANTO 2561.15(2620.75)4261
MOTHERSUMI 386.1(384.4)3052471
MOTILALOFS 1470(1469.65)107934
MPHASIS 796.2(802)104886
MRF 69930.7(69677.3)6857
MRPL 131.5(129.85)1637914
MTNL 26.3(26.05)1950634
MUTHOOTFIN 435.5(433.25)612008
NATCOPHARM 1019.5(1013.45)328395
NATIONALUM 78.5(77.15)11820108
NAUKRI 1389.8(1415.05)18152
NAVKARCORP 194.9(201.4)426109
NCC 126.7(126.9)3116095
NETWORK18 55.6(55.4)1257046
NHPC 30.45(30.05)6558630
NIITTECH 783.75(765.75)1132377
NITINFIRE 7(6.85)371693
NLCINDIA 106(106.9)618469
NMDC 149.45(144.15)7418323
NTPC 172.7(172.4)5398827
OBEROIRLTY 510.85(507.5)94611
OFSS 4245.95(4208)53780
OIL 375.15(371.8)503670
OMAXE 227.05(225.45)709906
ONGC 207.35(200.7)15755015
ORIENTBANK 125.75(122.45)2959573
ORIENTCEM 167.2(169.4)69421
ORISSAMINE 1919.6(1914.5)2737
PAGEIND 22017.85(22019.35)10081
PARSVNATH 25.55(25.25)103258
PCJEWELLER 576.9(583)3505998
PEL 2844.65(2830.2)246357
PERSISTENT 793.75(788.9)238518
PETRONET 245.85(237.8)4564815
PFC 121(120)3762017
PFIZER 2113.05(2145.55)69232
PFS 36.55(36.65)928679
PGHH 9285.7(9276.4)19748
PHOENIXLTD 629.15(617.5)34414
PIDILITIND 886.35(895)509131
PIIND 964.5(986.85)46964
PNB 185.8(176)28176767
POLARIS 413.3(416.2)131935
POWERGRID 195.85(195.3)9075432
PRAJIND 113.65(114.2)1364634
PRESTIGE 319.9(313.5)383730
PRISMCEM 140.05(142.6)1463848
PTC 114.7(114.8)1599498
PUNJLLOYD 23.6(23.6)1684489
PURVA 149.6(148.75)405477
PVR 1529.3(1474.1)508483
RADICO 412.7(389.6)6701704
RAIN 425.8(431.9)1854531
RAJESHEXPO 821.3(821.25)615876
RALLIS 252.45(270.95)1757712
RAMCOCEM 789.95(781.2)150271
RAMCOSYS 499.4(510.35)31375
RATNAMANI 1066.95(1070.2)3410
RAYMOND 1123.8(1102.45)609714
RCF 97.2(98.7)5148537
RCOM 29.25(28.65)146096411
RECLTD 157.75(155.65)3640311
REDINGTON 186.6(188)84068
RELAXO 639.6(628.15)12465
RELCAPITAL 526.35(522.55)6158705
RELIANCE 983.25(971.5)10298500
RELINFRA 516.85(509.6)2592969
RENUKA 15.6(15.6)1218786
REPCOHOME 688.1(693.05)428848
RIIL 569.6(574.15)462414
RKFORGE 850.65(840.05)120173
RNAVAL 50.75(49.55)8944185
ROLTA 68.7(70.65)1207663
RPOWER 48.4(48)17506799
RTNPOWER 7.5(7.6)10159421
RUCHISOYA 18.65(18.75)1389384
SADBHAV 406.2(404.5)341685
SADBHIN 146.25(145.25)71687
SAIL 96.85(92.45)22670874
SANOFI 4714.35(4712.4)2348
SBIN 318.1(306.5)35252217
SCHAEFFLER 5844.9(5843.55)11854
SCHNEIDER 120.65(122)112965
SCI 88.05(90.1)1558036
SHARDACROP 456.85(452.15)8956
SHILPAMED 591.95(600.5)16009
SHK 303.95(310.25)111714
SHOPERSTOP 517.05(530.1)101667
SHREECEM 18391.95(18479.35)30808
SHRIRAMCIT 2041.35(2052.4)78654
SIEMENS 1319.8(1319.2)148682
SIMPLEXINF 611.3(599.05)147439
SINTEX 23.95(23.95)2344581
SITINET 24.95(24.85)123769
SJVN 34.85(34.95)676170
SKFINDIA 1837.95(1839.6)19681
SMLISUZU 891(879.6)25098
SNOWMAN 59.9(61.15)1168779
SOBHA 595.1(599.25)598047
SOMANYCERA 855.75(846.8)21041
SONATSOFTW 311.25(311.3)450992
SOUTHBANK 32.3(32.2)10163596
SPARC 496.35(501.7)171926
SREINFRA 101.95(100.75)2302833
SRF 1952.25(1950.2)142164
SRTRANSFIN 1468.8(1476.25)896951
STAR 798(800.2)369286
STCINDIA 168.65(164)41615
SUNDARMFIN 1944.7(1968.9)16365
SUNDRMFAST 551(551.8)143213
SUNPHARMA 579.35(576.15)4790590
SUNTV 1040.4(1033.65)547311
SUPREMEIND 1378.65(1424.6)45188
SUVEN 203.75(199.25)529550
SUZLON 15(15)23536033
SWANENERGY 224.35(225.75)579396
SYMPHONY 1966.85(1992.65)246657
SYNDIBANK 80.5(77.15)5437664
SYNGENE 640.1(628.9)336662
TAKE 167.65(167.9)187187
TATACHEM 732.6(735.8)380662
TATACOFFEE 158.55(160.75)525620
TATACOMM 639.4(644.5)426592
TATAELXSI 1077.25(1078.75)708020
TATAGLOBAL 307.2(308.85)4416130
TATAMOTORS 418(421.9)6185011
TATAMTRDVR 238.25(239.05)2323875
TATAPOWER 92.5(92.1)4928177
TATASPONGE 1197.05(1194.3)425125
TATASTEEL 779.75(752.2)8036841
TBZ 134.05(136)487144
TCS 3102(3116.4)1619805
TECHM 588.25(569.5)4103152
TECHNO 405.3(405.9)100512
TEXRAIL 109.5(111.55)579446
THERMAX 1286.15(1289.5)86315
THOMASCOOK 252.6(250.2)486478
TIDEWATER 7235.2(7174.15)1778
TIMKEN 916.25(918.25)9061
TITAN 905.7(909.75)1747166
TNPL 440.5(438.95)173146
TORNTPHARM 1443(1451.35)155033
TORNTPOWER 297.3(305.6)1114639
TREEHOUSE 14.4(14.2)50006
TRIDENT 87.75(87.5)455682
TRITURBINE 133.8(133.35)99436
TTKPRESTIG 8596.4(8668.85)3242
TTML 7(7)812861
TV18BRDCST 61.3(61.2)6726413
TVSMOTOR 706.15(715)799914
TVSSRICHAK 3608.8(3604.8)2224
TVTODAY 458.65(451.65)200385
UBL 1160.15(1155.55)490576
UCOBANK 31.1(30.9)1046125
UFLEX 463(468.3)91282
ULTRACEMCO 4374.7(4330)250337
UNICHEMLAB 367.85(366.35)255726
UNIONBANK 145.05(140.35)5273202
UNITECH 8.9(8.95)32456410
UPL 807.25(813.6)1371476
VAIBHAVGBL 725.55(709.35)28598
VAKRANGEE 497.75(473.65)6445035
VEDL 343.5(326.95)18222487
VIDEOIND 19.9(20.7)3248294
VIJAYABANK 69.1(67.1)3424772
VINATIORGA 963.85(942)25914
VIPIND 366.45(367)499102
VOLTAS 625.55(624.95)2197060
VRLLOG 399.1(399.7)504311
VSTIND 3204.05(3101.85)4133
VTL 1453(1455.65)15539
WABAG 630.3(638.1)114564
WABCOINDIA 8284.55(7911.35)21905
WELCORP 191.25(193.6)1012668
WELSPUNIND 71.65(72.8)1774196
WHIRLPOOL 1492.25(1499.15)8586
WIPRO 315.25(321.55)3230027
WOCKPHARMA 937.2(917.1)1799625
WONDERLA 407(415.35)74899
ZEEL 597.15(608.85)2448720
ZEELEARN 45.05(45.45)533430
ZENSARTECH 935.3(936.05)34418
ZYDUSWELL 1103.85(1092.85)4624



ఈ సాంకేతికతతో అవినీతి అంచనా!

అవినీతి నిర్మూలనకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. అయితే, అవినీతి సంభావ్యతను అంచనా వేసే కంప్యూటర్ ఆధారిత నాడీ నెట్‌వర్క్ వ్యవస్థను స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వాల్లాడోలిడ్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఏయే సందర్భాల్లో అవినీతి జరుగుతోంది? అవినీతి పెరగడానికి దోహదం చేసిన అంశాలేంటి? అన్న దానిపై ఈ సాంకేతికత అంచనా వేస్తుందని పరిశోధకులు తెలిపారు. ఈ కృత్రిమ మేధస్సును పరీక్షించగా ఒకే పార్టీ ఎక్కువ రోజులు అధికారంలో ఉండడం వల్ల అవినీతి పెరిగినట్లు తేలింది.

ఒక్క సిగరెట్‌తో ఖల్లాస్

- 69శాతం స్మోకర్స్ సరదాగా ట్రై చేసినవారే!
- టీనేజర్లపై కన్నేసి ఉంచాలంటున్న యూకే పరిశోధకులు



చెడు అలవాట్లు ఒకసారి అలవాటు అయితే వదలవు! సరదాగానో.. ఫ్రెండ్స్ బలవంతం మీదో.. స్టైల్ కోసమో ఒక్క సిగరెట్ వెలిగిస్తే చాలు..ఇక జిందగీ ఖల్లాస్! సిగరెట్ కాల్చడం మొదలుపెట్టిన ప్రతి ఐదుగురిలో కనీసం ముగ్గురు ఒకానొక దశలో డైలీ స్మోకర్స్‌గా మారుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు చెందిన 2లక్షలమందిపై జరిగిన పరిశోధనలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. సరదాగా సిగరెట్ ట్రై చేసినవారిలో 69% చైన్ స్మోకర్స్‌గా మారిపోయినట్లు యూకే పరిశోధకులు తెలిపారు. పొగతాగేవారిపై ప్రపంచవ్యాప్తంగా జరిగిన 8 సర్వేల వివరాలు క్రోడీకరించి జరిపిన అతిపెద్ద శాస్త్రీయ పరిశోధన ఇదేనని లండన్‌కు చెందిన క్వీన్ మేరీ వర్సిటీ పేర్కొంది. ఒక వ్యక్తి సిగరెట్‌కు బానిసగా మారిన క్రమంలో..ఆ అలవాటు ఎలా మొదలైందో తెలుసుకోవడం చాలా ముఖ్యమని యూకేకి చెందిన క్లినికల్ సైకాలజిస్ట్ ప్రొఫెసర్ పీటర్ హజెక్ అభిప్రాయపడ్డారు.

టీనేజ్‌లో మొదలయ్యే అలవాటు

అమెరికాలో ప్రతి పదిమందిలో తొమ్మిదిమంది పొగరాయుళ్లు 18 ఏళ్లలోపే సిగరెట్‌కు అలవాటు పడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సిగరెట్ ట్రై చేయాలన్న ఆలోచన రాకూడదనీ, ఒక్కసారి పొగతాగడం అలవాటయితే ..మానడం చాలా కష్టమని పరిశోధకులు చెబుతున్నారు. చైన్ స్మోకర్స్‌లో సగం మందికి చిన్నతనంలోనే సిగరెట్ అలవాటు అయిందన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. అందుకే టీనేజ్ పిల్లలు సిగరెట్ జోలికి వెళ్లకుండా కన్నేసి ఉంచాలనిపెద్దలకు సూచిస్తున్నారు.

–సెంట్రల్ డెస్క్

స్మార్ట్ బాడీగార్డ్

మహిళల రక్షణకు యాప్‌లు.. 'హ్యాక్ ఐ' తో మరింత భద్రత



గ్లింప్స్ యాప్

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వీడియోలు చూడటానికి..మ్యూజిక్ వినడానికే స్మార్ట్ ఫోన్లు పరిమితం కాదు. ఇప్పుడు మహిళలకు బాడీగార్డ్స్‌గా కూడా మారుతున్నాయి. సమాజంలో పెరుగుతున్న లైంగిక దాడులు, కిడ్నాప్‌ల నేపథ్యంలో వారికి భద్రత కల్పించేలా అనేక యాప్స్ రూపొందుతున్నాయి. ఒంటరిగా వెళ్లిన యువతుల క్షేమ సమాచారాన్ని ఈ యాప్స్ ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు, మిత్రులకు అందజేస్తున్నాయి.

మహిళల కోసం 'హ్యాక్ ఐ'


నేరం జరిగిన తర్వాత స్పందించడం కాదు. అసలు మహిళలపై లైంగిక దాడి చేయాలన్న ఆలోచన కూడా మృగాళ్లకు రాకుండా తెలంగాణ పోలీసులు 'హ్యాక్ ఐ' అనే యాప్‌ను అభివృద్ధి చేశారు. స్మార్ట్‌ఫోన్లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని..క్యాబ్‌లో కూర్చొన్న వెంటనే వాహనం నంబరు, డ్రైవర్ ఫోటో తీసి 'విమెన్ ట్రావెల్ మేడ్ ఈజీ' అన్న ఐకాన్ దగ్గర పోస్ట్ చేయాలి. బయలుదేరిన ప్రాంతం.. చేరుకోవాల్సిన గమ్యంవివరాలు తెలియచేయడం వల్ల పోలీసులు నిరంతరం ఆ క్యాబ్‌పై నిఘా ఉంచుతారు.

ఉనికిని పసిగట్టే గ్లింప్స్..

మహిళల రక్షణకు పేరెంట్ పెండింగ్ గ్లింప్స్ వాచ్ తోడ్పడుతుంది. ఆండ్రాయిడ్, బ్లాక్‌బెర్రి, ఐవోఎస్, విండోస్ 7 ఆపరేటింగ్ సిస్టమ్ వాడుతున్న వారు దీనిని ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా జీపీఎస్ ఉన్న స్మార్ట్‌ఫోనుకు మీ లొకేషన్‌ను అనుసంధానం చేయాలి. దీని ద్వారా మీరెక్కడున్నారో మీ కుటుంబ సభ్యులకు సులభంగా తెలుస్తుంది. విద్యార్థినులు, మహిళలు ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు, కిడ్నాప్‌లు జరిగినప్పుడు కాస్త సమయస్ఫూర్తిని ప్రదర్శించి చేతిలోని స్మార్ట్‌ఫోన్ ద్వారా లొకేషన్‌ను తెలియచేయవచ్చు.

అనుక్షణం రక్షణగా..

మహిళలకు అనుక్షణం రక్షణగా నిలిచే మరో యాప్ 'మై సెక్యూరిటీ'. ఇది ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్లలో పనిచేస్తుంది. అవసరమైన సమాచారంతో పాటు.. ఆపద సమయంలో చుట్టూ ఉన్న పరిసరాల ఫొటోలను కూడా సన్నిహితులకు పంపించ గలిగే టెక్నాలజీ ఇందులో ఉంది..



పోలీసు హ్యాక్ ఐ

'ఐయామ్ సేఫ్' అప్లికేషన్

మీరు క్షేమంగానే ఉన్నారన్న విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు తెలియచేసే ఉచిత ఆండ్రాయిడ్ యాప్ ఇది. మీరు ఏ ప్రాంతంలో ఉన్నారన్న విషయాన్ని క్రమం తప్పకుండా నిర్ణీత కాల వ్యవధిలో కుటుంబ సభ్యులకు మెసేజ్ పంపుతూ ఉంటుంది. అవసరమైతే మ్యాప్‌లను కూడా పంపిస్తుంది. ప్రమాదంలో ఉన్నప్పుడు మూడు సార్లు మెనూ బటన్ నొక్కితే చాలు ప్రత్యేకంగా ఎటువంటి మెసేజ్‌లు, ఆప్షన్స్ అవసరం లేకుండానే ఎస్ఎంఎస్‌లు వెళ్లిపోతాయి.

షేక్ చేసే యాప్

'షేక్ అలర్ట్' ఐ ఫోన్ అప్లికేషన్! ఎదుటి వారిని భయపెట్టడంలో దిట్ట! ఎవరైనా హఠాత్తుగా దాడి చేసినా..కిడ్నాప్ యత్నం చేసినా.. చేతిలో ఉన్న ఫోన్‌ను గట్టిగా షేక్ చేస్తే చాలు..చెవులు చిల్లులు పడేలా అరుస్తుంది. నేరస్థులను బెంబేలెత్తించడంతోబాటు..మీరు ముందుగా నమోదు చేసుకున్న ఫోన్ నంబర్లకు మీ లొకేషన్ వివరాలు చేరవేస్తుంది. ఈ అప్లికేషన్‌ను ఆపిల్ స్టోర్స్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫైట్ బ్యాక్ యాప్

మహిళలకు ఉపయోగపడే మరో అప్లికేషన్ ఇది. ఆపదలో ఉన్నప్పుడు.. వెంటనే ముందుగా నమోదు చేసుకున్న నంబర్లకు ఫైట్ బ్యాక్ యాప్ సమాచారం చేరుతుంది. మెయిల్స్ కూడా పంపుతుంది. ఇందులో గరిష్ఠంగా ఐదు నెంబర్లను నమోదు చేసుకోవచ్చు. సమస్య ఎదురైనప్పుడు యాప్‌పై క్లిక్ చేస్తే చాలు.. కుటుంబ సభ్యులకు సమాచారాలను పంపిస్తూనే ఉంటుంది. నిమిషానికోసారి అలర్ట్ పంపిస్తుంది. ఈ యాప్‌ను గూగుల్ ప్లే, యాపిల్ స్టోర్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ప్రమాదం పొంచి ఉందని తెలిస్తే 'ఐ వాచ్' అప్లికేషన్‌ను యాక్టివేట్ చేయవచ్చు. వెంటనే చుట్టూ ఉన్న ప్రాంతాలను 20 నిమిషాలపాటు చిత్రీకరించడంతోబాటు శబ్దాలను కూడా రికార్డ్ చేస్తుంది. ముందే నమోదు చేసిన నంబర్లకు వాటిని చేరవేస్తుంది. కొన్ని కేసుల్లో దర్యాప్తు అధికారులకు ఇది కీలకమైన సమాచారాన్ని అందజేస్తుంది. ఇలా అనేక స్మార్ట్ యాప్‌లు మహిళలకు బాడీ గార్డులుగా సేవలందిస్తున్నాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- స్మార్ట్ ఫోన్‌లో యాప్స్ డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత వాటిని యాక్టివేట్ చేయడం మరచిపోవద్దు.
- తప్పనిసరిగా జీపీఆర్ఎస్ ఆన్ చేసి ఉంచాలి.
- మీ క్షేమం కోరే వారి నంబర్లతో పాటు..కొన్ని మెసేజ్‌లను కూడా ముందే టైప్ చేసి ఉంచుకోవాలి.


కార్యాలయాల్లో కీచకులు!

- నిత్యం ఇద్దరు ఉద్యోగినులపై వేధింపులు
- 316 రోజుల్లో 539 ఫిర్యాదులు
- యూపీ నుంచి అత్యధికంగా 141
- తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగు
- ఏపీలో 12, తెలంగాణలో 7 ఫిర్యాదులు
- జాతీయ మహిళా కమిషన్ నివేదికలో వెల్లడి

మహిళల భద్రతకు ఎన్ని చట్టాలు తెస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. అందుకు ఉదాహరణే జాతీయ మహిళా కమిషన్ తాజా నివేదిక. దేశంలో మహిళా ఉద్యోగినులపై వేధింపులు నిత్యకృత్యంగా మారాయని కమిషన్ నివేదిక పేర్కొంది. గత ఏడాది జనవరి 1 నుంచి డిసెంబరు 12 వరకు లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళల నుంచి కమిషన్‌కు 539 ఫిర్యాదులు అందాయి. అంటే సగటున రోజుకి 1.7 ఫిర్యాదులు కమిషన్‌కు వచ్చాయి. మొత్తం ఫిర్యాదుల్లో 60 శాతం యూపీ, ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా నుంచి వచ్చినవే కావడం గమనార్హం. యూపీ నుంచి అత్యధికంగా 141 ఫిర్యాదులు అందినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉందని కమిషన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏపీ నుంచి 12 ఫిర్యాదులు అందగా, తెలంగాణ నుంచి కేవలం 7 ఫిర్యాదులు మాత్రమే కమిషన్‌కు చేరడం గమనార్హం. 2014 నుంచి గణాంకాలను పరిశీలిస్తే ఇదే పరిస్థితి కొనసాగుతోందని కమిషన్ వర్గాలు తెలిపాయి. 2014 నుంచి ఇప్పటి వరకు నాలుగేళ్లలో మొత్తం 1971 ఫిర్యాదులు ఉద్యోగినుల నుంచి అందినట్లు కమిషన్ వెల్లడించింది. తమకు అందుతున్న ఫిర్యాదుల కన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండవచ్చని కమిషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అసంఘటిత రంగంలో పనిచేసే మహిళా ఉద్యోగినుల సమస్యలపై స్పందించేందుకు ప్రతి సంస్థలోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందని, అయితే చాలా సంస్థల్లో ఈ కమిటీల జాడే ఉండటం లేదు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోకపోవడంతో చాలా వరకు లైంగిక వేధింపుల కేసులు వెలుగు చూడటం లేదన్న వాదన ఉంది.



రోబోటిక్ పప్పీ



- డ్యాన్స్ చేయగలదు.. ఇంగ్లిష్ అర్థం చేసుకోగలదు
- సీఈఎస్-2018లో ప్రధాన ఆకర్షణ

సోనీ కంపెనీకి చెందిన రోబోటిక్ డాగ్ 'ఐబో' అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. లాస్‌వెగాస్‌లో జరుగుతున్న కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్)లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డ్యాన్స్ చేస్తూ ముచ్చట గొలిపింది. ఎముక ముక్కను లేదా బంతిని వెతికి తేవడంతోబాటు కుటుంబ సభ్యుల ముఖాలను చూసి గుర్తించడం ఈ ఐబో ప్రత్యేకత! దీనికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం ఉంది. ప్రధాన కెమెరా రోబో ముక్కులో అమర్చారు. తల పైభాగంలో..టచ్ సెన్సార్లు ఉన్నాయి. తల ఊపుతూ నిజమైన కుక్కలాగే ఐబో కదలికలు ఉన్నాయి. హైఫై ఇవ్వడంతోబాటు ఇంగ్లిషు, జపనీస్ భాషలను అర్థం చేసుకుంటుంది. నిజానికి 1999లో సోనీ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఈ రోబోటిక్ శునకాన్ని ఆవిష్కరించింది. ఆ రోజుల్లో మొదటి 20 నిమిషాల్లోనే మూడు వేల రోబోలు అమ్ముడైపోయాయి. కానీ 2006లో రోబోటిక్ పప్పీల ఉత్పత్తిని నిలిపివేసింది. కానీ 12 ఏళ్ల తర్వాత ఐబో సందడి మళ్లీ మొదలైంది. తాజాగా మరింత ఆధునికీకరించిన రోబోటిక్ డాగ్‌ను మార్కెట్లో సోనీ కంపెనీ విడుదల చేసింది. నవంబరు నుంచి ప్రీ ఆర్డర్స్ మొదలయ్యాయి. మరో వారం రోజుల్లో బుక్ చేసుకున్న వారి ఇళ్లలో ఐబో ప్రత్యక్షమవుతుంది.

ఆకాశమే మా హద్దు

- నాసా కాలెండర్‌లో భారతీయ చిన్నారుల చిత్రాలు
- 193 దేశాల నుంచి 3000 ఎంట్రీలు
- తుది 12లో ఎంపికైన ఇద్దరి బొమ్మలు






రోదసిలో ఎలా జీవించాలి? భవిష్యత్తులో అక్కడ మానవాళి మనుగడ సాగించాలంటే ఏం చేయాలి? ఈ విషయంలో చిన్నారుల ఆలోచనలు ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు.. '2018 కమర్షియల్ క్రూ ప్రోగ్రామ్ క్యాలెండర్ ఆర్ట్ కాంటెస్ట్' నిర్వహించింది నాసా. ఈ పోటీకి ప్రపంచవ్యాప్తంగా 193 దేశాల నుంచి 3000 ఎంట్రీలు రాగా.. వాటిలో 12 బొమ్మలను నాసా ఎంపిక చేసింది. ఆ పన్నెండు బొమ్మల్లో రెండు మనదేశానికి చెందిన చిన్నారులవే. వారి పేర్లు.. కావ్య, సెల్వ శ్రీజిత్. ఇద్దరూ పళని (తమిళనాడు)లోని శ్రీవిద్యామందిర్ విద్యార్థులే. 'రోదసిలోకి వెళ్లాలంటే ఇంటి నుంచి ఏం తీసుకెళ్తారు?' అనే థీమ్‌ను సెల్వ ఎంపిక చేసుకోగా.. 'రోదసిలో ఆహారం' అనే థీమ్‌పై కావ్య చిత్రాన్ని గీసింది. వర్ణరంజితమైన రోదసి ఉద్యానవనాన్ని కావ్య తన చిత్రంలో ఆవిష్కరించింది. రోదసిలో తనతోపాటు ఒక కుక్కను, సైకిల్‌ని, ఫుట్‌బాల్‌ను.. వస్తువులతోపాటు తన చెల్లిని కూడా తీసుకెళ్లనున్నట్టు సెల్వ గీశాడు. వీరిద్దరే కాక.. కోల్‌కతాకు చెందిన ఉత్తారన్ అనే 9 ఏళ్ల బాలుడు 'రాకెట్స్' అంశంపై గీసిన బొమ్మ కూడా.. క్యాలెండర్ కింది భాగంలో చోటు సంపాదించుకుంది.



సీతాకోకచిలుకలే ముందు.. ఆ తర్వాతే పూలు

ప్రకృతి ఎంత రమణీయమో తెలుసుకోవాలంటే పువ్వును.. రంగురంగుల సీతాకోకచిలుకను చూస్తే చాలు. గాలిలో నాట్యం చేస్తూ పువ్వుపై సీతాకోకచిలుక వాలుతుండగా చూస్తే మనకు నయానానందకరమే. మరి ఈ రెండింటిలో ఏది ముందు పుట్టింది. అంటే.. పువ్వేగా! అనుకుంటాం. కానీ, కాదు. భూమిపై పూలు పూసేకంటే లక్షల ఏళ్ల క్రితమే జురాసిక్ కాలంలో సీతాకోకచిలుకలు, చిమ్మటలు ఉద్భవించాయని అమెరికాలోని బోస్టన్ కాలేజీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. సేంద్రియ శిథిలాల్లో లభించిన పుప్పొడి రేణువులు, మొక్కలోని వివిధ భాగాలు, కీటకాల కాళ్లను పరిశీలించి ఈ విషయాన్ని పరిశోధకులు వెల్లడించారు. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చెట్లు, మొక్కల్లో 90 శాతం పూల మొక్కలే. అదే మామిడి, మర్రి, వేప లాంటి చెట్లయితే కొన్ని ప్రాంతాల్లోనే, అదీ తక్కువగానే ఉంటాయి. మరి, భూమినంతటిని పూల మొక్కలే ఎక్కువ ఆక్రమించడానికి కారణం ఏంటి? అంటే.. పెద్ద చెట్లతో పోల్చితే పూల మొక్కల్లో కణం పరిమాణం చాలా చిన్నదిగా ఉంటుందని అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో స్టేట్ వర్సిటీ, యేల్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. మొక్కల ఆకులు త్వరగా పెరిగేందుకు, వాటి వేర్లను విస్తరించేందుకు ఇది దోహదం చేస్తుందని వెల్లడించారు. పూలమొక్కల్లో నీటిని పీల్చుకోవడం, కార్బన్‌డయాక్సైడ్ తీసుకోవడం కూడా వేగంగా ఉంటుందని వివరించారు. ఇదిలా ఉండగా, వాతావరణ మార్పుల కారణంగా కార్బన్‌డయాక్సైడ్ పెరిగి పుష్పారణ్యాలు విస్తరిస్తున్నాయని ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. కార్బన్‌డయాక్సైడ్ విడుదలతో ఉష్ణమండల అడవుల్లోని వాతావరణం పుష్పజాతికి చెందిన మొక్కలకు అనుకూలంగా మారుతోందని పేర్కొన్నారు.



అమెరికాలోని ఓ భాగమే.. ఆస్ట్రేలియాలో నగరం



వృత్తంలోఆకు పచ్చరంగులో కనిపిస్తున్న నగరం జార్జిటౌన్


ఆస్ట్రేలియాలోని జార్జిటౌన్ నగరం ఒకప్పుడు నార్త్ అమెరికాలో భాగమని పరిశోధకులు చెబుతున్నారు. జార్జిటౌన్‌లో ఉన్న రాళ్లకు నార్త్ అమెరికాలోని కెనడాలో ఉన్న రాళ్లకు పోలికలు ఉన్నట్లు పరిశోధకులు తాజాగా గుర్తించారు. దీని ఆధారంగా చేసుకుని 1700 మిలియన్ సంవత్సరాల క్రితం జార్జిటౌన్.. కెనడాలో అంతర్భాగమై ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఆస్ట్రేలియాలోని కర్టిన్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు. 1700 మిలియన్ సంవత్సరాల క్రితం నార్త్ అమెరికాలోని రాళ్లు విడిపోయి సముద్రంలో పడిపోయాయని తమ పరిశోధనలో గుర్తించినట్లు చెబుతున్నారు. 10 కోట్ల సంవత్సరాల తర్వాత జార్జిటౌన్.. ఆస్ట్రేలియాతో కలిసి పోయిందని చెబుతున్నారు. ఈ సమయంలోనే ఆస్ట్రేలియాలోని మౌంట్ ఇసా, జార్జిటౌన్ ప్రాంతంలో కొండలు ఏర్పడ్డాయని చెబుతున్నారు. దీని ఆధారంగా సూపర్ కాంటినెంట్ 'నూన్'కు సంబంధించిన కీలక విషయాలు తెలుసుకునే అవకాశముందని చెబుతున్నారు.



జాబ్ సెర్చ్‌కి 8 పుస్తకాలు


ఏ వయస్సులోనైనా సరే ఉద్యోగ అన్వేషణ అంటే కొంచెం సవాలుతో కూడుకున్న పనే. ఇందులో ఎన్నో రకాల అంశాలు ఇమిడి ఉంటాయి. రెజ్యూమె తయారీ, జాబ్ సైట్స్ ఉపయోగించుకోవడం, ఇంటర్వ్యూ ప్రిపరేషన్, శాలరీ డిస్కషన్, వర్క్‌టైమ్ మేనేజ్‌మెంట్, ఎంప్లాయి రిలేషన్స్ తదితరాలన్నీ కూడా ఒక ఉద్యోగి జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే వీటన్నింటికీ సమాధానం అన్నట్టు ఎనిమిది పుస్తకాలు ప్రపంచ మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. కొన్ని పుస్తకాలు కాలానికి అనుగుణంగా అప్‌డేట్ అవుతుంటే, మరికొన్ని దశాబ్దాలుగా పాఠకులను అలరిస్తున్నాయి. ఉద్యోగాన్వేషణ ప్రకియలో ఈ పుస్తకాలు అందించే సహకారం ఎంతో మేలైనది, మరువలేనిది.

1 వాట్ కలర్ ఈజ్ యువర్ పారాచూట్: రిచర్డ్ ఎన్ బోలెస్




ఉద్యోగాన్వేషణలో భాగంగా కేవలం ఒక్క పుస్తకమే చదవాలని భావిస్తే ఎంచుకోదగ్గది ఇదేనంటే అతిశయోక్తి కాదు. చూడగానే ఆకట్టుకునే రెజ్యూమె, కవర్ లెటర్, నెట్‌వర్క్ మెరుగుదల, ఇంటర్వ్యూయింగ్, జీతభత్యాలు బేరమాడేందుకు అవసరమైన నైపుణ్యాలు వంటివన్నీ పుస్తకం మొదటి సగంలో ఉంటాయి. రెండో భాగం యావత్తు ఐడియల్ కెరీర్‌ను గుర్తించడంపై దృష్టి కేంద్రీకరించింది. జాబ్ హంటింగ్ గైడ్‌గా సుప్రసిద్ధం. ఏటా రివైజ్ అవుతున్న ఈ పుస్తకం ఇప్పటికి పది మిలియన్ కాపీలు అమ్ముడుపోయింది. ఎప్పటికప్పుడు జాబ్ మార్కెట్‌లోని పరిస్థితులు, ఉద్యోగాన్ని పొందేందుకు అవసరమైన వ్యూహాలను తెలియజేస్తోంది. ఏయే ఎత్తుగడలు పనికొస్తాయో కూడా విశదీకరిస్తుంది. తద్వారా ఫలితాలన్నిచ్చే ఎత్తుగడలపై ఉద్యోగార్థులు దృష్టి కేంద్రికరించవచ్చు. మంచి జాబే కాదు, ఆకర్షణీయమైన వేతనాన్ని అభ్యర్థులు కోరుకుంటారు. అయితే జాబ్‌కుతోడు వేతనాన్ని రాబట్టుకునేందుకు అనుసరించాల్సిన చిట్కాలను కూడా ఈ పుస్తకం అందిస్తుంది. అన్వేషణలో అదే మొదటి జాబ్ కావచ్చు, లేదంటే మిడ్ కెరీర్‌లో ఉద్యోగ మార్పు కావచ్చు... దేనికైనా ఈ పుస్తకం ఉపయోగపడుతుందంటే అతిశయోక్తి కాదు.

2 గెటింగ్ థింగ్స్ డన్: డేవిడ్ ఎల్లెన్




జాబ్ మార్కెట్‌లో జరుగుతున్న పరిణామాలను అంతకు మించి వాటి కదలికలను కూడా తీసుకుని అన్వేషణ ఎలా సాగించాలనేది ఈ పుస్తకం తెలియజేస్తుంది. టైమ్ మేనేజ్‌మెంట్ అలాగే ఆర్గనైజేషన్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలను కూడా వివరిస్తుంది. లక్ష్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవడమే కాదు ఆ దిశగా ఫోకస్ పెట్టడం ఎలా అన్నది బోధిస్తుంది. పరివర్తన దశలో జాబ్ దొరకబుచ్చుకునే వ్యూహాలను తెలియజేస్తుంది. బిజినెస్, పర్సనల్ ప్రొడక్టివిటీకి బైబిల్‌గా ఈ పుస్తకాన్ని లైఫ్‌హక్ అభివర్ణించారు. ప్రచురించి దశాబ్దంన్నర కావస్తున్న ఈ పుస్తకం హవా ఇంతా అంతా కాదు. పర్సనల్ ఆర్గనైజేషన్ విషయాల్లో కీలకమైన పుస్తకంగా ప్రశంసలు అందుకుంది. రచయిత పేరుతో కలిపి సంక్షిప్త నామం 'జిటిడి'గా సుప్రసిద్ధమైంది. పర్సనల్, ప్రొఫెషనల్ టాస్క్‌లను డీల్ చేయడంలో ఉపకరిస్తుంది. సంబంధిత వెబ్ సైట్స్, ఆర్గనైజేషనల్ టూల్స్, సెమినార్ల సమాహారమిది. అయితే ఈ పుస్తకాన్ని తరవాతి రోజుల్లో అల్లెన్ తిరగ రాశారు. కాలానుగుణంగా చోటుచేసుకున్న మార్పులను కూడా కలుపుకొని మొదటి నుంచి చివరి వరకు అంతా మార్చుకుంటూ వెళ్ళిన పుస్తకం ప్రస్తుతం అందుబాటులో ఉంది. కొత్త తరం కూడా దీనిని ఆదరించడం విశేషం.

3 హౌ టు విన్ ఫ్రెండ్స్ అండ్ ఇన్‌ఫ్లూయెన్స్ పీపుల్: డేల్ కార్ని



తోటి మనుషులను ఆకట్టుకోవడం ఒక కళ. అదెలా అన్నది ఈ పుస్తకం విశదీకరిస్తుంది. ఏ తరానికైనా ఉపకరించే పుస్తకమిది. పర్సనల్, ప్రొఫెషనల్ జీవితాన్ని చక్కగా మలుచుకునేందుకు మార్గనిర్దేశం చేస్తుంది. నెట్‌వర్కింగ్ అంటే ఎక్కువమందితో మంచి సంబంధాలను నెలకొల్పుకునేందుకు తోడ్పడుతుంది. వివిధ వ్యక్తులు మిమ్మల్ని ఇష్టపడి అభిమానించేలా చేసుకోవడం ఎలాగో నేర్పుతుంది. వ్యక్తులతో గరిష్ఠ స్థాయిలో ఇంటరాక్షన్‌కు దోహదపడే అంశాలపై కార్నెగి దృష్టి కేంద్రీకరించారు. చర్చలో ఆధిక్యం కంటే, ఎదుటి వారి మాటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా ఇద్దరికీ ఆసక్తి ఉన్న అంశాలపై మాట్లాడుకోవచ్చని రచయిత సూచించాడు. ఈయన సూచనలు తరాలుగా పలువురిని ఆకట్టుకున్నాయి. వ్యక్తులు నిన్ను ఇష్టపడటానికి ఆరు మార్గాలు, మనుషులను ఆకట్టుకునేందుకు పన్నెండు మార్గాలు వంటివి వీటిలో కొన్ని అంశాలు మాత్రమే. సుమారుగా కోటిన్నర ప్రతులు అమ్ముడు పోయాయంటే ఈ పుస్తకం విలువ ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

4 వెయిట్, హౌ డు ఐ రైట్ దిస్ ఈమెయిల్: డేనీ రూబిన్




ఈ టైటిల్ నిజానికి తప్పుదోవ పట్టిస్తుంది. ఈ మెయిళ్ళు ఎలా రాయాలన్న విషయానికే ఈ పుస్తకం పరిమితం కాదు. అందులో ఈ మెయిళ్ళ విషయం కూడా ఉంటుంది. జాబ్ సెర్చ్ పరిస్థితులను ఈ పుస్తకం లోతుగా చర్చిస్తుంది. ఉద్యోగం విషయంలో రాత అంశాన్ని ఇది కవర్ చేస్తుంది. సంబంధిత గైడెన్స్ అందిస్తుంది. లింక్డిన్ ప్రొఫైల్ మొదలుకుని రెజ్యూమె, కవర్ లెటర్ వరకు అన్నింటిపై సూచనలు ఉన్నాయి. జీవితంలో ఇంతవరకు ఒక అక్షరం కూడా రాయని వ్యక్తులు సైతం తమ భావాలను కాగితంపై పెట్టేలా ప్రోత్సహిస్తుంది. ఉద్యోగ వెతుకలాటలో రాత అంశానికి సంబంధించి ప్రొఫెషనల్‌గా ఎదిగేందుకు ఈ పుస్తకం ఎంతగానో తోడ్పడుతుంది. అయితే ఈ పుస్తకం కొత్త ప్రింట్ లభ్యం కావటం లేదన్నది సమాచారం. జాబ్ సెర్చ్‌లో వంద వరకు క్లిష్టమైన ఈమెయిళ్ళు, డాక్యుమెంట్లను రచయిత లోతుగా విశ్లేషించారు. ప్రతి టెంప్లేట్ నుంచి టైమ్ ఆదాకు తోడు ఒత్తిడి నుంచి బైటపడేందుకు ఉపకరించేలా ఆయన రాశారు. ఒక్కో పేజీ పూర్తి చేస్తుంటే నెట్‌వర్కింగ్‌పై వివరంగా సూచనలు ఉంటాయి. అంటే ఓపెనింగ్ నుంచి ఉత్కంఠ కలిగిస్తూ రచన సాగుతుంది. గుర్తుంచుకోదగిన విధంగా చేతిరాత నోట్స్‌తో రచయిత పుస్తకాన్ని చాలా అందంగా, ఆకట్టుకునేవిధంగా మలిచారు. మొత్తమ్మీద కథలా పుస్తకం సాగుతుంది.

5 ద ఎలిమెంట్స్ ఆఫ్ స్టయిల్: విలియం స్ట్రంక్ జూనియర్, ఇబి వైట్




రెజ్యూమె, కవర్ లెటర్ ఎడిటింగ్‌పై ఈ పుస్తకం లోతుగా చర్చిస్తుంది. గ్రామర్, పంక్చుయేషన్, స్పెల్లింగ్ తప్పులు ఎక్కువగా దొర్లుతుంటాయి. ఒక్కోసారి ఈ తప్పులతో అర్థమే మారే ప్రమాదం ఉంటుంది. అలాంటి తప్పులు చేయకుండా ముఖ్యంగా వ్యాకరణ దోషం లేకుండా రాయడంపై ఈ పుస్తకంలో పలు సలహాలను పొందుపరిచారు. ఒక రకంగా ఇది వ్యాకరణ పుస్తకమే. దీన్ని ఫాలో అయితే రాతను మెరుగుపర్చుకోవచ్చు. ప్రస్తుతం దీని నాలుగో ఎడిషన్ మార్కెట్లో లభ్యమవుతోంది. ఇప్పటికే చాలా మంది ఈ పుస్తకాన్ని వినియోగించి కూడా ఉండొచ్చు. ఇంగ్లీష్ స్టయిల్‌కు సంబంధించిన ప్రిన్సిపుల్స్‌ను ఈ బుక్ లోతుగా వివరిస్తుంది. పుస్తకం చిన్నదైనా రాత విషయంలో మంచి ప్రభావం చూపుతుంది.

6 ద టు అవర్ జాబ్ సెర్చ్: యూజింగ్ టెక్నాలజీ టు గెట్ ద రైట్ జాబ్ ఫాస్టర్: స్టీవ్ డాల్టన్




ఇంటర్నెట్ జాబ్స్ పొందేందుకు అవసరమైన ప్రాక్టికల్ టిప్స్‌ను ఈ పుస్తకం అంది స్తుంది. అతి తక్కువ సమ యంలో ఎక్సెల్, గూగుల్, లింక్డిన్ తదితర డేటా బేస్ నుంచి ఉపాధి పొందేందుకు ఉద్దేశించిన మూడు స్టెప్స్‌ను వివరిస్తుంది. టార్గెట్ ఎంప్లాయిర్లను గుర్తించడం, కాంటాక్ట్ చేయడం, రిక్రూట్‌మెంట్ విషయాలను తెలుసుకోవచ్చు. జాబ్ సెర్చ్ చాలా పద్ధతిగా టెక్‌సావే ఫార్ములాను అనుసరించి ఉంటుంది. పై మూడింటి డేటా బేస్ నుంచి సమాచారం తీసుకోవడం నుంచి ఏవి ఎలా పొందవచ్చో తెలుసుకోవడానికి, ఇంటర్వ్యూ వరకు యావత్తు విషయాల సమాహారమిది. జాబ్స్‌కు సంబంధించి మధ్యంతర దశ క్లిష్టంగా ఉంటుంది. నిరాశ, నిస్పృహ ఆవరించి కూడా ఉంటుంది. ఆయా అంశాలపై కూడా దృష్టి కేంద్రీకరించి మరీ రాసిన పుస్తకమిది.

7 స్టీల్ ద షో: మైఖేల్ పోర్ట్స్



ఇంటర్వ్యూ వ్యవహారాలను చర్చించే పుస్తకమిది. ఏదైనా ఉద్యోగానికి నేనే బెస్ట్ పర్సన్ అని ఆకట్టుకునేలా చెప్పే టిప్స్‌ను అందించే బుక్ ఇది. రిక్రూట్ చేసే వ్యక్తిని ప్రభావం చేసేలా ఆయ ప్రశ్నలకు ఎలా సమాధానం ఇవ్వాలో తెలియజేస్తుంది. మా సమాధానాలకు సంతృప్తి కనబర్చడమే కాదు, ఉద్యోగిగా తీసుకోవాలని రిక్రూటర్ భావిస్తే ఎలా వ్యవహరించాలో కూడా అభ్యర్థులకు చెబు తుంది. రచయిత అభిప్రాయం ప్రకారం ప్రతి ఇంటరాక్షన్ ఎంతో కొంత ప్రభావం చూపుతుంది. ఒక వ్యక్తికి సమా చారం అందించడం, మోటివేషన్, ప్రభావ పర్చడం అన్నది నిజానికి రోజూ జరిగేదే. ఇది అందరికి తెలిసిన వ్యవహా రమే. అయితే అదే టెక్నిక్‌ను ఇంటర్వ్యూలో ఉపయోగిం చాలి. అదెలాగో ఈ పుస్తకంలో రచయిత తెలియిజేశారు.

8 గెటింగ్ టు ఎస్: నెగోషియేటింగ్ అగ్రిమెంట్ విత్‌ఔట్ గివింగ్ ఇన్: రోగర్ ఫిషర్, విలియం ఎల్.యూరి, బ్రూస్ పాటన్స్



జీత భత్యాలను, ఇతర ఆర్థిక ప్రయోజనాలను ఎలా పొందాలో, ఆ విషయమై ఎంప్లాయిర్‌తో ఎలా చర్చించాలో ఈ పుస్తకం తెలియజేస్తుది. ముప్పయ్ సంవత్సరాలుగా మార్కెట్లో ఈ పుస్తకం ఉంది. హార్వర్డ్ నెగోసియేషన్ ప్రాజెక్ట్ ఆధారంగా జీత భత్యాలను చర్చించడానికి అచరణాత్మక విధానాలను ఈ రచయితలు పొందుపర్చారు. అలాగే ఈ పుస్తకాన్ని అప్‌డేట్ చేశారు. 'గెటింగ్ టు ఎస్' అన్నది అసలు దీని ఒరిజినల్. దాన్ని ఇప్పుడు ఈ రూపంలోకి మార్చారు. స్టెప్ బై స్టెప్ స్ట్రాటజీని అందించిన పుస్తకంగా గెటింగ్ టు ఎస్‌కు మంచి పేరుంది. సవరించిన తరవాత కూడా అన్వయించ కలిగిన విధానాలతో ప్రొఫెషనల్ టచ్ ఈ పుస్తకంలో ఉంది.

https://www.businessinsider.in/8-books-every-job-seeker-should-read/Richard-N-Bolles-What-Color-is-Your-Parachute/slideshow/ 51786703.cms

గవర్నమెంట్ జాబ్స్

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఖాళీలు 27

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)- వివిధ బ్రాంచ్‌ల్లో దివ్యాంగులకు ఉద్దేశించిన అసిస్టెంట్ పోస్టుల భర్తీకి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది.

- ఎంపిక: ప్రిలిమినరీ & మెయిన్ ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ద్వారా
- ప్రిలిమినరీ ఎగ్జామినేషన్: ఏప్రిల్ 6న
- మెయిన్ ఎగ్జామినేషన్: మే 7న
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 26
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: www.rbi.org.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్

ఖాళీలు 32

హైదరాబాద్ గోల్కొండలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: పిజిటి 5, టిజిటి 10, పిఆర్‌టి 15, పిటిఐ - టిజిటి 1, పిఆర్‌టి మ్యూజిక్ 1
- పిజిటి విభాగాలు: పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ, ఎకనామిక్స్, కామర్స్ అండ్ హిస్టరీ
- టిజిటి విభాగాలు: ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్ సైన్స్, మేథ్స్, ఇంగ్లీష్, హిందీ
- అర్హత: పిజిటిలకు సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తిచేసి ఉండాలి. సీనియర్ సెకండరీ క్లాసుల్లో (సిబిఎస్‌ఇ విధానంలో పదకొండు, పన్నెండు తరగతులు) బోధనా అనుభవం ఉండాలి. అగిఉఖి ఇఖిఅ ఎగ్జామ్‌లో అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది. టిజిటిలకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సెకండరీ క్లాసుల్లో (ఆరోతరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు) బోధనా అనుభవం ఉండాలి. పిఆర్‌టిలకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రైమరీ క్లాసులకు భోధించగల నైపుణ్యం ఉండాలి. టిజిటి, పిఆర్‌టిలకు అగిఉఖి ఇఖిఅ ఎగ్జామ్/ సీటెట్/టెట్ అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది. పిటిఐ పోస్టులకు డిగ్రీ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పూర్తిచేసి ఉండాలి. పిఆర్‌టి (మ్యూజిక్ - వెస్ట్రన్) పోస్టులకు డిగ్రీతోపాటు కీ బోర్డ్, గిటార్ ప్లే చేయడంలో నైపుణ్యం ఉండాలి.
- దరఖాస్తు ఫీజు: రూ.100
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: జనవరి 31
- చిరునామా: Army public School Golconda, Hydershakote, Hyderabad- 500031

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్

ఖాళీలు 16

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్)- వర్క్‌మెన్ కేటగిరీలో నాన్ ఎగ్జిక్యూటివ్ పర్సనల్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: జూనియర్ ఆపరేటర్
- విభాగం: ఏవీయేషన్
- అర్హత: కనీసం 45 శాతం మార్కులతో పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు డ్రైవింగ్‌లో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. బిఇ/ ఎంబిఏ/ సీఏ/ ఐసిడబ్ల్యుఏ/ ఎల్ఎల్‌బి/ ఎంసిఏ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ద్వారా
- వయసు: 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి
- దరఖాస్తు ఫీజు: రూ.150
- వెబ్‌సైట్: www.iocl.com

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 135

సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టు: ప్రొఫెసర్
- ఖాళీలు: 19
- విభాగాలవారీ ఖాళీలు: మెకానికల్ 3, కంప్యూటర్ 2, ఎలక్ట్రికల్ 5, కెమికల్ 1, ఎలక్ట్రానిక్స్ 5, అప్లయిడ్ ఫిజిక్స్ 1, అప్లయిడ్ మేథమెటిక్స్ & హ్యూమానిటీస్ 2
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 16
- పోస్టు: అసోసియేట్ ప్రొఫెసర్
- ఖాళీలు: 37
- విభాగాలవారీ ఖాళీలు: సివిల్ 1, అప్లయిడ్ మెకానిక్స్ 4, మెకానికల్ 13, కంప్యూటర్ 5, ఎలక్ట్రికల్ 1, కెమికల్ 2, ఎలక్ట్రానిక్స్ 7, అప్లయిడ్ ఫిజిక్స్ 1, అప్లయిడ్ కెమిస్ట్రీ 2, అప్లయిడ్ మేథమెటిక్స్ & హ్యూమానిటీస్ 1
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
- పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్
- ఖాళీలు: 79
- విభాగాలవారీ ఖాళీలు: సివిల్ 10, అప్లయిడ్ మెకానిక్స్ 4, మెకానికల్ 24, కంప్యూటర్ 11, ఎలక్ట్రికల్ 13, కెమికల్ 2, ఎలక్ట్రానిక్స్ 12, అప్లయిడ్ ఫిజిక్స్ 1, అప్లయిడ్ మేథమెటిక్స్ & హ్యూమానిటీస్ 2
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 26
- వెబ్‌సైట్: www.svnit.ac.in

ఎన్ఐఆర్‌డిపిఆర్

ఖాళీలు 18

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయితీ రాజ్ (ఎన్ఐఆర్‌డిపిఆర్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులు: అసిస్టెంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) 1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (అకౌంట్స్) 5, జావా డెవలపర్ 1, సిస్టం అడ్మినిస్ట్రేటర్ (లీనక్స్) 1, పిహెచ్‌పి డెవలపర్స్ 2, యుఐ డెవలపర్ 1, జావా కం మొబైల్ డెవలపర్ 1, ప్రాజెక్ట్ మేనేజర్ (బ్రాండింగ్ & సోషల్ మీడియా) 1, బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్ స్పెషలిస్ట్ 1, కంటెంట్ మేనేజర్ 1, గ్రాఫిక్ డిజైనర్ 1, మీడియా ప్లానింగ్ మేనేజర్ 1, కన్సల్టెంట్ (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్)
- వెబ్‌సైట్: www.nird.org.in

టెక్నికల్ ట్రెయినీలు

ఖాళీలు 35

రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్ - ఎస్సీ/ ఎస్టీ పోస్టులకు ఉద్దేశించిన ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలవారీ ఖాళీలు: టెక్నికల్ 25, ఎలక్ట్రీషియన్ 6, సిస్టం అనలిస్ట్ 1, ఇంజనీర్ (సివిల్, ఎలక్ట్రికల్) 3
- అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ/ డిప్లొమా/ ఐటిఐ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 8
- వెబ్‌సైట్: www.rgca.org.in

ప్రైవేట్ జాబ్స్

ఎర్విన్

- ఉద్యోగం: అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- అర్హత: బిఇ/బిటెక్(సిఎస్ఇ & ఐటి)
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: 2018 జనవరి 25
- వెబ్‌సైట్: http://erwin.com, www.task.telangana.gov.in/Placements

ముత్తూట్

- ఉద్యోగం: బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచ్ మేనేజర్, ఏరియా మేనేజర్/రీజినల్ మేనేజర్
- అర్హత: ఏదైనా డిగ్రీ
- ఇంటర్వ్యూ తేదీ: 2018 జనవరి 24, 25
- వేదిక: Muthoottu Mini Financiers Lts., Saidatta Arcade, Door No.3-6-517, Street No. 6, Himayat Nagar, Hyderabad-500029
- ఇమెయిల్: careers@muthoottumini.com

అమ్‌డాక్స్

- ఉద్యోగం: సాఫ్ట్‌వేర్ డెవలపర్
- అర్హత: బ్యాచిలర్ డిగ్రీ
- అనుభవం: 2- 3 సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్:https://jobs.amdocs.com/job/Pune-Software-Developer-(Pune+55037)-MH/439899000/

సప్త టెక్నో సాఫ్ట్

- ఉద్యోగం: వెబ్ డిజైనర్
- అర్హత: బిఇ/బివిఏ
- అనుభవం: కనీసం సంవత్సరం
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: http://sapthatechnosoft.com/ Web_designer.html

దిక్సూచి

ఎంబీఏ @ నల్సార్

న్యాయ విద్య బోధనలో నల్సార్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. కేవలం లా కోర్సులనే కాకుండా సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీఎంఎస్) ద్వారా మారుతున్న కాలానికనుగుణంగా వినూత్న స్పెషలైజేషన్స్‌తో ఎంబీఏ కోర్సులను కూడా అందిస్తోంది. ఈ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం..

ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్).. మేనేజ్‌మెంట్ రంగంలో ఉన్నత స్థానంలో స్థిరపడటానికి దోహదం చేసే కోర్సు. మంచి సంస్థలో ఎంబీఏ పూర్తి చేస్తే సుస్థిర భవిష్యత్‌కు పునాది వేసుకోవచ్చు. అలాంటి అవకాశం కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటి నల్సార్ యూనివర్సిటీ.


వినూత్న స్పెషలైజేషన్స్

ప్రస్తుతం ఏదైనా వ్యాపారాన్ని ప్రారంభించాలంటే సంబంధిత చట్టాలపై అవగాహన తప్పనిసరి. ఈ నేపథ్యంలో సదరు అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని ఎంబీఏ కోర్సుకు నల్సార్ రూపకల్పన చేసింది. అంతేకాకుండా సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార - వాణిజ్య రంగాల్లో వస్తున్న మార్పులు, చుట్టూ ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నల్సార్ వినూత్న స్పెషలైజేషన్స్‌ను అందిస్తుంది. అవి.. ఫైనాన్స్, హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఇన్నోవేషన్ అండ్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్, బిజినెస్ రెగ్యులేషన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కోర్టు అడ్మినిస్ట్రేషన్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక

క్యాట్/ ఎక్స్‌ఏటీ/ జీమ్యాట్/ సీమ్యాట్/ జీఆర్ఈ స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అంతేకాకుండా అకడమిక్ రికార్డు, ప్రొఫెషనల్ విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. వీటి ఆధారంగా ప్రవేశాలను ఖరారు చేస్తారు. ఈ పరీక్షలు రాయనివారు నల్సార్ యూనివర్సిటీ నిర్వహించే నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్-ఎంఈటీ)కు హాజరు కావచ్చు. ఈ సందర్భంలో ఎన్ - ఎంఈటీ స్కోర్, అకడమిక్ రికార్డు, ప్రొఫెషనల్ విజయాల ద్వారా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి తరవాతి దశలో గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎన్-ఎంఈటీ పరీక్ష, గ్రూప్ డిస్కషన్ / ఇంటర్వ్యూ అన్నీ ఒకే రోజు ఉంటాయి.



ఎన్-ఎంఈటీ ఇలా

ఎన్-ఎంఈటీ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో సెక్షన్-ఎ, సెక్షన్-బి విభాగాలు ఉంటాయి. సెక్షన్-ఎలో ఉండే అంశాలు.. వెర్బల్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), లాజికల్ రీజనింగ్ (25 ప్రశ్నలు). సెక్షన్-బిలోని అంశాలు.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), డేటా ఇంటర్‌ప్రిటేషన్ (25 ప్రశ్నలు). ఎలాంటి నెగిటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2018.
- నల్సార్ మేనేజ్‌మెంట్ టెస్ట్ తేదీ: ఫిబ్రవరి 18, 2018.
- గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీ: ఫిబ్రవరి 18, 2018.
- ఫలితాల వెల్లడి: ఫిబ్రవరి 21, 2018.
- వెబ్‌సైట్: https://cms.nalsar.ac.in

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

15

నిజామాబాద్ • బుధవారం 24 జనవరి 2018

అండర్-19 వరల్డ్‌కప్
పాకిస్థాన్ x దక్షిణాఫ్రికా
తెల్లవారుజామున 3 గం. నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 1 లో...
(క్వార్టర్‌ఫైనల్)

ముస్తాక్ అలీ టోర్నీ
మధ్యాహ్నం
2.20 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 1 లో...

ఆస్ట్రేలియన్ ఓపెన్
ఉదయం
5.30 నుంచి
సోనీ సిక్స్‌లో...



మహ్మద్ అలీ, స్నేహిత్

జాతీయ టీటీలో స్నేహిత్ జోడీకి రజతం

వరుణి జైస్వాల్‌కు కాంస్యం



వరుణి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్, యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలతో మెరిశారు. పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్‌లో జరిగిన జూనియర్ బాలుర డబుల్స్‌లో స్నేహిత్-మహ్మద్ అలీ జోడీ రజతం సాధించగా, జూనియర్ బాలికల సింగిల్స్‌లో వరుణి జైస్వాల్ కాంస్య పతకం దక్కించుకుంది. డబుల్స్ ఫైనల్లో స్నేహిత్ జంట 0-3తో మానవ్ టక్కర్ - సోన్యా చిన్మయ జోడీ చేతిలో ఓడి రన్నరప్‌గా సరిపెట్టుకుంది. వరుణి జైస్వాల్ సెమీస్‌లో 1-4తో అర్చనా కామత్ చేతిలో ఓడి కాంస్యంతో సంతృప్తి పడింది.



రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గాలన్న ప్రపంచ నెంబర్‌వన్ రఫెల్ నడాల్ ఆశలు ఆవిరయ్యాయి. మారిన్ సిలిచ్‌తో జరిగిన క్వార్టర్స్ పోరులో నడాల్ గాయంతో మధ్యలోనే వైదొలిగి ఇంటిబాట పట్టాడు. ఇక స్టార్లు దిమిత్రోవ్, స్వితోలినాలకు అన్‌సీడెడ్ల చేతిలో ఊహించని పరాజయాలు ఎదురవగా... రెండో ర్యాంకర్ వోజ్నియాకి మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది.

అయ్యో.. నడాల్

- గాయంతో వైదొలిగిన నంబర్‌వన్
- సెమీస్‌లో సిలిచ్, వోజ్నియాకి
- దిమిత్రోవ్, స్వితోలినాలకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: అద్భుతఫామ్‌తో దూసుకెళుతున్న నెంబర్‌వన్ ఆటగాడు రఫెల్ నడాల్ పోరాటం గాయం రూపంలో ముగిసింది. మంగళవారం రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో క్రొయేషియా స్టార్ మారిన్ సిలిచ్‌తో జరిగిన పోరులో నడాల్ 6-3, 3-6, 7-6, 2-6, 0-2తో వెనకబడిన సమయంలో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. మూడుసెట్ల పాటు నువ్వా నేనా అనే రీతిలో ఇరు ఆటగాళ్లు జోరు చూపించారు. అయితే నాలుగో సెట్‌లో 1-4 స్కోరుతో వెనకబడిన దశలో నడాల్ కుడికాలి పైభాగంలో నొప్పి కారణంగా తొలిసారిగా ఇంజ్యూరీ టైమ్ అవుట్ తీసుకున్నాడు. ఫిజియోతో చికిత్స తీసుకున్న అనంతరం తిరిగి మ్యాచ్‌ను కొనసాగించాడు. అయితే 2-6తో ఆ సెట్‌ను ఓడాడు. ఆ తర్వాత జరిగిన చివరిసెట్‌లో కూడా గాయంతో నడాల్ ఆటతీరు గతి తప్పింది. ఆ సెట్‌లో 0-2తో ఉన్న దశలో నొప్పి తిరగబెట్టడంతో అతను మ్యాచ్ నుంచి వైదొలగక తప్పలేదు. గాయం కారణంగా ఈ టోర్నీ మధ్యలో తప్పుకోవడం నడాల్‌కిది రెండోసారి. గతంలో 2010లో నడాల్ గాయం కారణంగా క్వార్టర్స్‌లోనే వైదొలిగాడు.

దిమిత్రోవ్‌కు ఎడ్మండ్ షాక్: బ్రిటన్‌కు చెందిన అన్‌సీడెడ్ ఎడ్మండ్ 6-4, 3-6, 6-3, 6-4 తేడాతో ప్రపంచ మూడో ర్యాంకర్ గ్రిగోర్ దిమిత్రోవ్‌పై సంచలన విజయాన్ని నమోదుచేశాడు. టాప్-5 ఆటగాళ్లపై మ్యాచ్ నెగ్గడం ఎడ్మండ్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం. తన శక్తివంతమైన ఫోర్‌హ్యాండ్, సర్వ్‌లతో దిమిత్రోవ్‌పై ఒత్తిడి పెంచి తొలిసారిగా ఓ గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. సెమీస్‌లో సిలిచ్‌ను ఎడ్మండ్ ఎదుర్కొంటాడు.



ఎడ్మండ్

స్వితోలినాకు ఝలక్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారిగా అడుగుపెట్టిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి ఎలిస్ మెర్టెన్స్ పెను సంచలనం సృష్టించింది. ఈ బెల్జియం భామ 6-4, 6-0తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ స్వితోలినా (ఉక్రెయిన్)ను వరుససెట్లలో చిత్తుగా ఓడించింది. ఈ విజయంతో మెర్టెన్స్ తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లో ప్రవేశించింది. ప్రపంచ రెండో ర్యాంకర్ కరోలిన్ వోజ్నియాకి (డెన్మార్క్) సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో వోజ్నియాకి 6-0, 6-7, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ స్వారెజ్ నవారోను ఓడించింది. సెమీస్‌లో మెర్టెన్స్‌తో వోజ్నియాకి అమీతుమీ తేల్చుకోనుంది.



ఎలిస్ మెర్టెన్స్

మిక్స్‌డ్ క్వార్టర్స్‌లో బోపన్న జంట

భారత స్టార్ రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్స్ చేరాడు. రెండో రౌండ్‌లో బోపన్న-టిమియా బాబోస్ (హంగేరి) జంట 6-4, 6-4 తేడాతో వానియా కింగ్ (అమెరికా)-ఫ్రాంకో స్కుగర్ (క్రొయేషియా)లపై గెలిచింది. బుధవారం జరిగే క్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ సెబాస్టియన్ కాబల్-అబిగేల్ స్పియర్స్‌తో బోపన్న ద్వయం తలపడనుంది. మిగతా భారత ఆటగాళ్లలో పేస్, పురవ్ రాజా, దివిజ్ ఇప్పటికే టోర్నీ నుంచి వెనుదిరిగిన సంగతి తెలిసిందే.



ప్రాక్టీస్‌లో రాహుల్, కార్తీక్, విజయ్

మధ్యాహ్నం 1.30 నుంచి SONY TEN 1&3

పరువు కోసం..

ఒకదాన్ని మించిన విజయం మరొకటి. స్వదేశంతో పాటు శ్రీలంక, వెస్టిండీస్ గడ్డపై కూడా సిరీస్ గెలుపులు. ఎలాంటి జట్టునైనా అలవోకగా మట్టికరిపిస్తూ.. వరుసగా తొమ్మిది సిరీస్‌లు ఖాతాలో వేసుకున్నప్పుడు.. నెంబర్ వన్ ర్యాంక్‌పై తిష్ట వేసుకొని కూర్చున్నప్పుడు.. కోహ్లీసేనకు తిరుగుండదనుకున్నాం. విదేశాల్లోనూ గెలుపు బావుటా ఎగరవేస్తుందని ఆశించాం. సౌతాఫ్రికా గడ్డపై తొలి పరీక్షలో డిస్టింక్షన్‌లో పాసవుతుందని అనుకున్నాం..!

కానీ, టీమిండియా అట్టర్‌ఫ్లాప్ అయింది.చేజేతులా రెండు మ్యాచ్‌ల్లో ఓడి సఫారీలకు సిరీస్ ఇచ్చేసింది. ఒక్క దెబ్బకు మన జట్టు జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ఇప్పుడు కోహ్లీసేన అతి పెద్ద ప్రమాదం ముంగిట నిలిచింది. 1992 నుంచి ఇప్పటివరకు సఫారీ టూర్‌కు వచ్చిన భారత జట్లు ఒక్కసారి కూడా వైట్‌వాష్ ఎదుర్కోలేదు. మరో మ్యాచ్‌లో ఓడితే ఆ చెత్త రికార్డు కోహ్లీసేన ఖాతాలో పడుతుంది. మరి, తొలి టీ-20 వరల్డ్ కప్ ఫైనల్ నెగ్గడంతో పాటు ఆడిన నాలుగు టెస్టుల్లోనూ ఓటమెరుగని రికార్డున్న వాండరర్స్ మైదానంలో ఆఖరి టెస్టులోనైనా భారత్ గెలుస్తుందా.. వైట్‌వాష్ తప్పించుకొని పరువు కాపాడుకుంటుందా? క్లీన్‌స్వీప్ చేసి అగ్రస్థానానికి చేరువవ్వాలని చూస్తున్న సఫారీలు కోహ్లీసేనకు ఆ చాన్సిస్తారా?

- బరిలోకి రహానె, భువనేశ్వర్
- భారత్‌కు విషమ పరీక్ష
- క్లీన్‌స్వీప్‌పై దక్షిణాఫ్రికా కన్ను
- నేటి నుంచి మూడో టెస్టు

జొహాన్నెస్‌బర్గ్: నెంబర్ వన్ జట్టుగా భారీ అంచనాలతో దక్షిణాఫ్రికాకు వచ్చిన టీమిండియా ఇంత పేలవ ప్రదర్శన చేస్తుందని ఎవరూ ఊహించలేదు. వరుసగా రెండు ఘోర ఓటములతో ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయి జట్టు సెలెక్షన్ మొదలు.. షాట్ సెలెక్షన్ వరకూ అన్నింటా విఫలమై ఆత్మవిశ్వాసం లోపించిన భారత్.. ఇప్పుడు పరువైనా దక్కించుకోవాలని చూస్తోంది. బుధవారం మొదలయ్యే ఆఖరిటెస్టులో ఎలాగైనా నెగ్గాలన్న పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి టెస్టులో 72 పరుగులతో, రెండో టెస్టులో 135 రన్స్‌తో భారత్‌ను చిత్తుగా ఓడించిన సఫారీలు.. ఈ మ్యా చ్‌లోనూ నెగ్గి సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేద్దామన్న విశ్వాసంతో ఉన్నారు. అలాగే, మళ్లీ నెంబర్‌వన్ ర్యాంక్ అందుకునేందుకు ముందడుగు వేయాలని చూస్తున్నారు.

బ్యాటింగ్‌లో రాణిస్తేనే..: ఈ సిరీస్‌కు ముందు అన్ని విభాగాల్లోనూ భారత్ అత్యుత్తమంగా కనిపించింది. గతంలో ఎప్పుడూ లేనంత బలంగా ఉన్న పేస్ విభాగం రెండు మ్యాచ్‌ల్లోనూ త మ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తించింది. నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనూ ప్రత్యర్థిని ఆలౌట్ చేసినా.. మన జట్టు ఓడిందంటే కారణం బ్యాటింగ్ వైఫల్యమే. కెప్టెన్ కోహ్లీ మినహా ఎవరూ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేయలేదు. వైట్‌వాష్ తప్పించుకోవాలంటే కోహ్లీతో పాటు అంతా రాణించాల్సిందే. ముఖ్యంగా శుభారంభాలు లేకపోవడం జట్టును దెబ్బతీస్తోంది. విజయ్, లోకేశ్ బాధ్యతగా ఆడాల్సి ఉంటుంది. గతమ్యాచ్‌లో నిర్లక్ష్యంగా రెండుసార్లు రనౌటైన పుజారా ఆఖరాటలోనైనా బ్యాట్ ఝుళిపించాలి. ఫీల్డింగ్‌లోనూ మెరుగై.. క్యాచ్‌లు చేజారకుండా చూసుకోవాలి.

> **పిచ్/వాతావరణం**
>
> ఆరు మిల్లీ మీటర్ల పచ్చికతో వాండరర్స్ వికెట్ పచ్చగా కనిపిస్తోంది. మ్యాచ్‌కు ముందు దాన్ని కత్తిరించే అవకాశం కూడా లేదు. ఎండ తక్కువగా ఉండడంతో పగుళ్లు కూడా లేవు. గ్రౌండ్‌స్టాఫ్ పిచ్‌పై ఎప్పటికప్పుడు రోలింగ్ చేస్తున్నారు. అయితే, సమయం గడుస్తున్న కొద్దీ పగుళ్లు రావొచ్చు. వాతావరణ పరిస్థితులు కూడా ప్రభావం చూపనున్నాయి. ఈ ఐదు రోజుల్లోనూ ఉదయం పూట వర్షం వచ్చే చాన్స్ ఉంది.

ఐదుగురు పేసర్లతో..: కెప్టెన్‌గా 34 టెస్టుల్లో ప్రతీసారి జట్టును మార్చిన కోహ్లీ ఈ మ్యాచ్‌లోనూ మార్పులు చేయనున్నాడు. గతమ్యాచ్‌లో పక్కనబెట్టిన భువనేశ్వర్‌తో పాటు రహానెను ఈసారి ఆడించే చాన్సుంది. రహానె వస్తే రోహిత్‌పై వేటు పడే ప్రమాదం లేదు. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ ఆరుగురు బ్యాట్స్‌మెన్, ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగే ఆలోచనతో ఉన్నట్టు సమాచారం. వాండరర్స్ గ్రీన్ వికెట్‌పై చక్కటి పేస్, బౌన్స్ లభిస్తుంది. అందువల్ల స్పిన్నర్ అశ్విన్‌ను తప్పించి అదనపు బ్యాట్స్‌మన్‌గా రోహిత్‌ను కొనసాగించొచ్చు. ఒకవేళ ఒక స్పిన్నర్‌తో బరిలోకి దిగాలని భావిస్తే జడేజాను ఆడించొచ్చు. స్పిన్నర్ లేకుండా ఆరుగురు బ్యాట్స్‌మెన్‌తో బరిలోకి దిగితే.. పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా స్థానానికి ముప్పు లేదు. సెంచూరియన్‌లో నిర్లక్ష్యపూరిత రనౌట్, షాట్ సెలెక్షన్‌తో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ.. జట్టు ప్రణాళికల్లో హార్దిక్‌ది ఇప్పటికీ కీలకపాత్రే. భువీ కోసం బుమ్రాను బెంచ్‌కు పరిమితం చేయనున్నారు. పార్థివ్ పటేల్ కూడా కొనసాగే అవకాశముంది.

సఫారీలూ అదే ప్రణాళికతో..: భారత్ మాదిరిగా దక్షిణాఫ్రికాకు సెలెక్షన్ తలనొప్పి లేదు. సెంచూరియన్‌లో గాయపడ్డ ఓపెనర్ మార్క్రమ్ ఈ మ్యాచ్‌కు ఫిట్‌గా ఉండే చాన్సుంది. ఆస్ట్రేలియాతో సిరీస్ ఉన్నందున ఈ మ్యాచ్‌లో ఆతిథ్యజట్టు బెంచ్‌బలాన్ని పరీక్షించుకోవచ్చు. ఈమ్యాచ్ నెగ్గడంతో పాటు ఆసీస్‌పై 2-0తో గెలిస్తే సఫారీలు అగ్రస్థానానికి చేరుకోగలరు. అందువల్ల.. డుప్లెసిస్ సేన ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఏరికోరి గ్రీన్ బౌన్సీ వికెట్ తయారు చేయించుకున్నందున.. స్పిన్నర్ కేశవ్ స్థానంలో పెహ్లుక్వాయో, మోరిస్‌లో ఒకరిని బరిలోకి దింపొచ్చు.

జట్లు (అంచనా)

భారత్: విజయ్, రాహుల్, పుజారా, కోహ్లీ (కెప్టెన్), రహానె, పార్థివ్ (కీపర్), హార్దిక్, రోహిత్/అశ్విన్/జడేజా, భువనేశ్వర్, ఇషాంత్, షమి.

దక్షిణాఫ్రికా: ఎల్గర్, మార్క్రమ్, ఆమ్లా, డివిలీర్స్, డుప్లెసిస్ (కెప్టెన్), డికాక్ (కీపర్), ఫిలాండర్, క్రిస్ మోరిస్/పెహ్లుక్వాయో, రబాడ, మోర్కెల్, ఎంగిడి.

ఆ రికార్డు కాపాడుకుంటారా?

సరిగ్గా ఆరు నెలల కిందట.. శ్రీలంకను వారి గడ్డపై అన్ని ఫార్మాట్లలోనూ 3-0తో ఓడించిన కోహ్లీసేన ఈ ఘనత సాధించిన భారత తొలి జట్టుగా నిలిచింది. కానీ, ఒక్కసిరీస్ ఓటమితో పరిస్థితి తలకిందులైంది. ఇప్పుడు సౌతాఫ్రికాగడ్డపై తొలిసారి 0-3తో వైట్‌వాష్ ఎదుర్కొన్న నాయకుడిగా నిలిచే ప్రమాదం ముంగిట నిలిచాడు విరాట్. 1992 నుంచి ఆరుసార్లు టీమిండియా దక్షిణాఫ్రికాలో పర్యటించింది. అందులో.. సచిన్ సారథ్యంలో 1996-97లో 3 టెస్టుల సిరీస్‌ను 0-2తో కోల్పోవడమే భారత్‌కు ఇప్పటిదాకా పేలవ ప్రదర్శన. అలాగే, 2006 నుంచి మూడు పర్యటనల్లో కనీసం ఒక విజయం లేదా డ్రా అయినా చేసుకున్నది మన జట్టు. దాంతో, ఈ మ్యాచ్‌లో ఓడితే కోహ్లీ ఖాతాలో అత్యంత పేలవమైన రికార్డు చేరనుంది. అయితే, వాండరర్స్ స్టేడియంలో మనకు మంచి రికార్డు ఉండడం కాస్త ఊరటనిస్తోంది. ఈ మైదానంలో భారత్ 4 మ్యాచ్‌లు (1992, 97, 2006, 2013) ఆడగా.. ఒక్కదాంట్లో గెలిచి మూడు మ్యాచ్‌లను డ్రా చేసుకుంది.



కోహ్లీ, శాస్త్రి

కెప్టెన్‌గా కోహ్లీ తీరు సరిగా లేదు



జొహాన్నెస్‌బర్గ్: విరాట్ కోహ్లీ నాయకత్వంపై దక్షిణాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ సందేహం వ్యక్తం చేశాడు. టీమిండియాకు దీర్ఘకాలిక కెప్టెన్‌గా కోహ్లీ కొనసాగుతాడని తనకైతే అనిపించడం లేదన్నాడు. 'అతడు అత్యుత్తమ ఆటగాడైతే కావచ్చు. కానీ సహచరుల గురించి ఆలోచించకపోతే ఎలా? డ్రెస్సింగ్ రూమ్‌లో కోహ్లీని ప్రశ్నించే వారే లేరు. అలా కాకుండా అతడి ఆలోచనలతో విభేదించే పరిస్థితులు కూడా ఉంటే జట్టుకు మేలు జరుగుతుంద'ని స్మిత్ అభిప్రాయపడ్డాడు. విరాట్‌తో మాట్లాడి అతడి ఆలోచనలను సవాల్ చేస్తూ.. నిర్మాణాత్మకంగా వ్యవహరించే సహాయ సిబ్బంది సహకారం అతడికి అవసరమన్నాడు. ఫీల్డ్‌లో విరాట్ హావభావాలు కూడా సహచరులపై ప్రతికూల ప్రభావం చూపే విధంగా ఉన్నాయని గ్రేమ్ వ్యాఖ్యానించాడు.

రాగాల వెంకట్‌కు మూడు స్వర్ణాలు

మంగళూరు: సీనియర్ జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ మీట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన లిఫ్టర్లు సత్తా చాటుకున్నారు. మంగళవారం జరిగిన పోటీల్లో తెలంగాణకు చెందిన రాగాల వెంకట రాహుల్ (85కేజీ) స్నాచ్ (148కేజీ), క్లీన్ అండ్ జర్క్ (187కేజీ)లతో పాటు ఓవరాల్ వెయిట్‌లోనూ స్వర్ణాలు నెగ్గాడు. అలాగే శిరీష (58కేజీ) ఓ రజతం, రెండు స్వర్ణాలు సాధించింది. ఇక ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లలో జి.లలిత (63కేజీ) ఇంటర్ స్టేట్ రజతం, రామకృష్ణ (77కేజీ) ఇంటర్ స్టేట్ రజతం, అలీమా బేగం (69కేజీ) రెండు కాంస్యాలు, రెండు రజతాలు సాధించింది.

తప్పుకున్నందుకు భారీ జరిమానా

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఉద్దేశపూర్వకంగా పేలవ ప్రదర్శన చేసి భారీ జరిమానాకు గురైన తొలి ఆటగాడిగా మిష్చా జ్వెరేవ్ నిలిచాడు. గతవారం చుంగ్ యాన్ (దక్షిణ కొరియా)తో జరిగిన తొలిరౌండ్ రెండో సెట్‌లో జ్వెరేవ్ గాయం పేరిట వైదొలిగాడు. అతడికి అందిన ప్రైజ్‌మనీ 47 వేల డాలర్లు కాగా 45 వేల డాలర్లు జరిమానా విధించారు. గతేడాది వింబుల్డన్‌లో ఇలాగే ప్రైజ్‌మనీ కోసం అనుమానాస్పదంగా 8మంది ఆటగాళ్లు తొలి రౌండ్‌లోనే వైదొలగడంతో గ్రాండ్‌స్లామ్స్ ప్రైజ్‌మనీ నిబంధనలను మార్చారు.



జ్వెరేవ్

పోప్ మాయాజాలం


- సెమీస్‌కు ఆసీస్
- అండర్-19 వరల్డ్‌కప్



పోప్ (8/35)

క్వీన్స్‌టౌన్: లెగ్ స్పిన్నర్ లాయడ్ పోప్ (8/35) సంచలన బౌలింగ్‌తో.. అండర్-19 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా సెమీస్‌లోకి దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో చిరకాల ప్రత్యర్థి ఇంగ్లండ్‌పై ఆసీస్ 31 పరుగులతో గెలిచింది. తొలుత ఆసీస్ 33.3 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ జాసన్ సంగా (58) అర్ధ శతకం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లు బాంబర్, పెన్నింగ్టన్, జాక్స్‌కు తలో మూడు వికెట్లు దక్కాయి. స్వల్ప లక్ష్య ఛేదనలో 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 47 పరుగులు చేసిన ఇంగ్లండ్.. పోప్ స్పిన్ ఉచ్చులో చిక్కుకుని 23.4 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ బాంటమ్ (58) అర్ధ శతకంతో ఒంటరి పోరాటం చేశాడు.

టీ20 సారథి హర్మన్‌ప్రీత్



ముంబయి: దక్షిణాఫ్రికా పర్యటనలో భారత టీ20 జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుందని ఆలిండియా మహిళా క్రికెట్ సెలెక్షన్ కమిటీ వెల్లడించింది. భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నది. వన్డే సిరీస్ అనంతరం ఆరంభమయ్యే టీ20 సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ నాయకత్వం వహిస్తుంది. స్మృతి మంధాన వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. కాగా వన్డే జట్టులోని మోనా మెష్రమ్, వికెట్‌కీపర్ సుష్మా వర్మ, ఏక్తా బిస్త్, పూనమ్‌లకు టీ20ల నుంచి విశ్రాంతి కల్పించారు. కాగా అండర్-19 టోర్నీలో డబుల్ సెంచరీ సాధించిన 17 ఏళ్ల ముంబై క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్‌కు వన్డే, టీ20 జట్లలో అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 13న పోచెఫ్‌స్ట్రూమ్‌లో తొలి మ్యాచ్‌తో టీ20 సిరీస్ మొదలవనుంది.

పోరాడితే పోయేదేమీ లేదు

(కృష్ణమాచారి శ్రీకాంత్)

సిరీస్ చేజారినా చివరి టెస్టు ప్రాధాన్యతేమీ తగ్గదు. వాండరర్స్‌లో టెస్టుసిరీస్‌ను విజయంతో ముగించే అవకాశం కోహ్లీసేనకు ఉంది. 0-2తో సిరీస్ కోల్పోగానే భారత జట్టు కూర్పుపై భారీగానే చర్చ జరిగింది. కానీ, కెప్టెన్ స్థానంలో నేనుంటే ఎవరి మాటలూ వినకుండా అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుంటా. రహానెకు మాత్రం తప్పకుండా చోటిస్తా. సౌతాఫ్రికా టూర్‌లో భారత్ ఇప్పటిదాకా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. చివరిటెస్టు నెగ్గితే నా దృష్టిలో అదే శుభారంభం. బౌలర్లు 20 వికెట్లు కూల్చి తమ బాధ్యతను అద్భుతంగా నిర్వర్తించారు. ఇప్పుడు మాత్రం బ్యాట్స్‌మెన్ వంతు. ఈ మ్యాచ్‌లో ఓడినా పోయేదేమీ లేదు కాబట్టి కోహ్లీ సేన సానుకూల దృక్పథంతో విజయం కోసం పోరాడాలి. ఒకసారి అనుకూల ఫలితం వస్తే జట్టు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. -(టీసీఎమ్)

జాతీయ హ్యాండ్‌బాల్ విజేత ఢిల్లీ



సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఢిల్లీ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో ఢిల్లీ 26-23 తేడాతో హరియాణాపై గెలిచింది.

మహిళల టీ20 ప్రపంచకప్‌కు విండీస్ ఆతిథ్యం

దుబాయ్: ఈ ఏడాది మహిళల టీ20 ప్రపంచకప్‌కు వెస్టిండీస్ ఆతిథ్యమివ్వనున్నది. నవంబర్ 9-24 తేదీలలో జరిగే ఈ టోర్నీ మ్యాచ్‌లకు విండీస్‌లోని ఆంటిగ్వా, గయానా, సెయింట్ లూయిస్ ఆతిథ్యమివ్వనున్నాయి. వెస్టిండీస్‌తోపాటు ప్రపంచ విజేత ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారత్, పాకిస్థాన్, సౌతాఫ్రికా, శ్రీలంక ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన రెండుబెర్త్‌ల కోసం బంగ్లాదేశ్, హాలండ్, ఐర్లాండ్, పపువా న్యూగినియా, స్కాట్లాండ్, థాయ్‌లాండ్, ఉగాండ, యూఏఈ పోటీపడనున్నాయి.

నిప్పు



బాణసంచా కాల్చినట్టు లావాను ఎగజిమ్ముతున్న మేయన్ అగ్నిపర్వతం ఇది. ఫిలిప్పీన్స్‌లోని ఈ పర్వతం నుంచి లావా 700 మీటర్ల ఎత్తుకి ఎగసిపడుతోంది. దాదాపు 3 కిలోమీటర్ల మేర లావాతో పాటు నల్లటి బూడిద కమ్మేసింది. 56000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే జపాన్‌లోని కుసత్సు షిరానే అగ్నిపర్వతం బద్దలైంది. ఆ వెంటనే హిమపాతం చోటు చేసుకోవడంతో సైనికుడొకరు మృతి చెందారు. ఆరుగురు సైనికుల బృందం ఆ పర్వతంపైనే శిక్షణ పొందుతోంది. మంచురాళ్లు దొర్లి పడి పలువురు స్కీయర్లు గాయపడ్డారు.

మంచు





మాతా వైష్ణోదేవి ఆలయాన్ని మంచు కమ్మేసింది. ఈ సీజన్‌లో మంచు కురవడం ఇదే తొలిసారి. త్రికూట పర్వతం, దాని పరిసరాల్లో మంచు దట్టంగా పేరుకుంది.

భారత్ అంటేనే పెట్టుబడి



డబ్ల్యూఈఎఫ్ చైర్మన్ క్లాజ్ స్క్వాబ్, స్విస్ అధ్యక్షుడు అలెన్ బెర్సెట్‌లతో ప్రధాని మోదీ

దాదాపు 21 సంవత్సరాల విరామానంతరం.. భారత ప్రధాని ప్రపంచంలోని అగ్రశేణి వ్యాపారవేత్తలనూ, సంపన్న దేశాల అధినేతలనూ, 130 దేశాల ప్రతినిధులనూ ఉద్దేశించి దావోస్ వేదికగా చేసిన ప్రసంగం ఇపుడు సర్వే సర్వత్రా మార్మోగుతోంది. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం నాడు చేసిన ప్రసంగం త్రిగుణాత్మకంగా సాగింది. భారతీయ జీవన ఔన్నత్యాన్ని ప్రపంచానికి వివరించి చెప్పడం ఒక ఎత్తయితే తన ప్రభుత్వ విజయాలను వ్యూహాత్మకంగా ఏకరువు పెట్టడం రెండోది. భారత్ ఏం వాంఛిస్తోందీ, సంస్కరణలను ఎలా ముందుకు తీసుకెళ్లాలనుకుంటోందీ చెబుతూ పెట్టుబడులను ఆకర్షించడం మూడోది. అనంతమైన అవకాశాలున్న భారత్ పెట్టుబడులకు స్వర్గధామమనీ, ఎన్నో రంగాల్లో ప్రగతి పథాన దూసుకుపోతూ మరింత అభివృద్ధికి భారత్ బాటలు వేసుకుంటున్నదని.. వాణిజ్యవేత్తలు, పారిశ్రామిక రంగ ప్రముఖులూ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు.

(మొదటి పేజీ తరువాయి)

రండి. ఆరోగ్యం, మనశ్శాంతి, డబ్బు, అన్నీ సమృద్ధిగా కావాలనుకుంటే భారత్ రండి. ప్రజాస్వామ్యం, ప్రజలు, చైతన్యం.. ఈ మూడూ భారత్‌లో అభివృద్ధిని నిర్దేశిస్తున్నాయి. మాది సమ్మిళిత వృద్ధి. లైసెన్సుల సంకెళ్లు లేవు. రెడ్ టేపిజం (అవినీతి)ను అంతం చేశాం. పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నాం. భారత్‌కు ప్రయాణం చేయడం, అక్కడ పెట్టుబడి పెట్టడం, పరిశ్రమల్లో, వాణిజ్య సంస్థల్లో కావాల్సినవి తయారు చేసుకోవడం ఇక మరింత సులువు" అన్నారు. "భవిష్యత్‌లో భారత్ అనేది ఓ పెట్టుబడి.. ఈ విషయంలో మీరు నాతో తప్పక ఏకీభవిస్తారు. మాది యువ సమాజం. సమున్నతమైన లక్ష్యాలతో ప్రజ్ఞా ప్రావీణ్యాలతో కూడిన ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు దిశగా మేం ప్రయాణిస్తున్నాం. మా వద్ద సాంకేతికంగా అత్యున్నత పరిజ్ఞానం గల మేధో శక్తి ఉంది, పరిశోధనాగారాలున్నాయి. 2025కల్లా ఐదు లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ సాధన దిశగా కదులుతున్నాం. 2025 నాటికి ప్రపంచంలోనే అతి పెద్ద వినియోగదారులున్న మార్కెట్‌గా భారత్ ఎదుగుతుంది. అత్యంత విశ్వసనీయమైన ప్రభుత్వం గల దేశాల్లో మాది మూడో స్థానం. మాది సుస్థిర ప్రజాస్వామ్యం. గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీ మా ఆర్థిక సంస్కరణల్ని చూసి మా ర్యాంకును పైకి తీసుకెళ్లింది. జీవితంలో మీకు కావాల్సినవన్నీ ఇండియాలో లభిస్తాయి. పెట్టుబడులకు ఒకే ఒక గమ్యంగా మీరు భారత్‌ను ఎన్నుకోవచ్చు" అని వివరించారు. 1997లో నాటి భారత ప్రధాని దావోస్ వచ్చినప్పుడు ఇండియా జీడీపీ 400 బిలియన్ డాలర్లు.. ఇప్పుడదని ఆరు రెట్లు పెరిగిందని గుర్తుచేశారు. సులభతర వ్యాపార నిర్వహణ నుంచి సులభ జీవనం వైపు పయనిస్తున్నామన్నారు.

భారత్.. నిర్ణయాత్మక దేశం

"మాది ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యమే కాదు, నిర్ణయాత్మకమైనది కూడా! నగదు రహిత వ్యవస్థ, ఏకీకృత పన్నుల వ్యవస్థ ల ఏర్పాటులే దీనికి ఉదాహరణ. డిజిటల్ లావాదేవీలు ఇపుడు మా ఆర్థిక వ్యవస్థలో ఓ అంతర్భాగం..జీఎస్టీ ఆమోదం ఓ చరిత్మాత్మక సన్నివేశం. మే కలలు గనే, మీరు కోరుకునే "ఒకే దేశం- ఒకే పన్నుల విధానం" ఇపుడు సాకారమయ్యింది. ఆధునిక పన్నుల విధానం దిశగా మా ప్రయాణం ఆరంభమైంది. ఈ విధానం పారదర్శకమైనది, స్థిరమైనది, ఊహించగలిగిన రీతిలో ఉన్నది" అని ప్రధాని వివరించారు. భారత సమాజం విభిన్నతల సమాహారమని. నిర్ణయాత్మకమైన రాజకీయ వ్యవస్థ గలదని వెల్లడించారు. "భిన్నత్వంలో ఏకత్వం మా మార్గం. అందరితో కలిసి అందరి వికాసం కోసం.. అన్నది మా ప్రస్తుత విధానం" అని ఆయన చెప్పుకొచ్చారు.

ప్రపంచీకరణ దశలో స్వీయ రక్షణా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న స్వీయరక్షణ విధానాల్ని మోదీ తీవ్రస్థాయిలో విమర్శించారు. అమెరికా పేరుగానీ, అమెరికా ఫస్ట్ అన్న విధానాన్ని గానీ ప్రస్తావించకుండా.. "స్వీయరక్షణ విధానం అనేది ప్రపంచానికి ఇపుడు పెను సవాల్‌గా మారింది. ఇది ఉగ్రవాదం కంటే ప్రమాదకరమైనది. ముఖ్యంగా ప్రొటెక్షనిజం.. సుంకాల విధింపుతో కొన్ని, లేకుండా మరి కొన్ని అడ్డంకులు సృష్టిస్తున్నారు. ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు, ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య చర్చలు నిల్చిపోయాయి. దీనికి కారణం.. 'మాది మాకే' అనే విధానం. గ్లోబలైజేషన్ పెరుగుతున్న ఈ దశలో స్వీయరక్షణ విధానాలు తలలెగరేస్తున్నాయి" అని మోదీ పరోక్షంగా ట్రంప్‌ను దుయ్యబట్టారు. ఇదే సదస్సులో ట్రంప్ మూడో రోజున ప్రసంగించనున్న దశలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇది అక్కడికొచ్చిన ప్రతినిధుల్లో చర్చనీయాంశమైంది.

మూడే సవాళ్లు..

"ప్రపంచానికి సవాల్ విసురుతున్న అంశాలు ఇపుడు మూడే మూడు.. ఉగ్రవాదం, స్వీయరక్షణ విధానం, వాతావరణ మార్పులు..వీటిని సమైక్యంగా ఎదుర్కోవాలి" అన్నారు మోదీ. యువతలో తీవ్రవాద ధోరణి ప్రబలుతోందని, ఇది సమాజానికే చేటు అని.. దీన్ని నివారించేదిశగా దేశాలు కృషి చేయాలని అన్నారు. యువతకు తగిన ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఇది అంతమవుతుందన్నారు. తన ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల గురించి చెబుతూ.. "రిఫార్మ్, పెర్ఫార్మ్ అండ్ ట్రాన్స్‌ఫార్మ్ అన్నది మా నినాదం. అన్ని రంగాల్లో సంస్కరణలు తెచ్చాం. నోట్ల రద్దు, డిజిటలీకరణ ద్వారా ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించాం. జీఎస్టీ ద్వారా పన్నుల వ్యవస్థను సంస్కరించాం. ప్రత్యక్ష పన్నుల వ్యవస్థను మార్చాం. బ్యాంకింగ్ రంగంలో మార్పులు తెచ్చాం. ఆధార్ ద్వారా ఒక చట్టబద్ధతను తెచ్చాం. అవినీతిపై పోరాటం, ద్రవ్యోల్బణంపై అదుపు సాధించాం. ద్రవ్యలోటును క్రమేణా తగ్గించుకుంటూ వస్తున్నాం. గడచిన మూడేళ్లుగా వ్యవస్థాగత మార్పులెన్నో తెచ్చాం. ఆ క్రమంలో మా దేశంలోని రాష్ట్రాలు కూడా అభివృద్ధిలో పోటీ పడడం ఎక్కువయ్యింది.. దీన్ని కాంపిటిటివ్ ఫెడరలిజం అని చెప్పొచ్చు" అని పేర్కొన్నారు.

ఇవీ మా లక్ష్యాలు

"2013-14లో మా దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 36 బిలియన్ డాలర్లుండగా.. 2016-17లో అవి 60 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 90 శాతం పెట్టుబడుల అప్లికేషన్లు ఆటోమేటిక్‌గా ఏ ఇబ్బందులూ లేకుండా అనుమతి పొందాయి. సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అన్ని రాష్ట్రాల్లో పెరిగింది. ఆదాయ అసమానతలు అంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జన్ ధన్ యోజన.. ఇవన్నీ ఆ దిశగా తీసుకున్న చర్యలే" అని మోదీ వివరించారు. భారత్ లక్ష్యాలను వివరిస్తూ.. "50 కోట్ల ఇళ్ళను పేదలకు కట్టాలనుకుంటున్నాం. 50 నగరాల్లో మెట్రో రైల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఎల్ఈడీ బల్బుల నుంచి భారీ ట్రాన్స్‌మిషన్ లైన్ల దాకా, వంటగ్యాస్ సరఫరా నుంచి నేషనల్ గ్యాస్ గ్రిడ్ దాకా, రోడ్ల నిర్మాణం నుంచి నౌకాశ్రయాల నిర్మాణం దాకా, 400 రైల్వే స్టేషన్లలో విద్యుదీకరణ.. ఇలా ఎన్నో లక్ష్యాలున్నాయి. వీటికి మీ సహకారం కావాలి. అందుకే మాది పెట్టుబడుల కేంద్రం..మీకు ఎంతో అవకాశం" అని విశదీకరించారు.


షేరింగే.. కేరింగ్ లేదు

అందరూ ఉన్నా ఆత్మీయతల్లేవు.. అందరిలో ఒంటరి బతుకు మనది: మోదీ

దావోస్ సదస్సులో తొలిరోజునే ప్రారంభోపన్యాసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ -తన ప్రసంగంలో అనేక వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలూ చేశారు. భారతీయ జీవన విధానాన్ని, ఔన్నత్యాన్ని విశదీకరించారు.. మీ పెట్టుబడులకు సరైనదీ, స్వర్గధామమైనదీ భారతేనని పిలుపినిచ్చారు. ఆయన మాటల్లోని కొన్ని గుళికలు ఇవీ...

"మనల్ని సోషల్ మీడియా కలుపుతోంది.. కేవలం కలుపుతోందే తప్ప మనల్ని ఒకరినొకర్ని అనుసంధానించట్లేదు..మనం ఎక్కువగా మాట్లాడుతున్నాం, కానీ వినడం లేదు.. న్యూస్‌ని, అభిప్రాయాల్ని షేర్ చేసుకుంటున్నాం తప్ప మన దార్శనికతను కాదు.. నూతన సంవత్సర శుభాకాంక్షల్ని కేవలం ఒకరికొకరు ఫార్వర్డ్ చేసుకుంటున్నాం తప్ప రాయడమో, మౌఖికంగా చెప్పుకోవడమో చేయట్లేదు.. షేరింగ్ చేసుకుంటున్నాం తప్ప కేరింగ్ లేదు.. ఇపుడు కావాల్సినది ఒకరంటే ఒకరికి శ్రద్ధ, సంరక్షణ ఉండాలి.. పరస్పరం పట్టించుకోవాలి..అందరూ ఉన్నా ఆత్మీయతల్లేవు.. అందరిలో ఒంటరి బతుకు కారాదు"

- మనిషి జీవితంలో దురదృష్టకరమైన అంశం ఏంటంటే- అన్నీ ముక్కలయ్యేట్లు చేసి ఆ తరువాత ఆ ముక్కల్ని అతకడానికి ప్రయత్నించడం. మనం ముందు చింపేస్తాం, తరువాత వాటిని కుట్టడానికి ప్రయత్నిస్తాం... కానీ అప్పటికే చాలా ఆలస్యమైపోతుంది.
- మంచి ఆలోచనల వల్ల సత్ఫలితాలొస్తాయి.. చెడ్డ ఆలోచనలు చేస్తే ఫలితాలూ చెడ్డగానే ఉంటాయి.
- మనిషి తనపై తాను గెలవడమే నిజమైన విజయం అనుకుంటాడు. గెలవాల్సింది మన మనసుపై.. అంటే మనస్సును నిగ్రహంతో ఉంచుకోవాలి..ఇదే మన సిసలైన శక్తి.. ప్రపంచ దేశాలన్నీ దీన్ని గుర్తిస్తున్నాయి.



- సమగ్రత- సంపూర్ణతలను భారత్ ఎల్లపుడూ విశ్వసిస్తుంది.. పాటిస్తుంది. .. ఈ విశ్వం, సృష్టి, మనుష్య జాతి..అన్నీ సంపూర్ణమైనవి..అవి ఆ పరాత్పరుడి ప్రతినిధులు... ఆ పరాత్పరుడు సంపూర్ణమైన శక్తి. వసుధైక కుటుంబ భావనని మేం యుగాలనాడే అలవర్చుకున్నాం.
- ప్రపంచంలోని ఓ మూల నుంచి ఇంకో మూలకు వెళ్ళడానికి సాధనాల్లేని రోజుల్లోనే అందరం ఒకటే అన్న భావన ఉండేది..కలిసిమెలిసి జీవించే తత్త్వం గట్టిగా ఉండడం వల్ల అది సాధ్యపడింది.. దూరాలను అధిగమించింది.
- హింసకు భారతీయ సంవిధానంలో చోటు లేదు.. హింసను ప్రేరేపించం.. చేతలు ఎటూ ఉండవు, కనీసం మాటల్లో కూడా హింసను సమర్థించం. ప్రకృతి మీద, జంతువుల పైన కూడా హింసకు తావివ్వం..
- ఆపదలో ఉన్నవాడు పొరుగునే ఉన్నా, సుదూరంలో ఉన్నా పరిగెత్తుకు వెళ్ళి సాయపడ్తాం. కొన్ని యుద్ధాలు మేం చేసి ఉండవచ్చు, కానీ వాటిలో వ్యూహాత్మక ప్రయోజనాలేవీ లేవు.. ఆ యుద్ధాలకీ ఓ కారణం ఉంటుంది..ఓ బాధ్యతను నెరవేర్చడానికి ఆ యుద్ధం చేయాల్సి వస్తుంది
- శతాబ్దాల పాటు ఈ వనరులు, సంపద అన్నీ ప్రకృతివీ, భగవంతుడివీ అని నమ్మాం.. మేమంతా- అంటే రాష్ట్రపతులు, ప్రధానులు, రాజులు, రాణులు ఆ సంపదకు ట్రస్టీలం మాత్రమే నని భావించాం. మహాత్మాగాంధీ కూడా దీన్నే ప్రవచిస్తూ వచ్చారు. మనిషి అవసరాలకు తగినంత ప్రకృతిలో ఉంది.. మనిషి ఆశకు పేరాశకు తగినంత మాత్రం కాదు అని ఆయన అనేవారు.. దురాశ పెరక్కుండా - జ్ఞానం, వైరాగ్యాల గురించి పెద్దల బోధలు కాపాడేవి..

అప్పటికి గూగుల్ పుట్టలేదు!

- అమెజానంటే అడవులు.. ట్వీటింగ్ పిట్టల పని
- 1997కి ఇప్పటికి తేడాలు చెప్పిన మోదీ

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ప్రసంగించిన మోదీ.. 1997లో దేవెగౌడ ఆ వేదికపై ప్రసంగించినప్పటికి.. ఇప్పటికి వచ్చిన తేడాల గురించి ఆసక్తికరంగా వివరించారు. "1997లో నాటి భారత ప్రధాని హెచ్.డి.దేవెగౌడ దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరానికి హాజరయ్యారు. అప్పట్లో డబ్ల్యూఈఎఫ్ లక్ష్యం.. అనుసంధానమైన సమాజాన్ని నిర్మించడం. అప్పట్లో యూరో లేదు. ఆసియా ఆర్థిక సంక్షోభం లేదు. బ్రెక్సిట్ సంకేతాలు కూడా లేవు. ఒసామా బిన్‌లాడెన్ గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. హ్యారీపోటర్.. ఎవరూ వినని పేరు. గూగుల్ లేదు. నెట్‌లో అమెజాన్ గురించి సెర్చ్ చేస్తే.. నదులు, అడవుల గురించి సమాచారం వచ్చేది. ట్వీటింగ్.. పిట్టల పని.. మనుషులది కాదు" అని మోదీ చెబుతుంటే ఆహూతులందరూ చిరునవ్వుతో ఆలకించారు.



దావోస్ జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం 2018 సదస్సులో మంత్రి కేటీఆర్‌తో ఏపీ మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీ గల్లా జయదేవ్

నమో భారత్

చరిత్రాత్మకం ఈ పర్యటన: కేంద్రం

దావోస్, జనవరి 23: డబ్ల్యూఈఎఫ్‌లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాత్రి స్వదేశానికి పయనమయ్యారు. "చరిత్రాత్మకమైన పర్యటన ఇది. విజయవంతంగా ముగించుకుని ప్రధాని ఢిల్లీ బయలుదేరారు" అని విదేశాంగ శాఖ ప్రతినిధి ట్వీట్ చేశారు. "రెండు దశాబ్దాల అనంతరం ఈ సదస్సుకు హాజరైన తొలి ప్రధాని మోదీయే. ఆయన ప్రసంగానికి మంచి స్పందన లభించింది. అనేక ప్రపంచదేశాల నేతలను, వాణిజ్య ప్రముఖులను ప్రధాని కలిశారు" అని పేర్కొన్నారు. భారత్ అంటే వ్యాపారం.. అని ప్రపంచానికి చాటిచెప్పారని విదేశాంగ ప్రతినిధి వివరించారు. "ముక్కలవుతున్న ప్రపంచంలో పరస్పరం సహకారంతో భవిష్యత్‌కు బాటలు వేయాలన్నది దావోస్ సదస్సు నినాదం. ఇది ఎన్నో ఆలోచనలు రేకెత్తించేది.. రానున్న తరాలకు మంచి భవిష్యత్తు అందించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేలా చేసే నినాదమిది." అని మోదీ కూడా ఓ ట్వీట్‌లో వ్యాఖ్యానించారు. దావోస్ సదస్సులో ప్రసంగం ప్రధాని నరేంద్ర మోదీకి ఓ రకంగా వ్యక్తిగత విజయం.. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమెరికా సహా పశ్చిమదేశాలు ఆయనను ఓ హిందూ అతివాదిగా అభివర్ణించాయి.. ఆయనకు వీసా సైతం నిరాకరించాయి.. అలాంటిది ఇపుడు దాదాపు 130 దేశాల ప్రతినిధులు, సీఈఓల ఎదుట ఆయన భారతావని టాప్ సీఈవోగా, దేశ ప్రతినిధిగా తన వాణి వినిపించడం విశేషమని పశ్చిమదేశాల వార్తా ప్రసార సాధనాలు కొన్ని కథనాలను ప్రచురించాయి.. ప్రసారం చేశాయి.


బాబుతో కేటీఆర్ భేటీ

- దావోస్‌లో కలుసుకున్న నేతలు.. ట్విట్టర్‌లో ఫొటో పెట్టిన మంత్రి
- లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు.. పలు దేశాల ప్రముఖులతో భేటీ

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు మంగళవారం దావోస్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్.. అక్కడ చంద్రబాబును కలుసుకున్నారు. చంద్రబాబుతో దిగిన ఫొటోను కేటీఆర్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అక్కడే ఏపీ మంత్రి నారా లోకేశ్, ఎంపీ గల్లా జయదేవ్‌ను కూడా కలిశారు. లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపానని, గల్లా జయదేవ్‌తో సుహృద్భావ సమావేశం జరిగినట్లు కేటీఆర్ ట్వీట్ చేశారు. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని కలిసిన ఫొటోను కూడా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. డబ్ల్యుఈఎఫ్‌లో భాగంగా ఈ నెల 25న 'లివరేజింగ్ డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ' అనే అంశంపై జరగనున్న సదస్సులో కేటీఆర్ ప్రసంగించనున్నారు. అదే రోజున కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు పాల్గొనే రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడతారు. తెలంగాణ ఏర్పడిన మూడేళ్లలోనే వివిధ రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. డబ్ల్యుఈఎఫ్‌లో తెలంగాణలో వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రపంచదేశాలకు పరిచయం చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పలు దేశాల ప్రముఖులు, కంపెనీల ప్రతినిధులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ప్రధానంగా ఇండోరమా వెంచర్స్ చైర్మన్ అలోక్ లోహియాను కలిశారు. తెలంగాణలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తానని లోహియా ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణలోని టెక్స్‌టైల్స్ పరిశ్రమలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మంత్రి ఆయనకు వివరించారు. వరంగల్ మెగాటెక్స్‌టైల్ పార్కు దేశంలోనే అతిపెద్దదని, ఇందులో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

షారుక్.. శభాష్!

- దావోస్‌లో క్రిస్టల్ అవార్డు.. ప్రశంసించిన చంద్రబాబు



"గొప్ప నాయకుడు కావడానికి, సమాజాన్ని మెరుగైన భవిష్యత్తు దిశగా నడిపించడానికి ఒక వ్యక్తి రాజకీయ నేత కానక్కర్లేదు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో క్రిస్టల్ అవార్డు అందుకున్న షారుక్‌కు అభినందనలు" ..అంటూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు షారుక్‌ఖాన్‌ను ప్రశంసించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదికలో పాల్గొంటున్న చంద్రబాబు.. షారుక్ క్రిస్టల్ అవార్డు అందుకున్న అనంతరం ట్విటర్ ద్వారా ఇలా అభినందించారు. షారుక్‌ఖాన్ తన మీర్ ఫౌండేషన్ ద్వారా బాలలు, మహిళల హక్కుల కోసం కృషి చేస్తున్న నేపథ్యంలో ఈ అవార్డు అందుకున్నారు. ఆయనతోపాటు హాలీవుడ్ నటి కేట్ బ్లాంచెట్, లెజెండరీ సంగీత కళాకారుడు ఎల్టన్‌జాన్ కూడా ఈ అవార్డు అందుకున్నారు.

పిల్లలకు సహనం నేర్పండి

దావోస్, జనవరి 23: "మనందరం మన పిల్లలకు దయ, సహనం, పంచుకునే గుణాలను నేర్పాలి" అని హాలీవుడ్ నటి కేట్ బ్లాంచెట్ అన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు దీనికి భిన్నమైన సందేశాన్నిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో క్రిస్టల్ అవార్డు అందుకున్న అనంతరం ఆమె మాట్లాడారు.

అది కూడా చెప్పాల్సింది.. రాహుల్ ట్వీట్



దేశంలోని 73 శాతం సంపద- ఒకశాతం మంది చేతుల్లోనే పోగుపడడానికి కారణాలను ప్రధాని నరేంద్ర మోదీ దావోస్‌లో ప్రపంచదేశాలకు చెప్పాల్సిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. పెరుగుతున్న ఆదాయ అసమానతలకు కారణాలెవరో దావోస్ సదస్సులో చెప్పి ఉండాల్సిందని పేర్కొన్నారు. దీనికి ఆయన- సోమవారం నాడు ఆక్స్‌ఫామ్ ఇండియా సంస్థ నివేదికను ట్యాగ్ చేశారు. బీజేపీ దీనిపై మండిపడింది. "మీ కుటుంబానికి పేటెంట్‌గా వచ్చిన నెహ్రూ కాంగ్రెస్ దారిద్ర్య అభివృద్ధి విధానాల విపరిణామాలే దీనికి కారణం.. ఇందువల్ల లాభపడింది కాంగ్రెస్సే. మీ విధానాలతోనే పేదరికం పెరిగింది. గురివింద తన నలుపెరగదన్న సామెత చందంగా ఉంది ఇది" అని బీజేపీ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ఘాటుగా స్పందించారు.

భారతీయులకు గర్వకారణం

- మోదీ ప్రసంగంపై అమిత్ ట్వీట్

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం అద్భుతంగా ఉందని, అది ప్రతి భారతీయుడినీ గర్వపడేలా చేసిందని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా అన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని మంగళవారం ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. భారత్ శక్తిసామర్థ్యాలను, ఆకాంక్షలను దావోస్ వేదికగా మోదీ చక్కగా చెప్పారని ఆయన ప్రశంసించారు. "మొత్తం ప్రపంచమంతటికీ భారత్ వినూత్నమైన అవకాశాలు కల్పిస్తుంది. సంపద, సౌభాగ్యం, ఆరోగ్యం, శాంతి, అభివృద్ధిలు అందిస్తుంది. మన వేదాలు, పురాణాలు వేల సంవత్సరాల క్రితమే వసుధైక కుటుంబ స్ఫూర్తిని చాటిచెప్పాయి" అని ఆయన అమిత్‌షా ట్వీట్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.